


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 17 గురువారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 213

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్

- కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- మే 13న ముగియనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం
- మే 14న నూతన సీజేఐగా ప్రమాణం చేయనున్న జస్టిస్ బీఆర్ గవాయ్



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీ.ఆర్. గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆయన పేరును ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేశారు.సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మే 13వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత రోజు మే 14న నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్. గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ గవాయ్ నవంబర్ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన ఆరు నెలల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు.కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి చేపడుతున్న రెండో దళిత జడ్జి జస్టిస్ గవాయ్. ఆయన మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. మహారాష్ట్ర హైకోర్టు జడ్జిగా పనిచేసిన

## కొండెక్కిన బంగారం

- రూ.98,000 దాటిన బంగారం ధర
- ఒక్కరోజులోనే రూ. 1,650 పెరిగిన పసిడి ధర
- హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.97,700
- రూ.1 ,900 పెరిగిన కిలో వెండి ధర



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
బంగారం ధర సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.98 వేలు దాటింది. ఢిల్లీలో ఒక్కరోజులోనే రూ. 1,650 పెరిగి రూ.98,100ను తాకింది. సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి రూ.97,700 కు చేరుకుంది.
వెండి ధర కూడా భారీగానే పెరిగింది. కిలో వెండి రూ. 1,900 పెరిగి రూ.99,400లకు చేరింది. మంగళవారం కిలో వెండి రూ. 97,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3,318 డాలర్లకు చేరుకుంది. గోల్డ్‌మన్ శాక్స్ అంచనా ప్రకారం బంగారం ధరలు ఈ ఏడాది చివరి నాటికి రూ. 1.25 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య యుద్ధం, ట్రంప్ సుంకాల ప్రభావంతో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి.

**గద్దర్ జ్యూరీ అవార్డుల కమిటీ చైర్మన్‌గా జయసుధ** 2

## ఆలయ బోర్డుల్లో ముస్లింలకు చోటిస్తారా?

2

- వక్ఫ్ పిటిషన్లపై కేంద్రానికి సుప్రీం ప్రశ్న..!
- వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 73 పిటిషన్లపై
- సుప్రీంకోర్టులో త్రిసభ్య ధర్మాసనం విచారణ
- సుప్రీం ప్రశ్నలకు వ్యవధి అడిగిన సొలిసిటర్ జనరల్



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
కేంద్ర ప్రభుత్వం గత నెలలో పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభమైంది. దాదాపు 73 పిటిషన్లపై సుప్రీంకోర్టులో ఛీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్రానికి కీలకమైన ప్రశ్నలు వేసింది. వక్ఫ్ చట్టంలో కేంద్రం చేసిన సవరణలపై సుప్రీంకోర్టు ఇవాళ కొన్ని

## విద్యార్థులపై విష ప్రయోగం

- 30 మంది విద్యార్థులపై విషప్రయోగం
- తాగునీటి ట్యాంకుతో పాటు మధ్యాహ్న భోజన సామాగ్రిపై చల్లిన విషం
- సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురిలో ఘటన
- నిందితుడి అరెస్టు..కుటుంబ సమస్యల వల్లే ఈ ఘాతుకం



2

**ఇచ్చోడ-నవభూమిప్రతినిధి:** ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హృదయాన్ని కలిచివేసే ఘటన చోటుచేసుకుంది. స్కూల్ తాగునీటి ట్యాంకులో దుండగులు పురుగుల మందు కలపడం తీవ్ర కలకలంగా మారింది. అంతే కాకుండా మధ్యాహ్న భోజనం సామాగ్రిపై కూడా విషం చల్లారు. అయితే సిబ్బంది అప్రమత్తతతో ఈ పెను ప్రమాదం తప్పి 30 చిన్నారుల ప్రాణాలకు ముప్పు తప్పింది. దీంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఏం జరిగిందంటే... ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ పాఠశాలకు గత శనివారం, ఆదివారం సెలవుల నేపథ్యంలో.. సిబ్బంది వంట గదికి తాళం వేసి ఇంటికెళ్లారు. సోమవారం ఉదయం వంట చేసే ముందు పాత్రలు కడుగుతుండగా వాటిలోంచి చెడు వాసనతో పాటు నురుగలు

## తెలంగాణ సర్కార్‌కు సుప్రీం చురకలు

2

- కంచ గచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై సుప్రీం నిలదీత
- హెచ్‌సియుకు చెందిన 400 ఎకరాల ఆటవీభూమి నరికివేతకు అటవీశాఖ అనుమతి తీసుకున్నారా?
- చెట్ల నరికివేత వల్ల ఆవాసాలను కోల్పోయిన వణ్యప్రాణులను రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి
- వన్యప్రాణుల స్థితిగతులపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక అందజేయాలంటూ అటవీ మంత్రిత్వ శాఖకు ఆదేశం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో చెట్ల నరికివేత వ్యవహారం మరో మలుపు తిరిగింది. దేశ అత్యున్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇందులో జోక్యం చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వానికి మరో విడత కీలక ఆదేశాలను జారీ చేసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల అటవీ భూమిలో కొద్దిరోజుల కిందట చెట్ల నరికివేత విస్తృతంగా కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. ఫలితంగా అక్కడ తలదాచుకుంటోన్న వణ్యప్రాణులు, పక్షులు ఆశ్రయాన్ని కోల్పోయాయంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులు కొన్ని రోజులుగా నిరసన

## ఏపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఖరారు

- రాయలసీమకు చెందిన సీనియర్ పార్టీ నేతకు పదవి
- పులివెందుల ప్రాంతానికి చెందిన రెడ్డి వర్గానికి చెందిన నేతకు ఖరారు చేసినట్లు సమాచారం
- రేపో మాపో అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం
- అధ్యక్ష పదవికోసం పోటీ పడ్డ ఎమ్మెల్సీ మాధవ్,జీవీఎల్

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
బీజేపీ ఈ సారి దక్షిణాది రాష్ట్రాల పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో బలం పెంచుకోవటానికి ఇదే సరైన సమయంగా పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర నేతలకు పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. అందులో భాగంగా ఏపీ పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకం పైన సుదీర్ఘ కసరత్తు చేసింది. సామాజిక - ప్రాంతీయ సమీకరణాల ను పరిగణలోకి తీసుకొని.. చివరగా సీమ ప్రాంతానికి పదవి ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏపీ నూతన అధ్యక్షుడిగా ఏపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడు దాదాపు ఖరారయ్యారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ సొంతంగా బలోపేతం కావటం పైన కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంతో, ప్రస్తుతం అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకం పైన పార్టీ నాయకత్వం కసరత్తు చేసింది. రాయలసీమకు చెందిన సీనియర్ పార్టీ నేతకు రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రధాని మోదీ టీం ఖరారు చేసినట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం పార్టీలోని పలువురు నేతలు పోటీ పడ్డారు. అయితే, తొలి నుంచి పార్టీ కోసం పని చేస్తూ సాధారణ కార్యకర్త నుంచి ఎదిగిన వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. అదే సమయంలో రాయలసీమ ప్రాతం నుంచి ఈ సారి అవకాశం ఇవ్వాలని డిసైడ్ అయిన మేం`కు నిర్ణయం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. సీమ నుంచి కొత్తగా ఏపీలో మారుతున్న రాజకీయాలతో బీజేపీ తమ వ్యూహాలకు పదును పెట్టింది. భవిష్యత్ పార్టీ అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది. టీడీపీ, జనసేనతో పొత్తు కొనసాగుతున్న వేళ రెడ్డి సామాజిక వర్గానికి లేదా బీసీ నుంచి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆలోచన చేసారు. ఉత్తరాంధ్ర నుంచి బీసీ వర్గానికి చెందిన ఇద్దరు పేర్లు తుది పరిశీలన వరకు వచ్చాయి. అయితే,

## డేంజర్ బెల్స్!

- ప్రమాదంలో హైదరాబాద్..
- అడుగంటిన భూగర్భ జలాలు..
- వాటర్ ట్యాంకర్లే దిక్కు..!



హిమాయత్ సాగర్‌లో తగ్గిన నీటిమట్టం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
విశ్వనగరంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ లో నీటి కష్టాలు మొదలయ్యాయి. చాలా చోట్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. జనవరి నుంచి మార్చి నెలాఖరుకే గ్రేటర్‌లో భూగర్భ జలాలు 25 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. మే చివరి నాటికి ప్రమాదకర స్థాయిలో నీటి నిల్వలు మరింత పడిపోతాయని భూగర్భశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెలలో ఎండలు మరింత ముదిరే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ ప్రజలు నిత్యం ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ట్రాఫిక్ రద్దీ, అకాల వర్షాలు, వరదలు అయితే తాజాగా నగర వాసులకు మరో కష్టం వచ్చి పడింది. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు అడుగంటినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది జనవరితో పోలిస్తే.. ఈ ఏడాది జనవరిలో చాలా వరకు భూగర్భ జలాలు అడుగంటినట్లు గుర్తించారు. కూకట్‌పల్లి ప్రాంతంలో అత్యధికంగా 25.9 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్లినట్లు అధికారులు అంచనా వేశారు. మరోవైపు కూకట్‌పల్లి జోన్‌లో భారీ భవనాల నిర్మాణం వల్ల నీటి లభ్యత తగ్గిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మే చివరినాటికి ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండే అవకాశం ఉందని భూగర్భజల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అత్యధిక ప్రాంతాల్లో గత ఏడాదికంటే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గినట్లు భూగర్భ జల అధికారుల సర్వేలో తేలింది. గ్రేటర్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు 53 ప్రదేశాల్లో భూగర్భ జలాల వివరాలను తెలంగాణ ప్రభుత్వ భూగర్భజల వనరుల శాఖ విశ్లేషించింది. ఈ విశ్లేషణలో గతేడాది జనవరి కంటే ఈ ఏడాది జనవరిలో భూగర్భ జల మట్టాలు 1.33 మీటర్లు తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా 53 ప్రాంతాల్లో విశ్లేషించగా.. 33 ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. 2024 జనవరి కంటే జలాలు అడుగంటిపోగా మరో 20 ప్రాంతాల్లో మెరుగ్గా ఉన్నట్లు వెల్లడించారు. 2024 డిసెంబరు, ఈ

## తానా వల్ల ఉద్యోగాలకు ఉద్వాసన?

- అమెరికాలో 200 మంది తెలుగు ఉద్యోగుల అవుట్?
- తెలుగు సంఘాలతో కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతోనే ఉద్వాసన
- తెలుగు సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలకు కంపెనీల తరపున మ్యాచింగ్ ఫండ్స్ ఇప్పించే క్రమంలో అక్రమాలు
- తాజాగా ఫానీ మే అనే సంస్థ 200 మందికి ఉద్వాసన




**ఢిల్లీ-నవభూమిబ్యూరో**
అమెరికాలో ఉంటున్న తెలుగు వారికి సేవ చేసే లక్ష్యంతో పుట్టుకొచ్చిన తెలుగు సంఘాలు ఇప్పుడు వారి ఉసురు తీశాయి. తెలుగు సంఘాలతో కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతో 200 మంది తెలుగు ఉద్యోగుల్ని వారు పనిచేస్తున్న ఓ సంస్థ తొలగించింది. దీంతో ఈ వ్యవహారం అమెరికాలో తీవ్ర కలకలం రేపుతోంది. అసలే ఓవైపు ట్రంప్ ప్రభుత్వ వలస విధానాలు, వీసా ఆంక్షల నేపథ్యంలో ఇబ్బందులు పెరుగుతున్న తరుణంలో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఫానీ మే అనే సంస్థలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడ పనిచేస్తున్న తెలుగు సంఘం తానాతో కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో నైతిక కారణాలపై 200 మంది తెలుగు ఉద్యోగులపై వేటు పడింది. వీరిని ఉద్యోగాల నుంచి తప్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. అమెరికా ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్స్ కార్యక్రమాన్ని దుర్వినియో గం చేసి వీరు అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు తేల్చి నట్లు సమాచారం. ఈ ఏడాది ఆరంభంలోనే క్యాపర్టినోకు చెందిన ఉద్యోగుల్ని కూడా సరిగ్గా ఇవే ఆరోపణలతో తొలగించారు. అలాగే యాపిల్ సంస్థ కూడా 100 మంది ఉద్యోగుల్ని ఇలాగే తొలగించింది. ఇప్పుడు మరోసారి ఫానీ మే సంస్థలో ఇలాంటి స్కాం చోటు చేసుకుంది. దీంతో మొత్తం 700 మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో 200 మంది తెలుగు వాళ్లే ఉన్నట్లు సమాచారం. దీంతో అమెరికాలో తెలుగు సంఘాల పాత్రపై చర్చ జరుగుతోంది. అమెరికాలో తెలుగు సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలకు కంపెనీల తరఫున మ్యాచింగ్ ఫండ్స్ ఇప్పించే క్రమంలో అక్రమాలపై తెలుగు ఉద్యోగులు తమ ఉద్యోగాలు పోగొట్టుకోవడం చర్చనీయాంశమవుతోంది.

**వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటీ కృష్ణవేణి అరెస్ట్** 2

**ఆ దేశాలకు భారీగా తగ్గిన భారత విద్యార్థుల సంఖ్య..** 2

## పబ్‌లో అశ్లీల నృత్యాలు

- 16 మంది అమ్మాయిలు అరెస్ట్
- చైతన్యపురిలోని వైల్డ్ హార్ట్స్ పబ్‌లో అశ్లీల నృత్యాలు
- ఆకస్మిక దాడులు నిర్వహించిన ఎస్వోటీ పోలీసులు
- పరారీలో పబ్ యజమాని, మేనేజర్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
హైదరాబాద్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పబ్ పై ఎల్బీనగర్ ఎస్వోటీ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. పబ్ లో అశ్లీల నృత్యాలు చేస్తున్న 16 మంది యువతులు, డీజే ఆపరేటర్ ను అదుపులోకి తీసుకున్న ఎస్వోటీ పోలీసులు వారిని చైతన్యపురి పోలీసులకు అప్పగించారు.
ఈ సందర్భంగా చైతన్యపురి సీఐ వెంకటేశ్వరావు మీడియాతో మాట్లాడుతూ... స్టేషన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా వైల్డ్ హార్ట్స్ పబ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. పబ్ లోకి ఫ్రీగా ఎంట్రీ కల్పిస్తూ... యువతులను ఎరవేసి ఒక్కొక్కరి నుంచి వేలాది రూపాయల వసూలు చేస్తున్నారని వెల్లడించారు.
పబ్ కు వచ్చిన యువకుల వద్దకు అమ్మాయిలను పంపుతూ, వారితో అశ్లీల నృత్యాలు చేయిస్తూ, ఎక్కువ మద్యం తాగేలా చేస్తూ అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని సీఐ తెలిపారు. 16 మంది యువతులను, డీజే ఆపరేటర్ ను అదుపులోకి తీసుకున్నామని... పబ్ యజమాని రాము, మేనేజర్ సంతోష్ లు పరారీలో ఉన్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## స్మితా సబర్వాల్‌కు షాకిచ్చిన పోలీసులు!

- కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల అడవి ధ్వంసానికి సంబంధించిన ఓ ఏఐ సహాయంతో రూపొందించిన ఫొటోను షేర్ చేసిన స్మితా సబర్వాల్
- దీనిపై నోటీసులు జారీ చేసిన పోలీసులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యువత అభివృద్ధి, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు అందించారు. సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల అడవి ధ్వంసానికి సంబంధించిన ఓ ఏఐ సహాయంతో రూపొందించిన ఫొటోను షేర్ చేయడం ఇందుకు కారణం కావడం గమనార్హం. ఈ ఫొటో మార్చి 31న హాయ్ హైదరాబాద్‌అనే ఎక్స్ సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఈ ఫొటో మష్రూమ్ రాక్ వద్ద బుల్‌డోజర్లు, వాటిని చూస్తున్న


## త్వరలో రాజకీయాల్లోకి

2

- వరుసగా రెండో రోజు ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా
- గాంధీ కుటుంబంలో భాగం కావటం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని వ్యాఖ్య
- బీజేపీలో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న రాబర్ట్ వాద్రా



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
త్వరలో తాను రాజకీయాల్లోకి వస్తానని రాబర్ట్ వాద్రా స్పష్టం చేశారు. హర్యానా భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆయన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను ఎదుర్కొంటున్నారు. వరుసగా రెండో రోజు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ప్రజల కోసం నిత్యం పోరాడే గాంధీ కుటుంబంలో తాను భాగమని అన్నారు. దాని కారణంగానే తనను, తన కుటుంబాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కూడా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని గుర్తు చేశారు. బీజేపీ తమను ఎంతగా ఇబ్బంది పెడితే అంతలా తాము బలపడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎదురయ్యే ప్రతి సవాలును ఎదుర్కొని ముందుకు సాగుతామని వాద్రా అన్నారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపే



## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు.. 15 జిల్లాలకు అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## ఓయూ పరిధిలో డిగ్రీ కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ



**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్ టైం ఛాన్స్ పరీక్షా ఫీజును వచ్చే నెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 2016-17 విద్యాసంవత్సరంతో పాటు ఆ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరిన వారు ఈ వన్ టైం ఛాన్స్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులని వివరించారు. సాధారణ పరీక్షా ఫీజుతో పాటు ఒక్కో పేపర్‌కు రూ.2,000 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ %www.osmania.ac.in%లో చూసుకోవచ్చని సూచించారు.

## ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్‌వైడీ క్లినికల్ సైకాలజీ రెండు, మూడో సంవత్సరం రెగ్యులర్, బ్యాక్ లాగ్, ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ సెకండ్ పార్ట్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## ఇంకుడు గుంతలు లేని వారికి తీపికబురు.. వాటర్ ట్యాంకర్లకు ఆ చార్జీలు ఉండవ్..

**హైదరాబాద్-నవభూమి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించేందుకు జలమండలి గతంలో తీసుకున్న కీలక నిర్ణయం వాయిదా పడింది. ఇంకుడు గుంతలు నిర్మించుకోని ఇళ్లకు వేసవిలో నీటి ట్యాంకర్లు బుక్ చేసుకుంటే రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలనే ప్రతిపాదనను జలమండలి ప్రస్తుతానికి అమలు చేయడం లేదు. గత వేసవిలో కొన్ని ప్రత్యేక ప్రాంతాల నుండి నీటి ట్యాంకర్ల కోసం భారీ సంఖ్యలో అభ్యర్థనలు రావడంతో జలమండలి లోతుగా విచారణ చేపట్టింది. ఆ సర్వేలో.. చాలా ఇళ్లలో ఇంకుడు గుంతలు లేకపోవడం వల్లే బోర్లు త్వరగా ఎండిపోయి, ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారని గుర్తించారు. దీనిని నివారించడానికి.. జలమండలి ప్రజలకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వాటిని నిర్మించుకోవాలని సూచించింది. అంతేకాకుండా.. సూచనలను పట్టించుకోని వారు వేసవిలో ట్యాంకర్లు బుక్ చేసుకుంటే రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. గత సంవత్సరం నమోదైన ట్యాంకర్ బుకింగ్‌ల సరళిని పరిశీలించిన జలమండలి.. ఈసారి కూడా అవే ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో అభ్యర్థనలు వస్తున్నట్లు గుర్తించింది. దీంతో రెట్టింపు ఛార్జీల వసూలుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించింది. అయితే.. ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకపోవడం.. ఈ ఏడాది నిర్మించుకున్న ఇంకుడు గుంతల వల్ల వెంటనే ప్రయోజనం ఉండకపోవచ్చనే అభిప్రాయంతో.. ఈ నిర్ణయాన్ని వచ్చే ఏడాది వేసవి నుండి అమలు చేయాలని జలమండలి భావిస్తోంది. దీని ఫలితంగా.. ఈ వేసవిలో ట్యాంకర్లు బుక్ చేసుకునే వారందరికీ సాధారణ ఛార్జీలే వర్తిస్తాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో పశ్చిమ ప్రాంతంలోనే బోర్లు ఎక్కువగా ఎండిపోతున్నాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మియాపూర్, ఎస్ఆర్ నగర్, కుత్బుల్లాపూర్, హైటెక్ సిటీ, ఐటీ కారిడార్ వంటి ప్రాంతాల నుండి నీటి ట్యాంకర్ల కోసం అధిక సంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. జలమండలి సేకరించిన వివరాల ప్రకారం.. దాదాపు 42 వేల మంది వినియోగదారులు ఉండగా.. వీరిలో 90 శాతం మంది పశ్చిమ నగర ప్రాంతానికి చెందినవారే ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్నారు. జలమండలి అధికారులు ఈ ఇళ్లను సందర్శించి.. ఇంకుడు గుంతలు లేని 17 వేల మందికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరిస్తూ కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. దీంతో దాదాపు ఐదు వేల మంది ఇంకుడు గుంతలు నిర్మించుకున్నారు.
రూపిరెడ్డి లక్ష్మి.. ఈవిడను చూస్తే రైతేరాజు కాదు రైతే రాణి అనాల్సిందే!ఇంకుడు గుంతలు నిర్మించుకోని వారిపై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో భాగంగా.. ట్యాంకర్ బుకింగ్‌లపై రెట్టింపు ఛార్జీలు విధిస్తామని జలమండలి హెచ్చరించింది. అయితే.. ప్రస్తుతం నిర్మించిన ఇంకుడు గుంతలు ఏ మేరకు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయనేది వచ్చే వర్షాకాలంలో తెలుస్తుంది. దీనితో పాటు ప్రభుత్వం నుండి కూడా స్పష్టమైన ఆదేశాలు లభించకపోవడంతో.. ఈ ఏడాది ట్యాంకర్ల బుకింగ్‌పై అదనపు ఛార్జీల వసూలు నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థులపై విష ప్రయోగం.. సంచలనం రేపుతున్న ఘటన..

**ఆదిలాబాద్-నవభూమి:** జిల్లాలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇచ్చోడ మండలం ధరంపూరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రాణాలు తీసేందుకు కుట్ర జరిగింది. 30 మంది చిన్నారులను హతమార్చాలని చూశారు కొందరు దుర్మార్గులు. ఈ మేరకు విష ప్రయోగం చేశారు. పాఠశాల వాటర్ ట్యాంక్‌లో పురుగులమందు కలిపారు కేటుగాళ్లు. మధ్యాహ్న భోజనం వండే పాత్రలపైనా విషం చల్లారు. పాఠశాల సిబ్బంది అప్రమత్తం కాదవంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం, ఆదివారం, సోమవారం వరసగా మూడు రోజులపాటు పాఠశాలకు సెలవులు వచ్చాయి. దీంతో పాఠశాల అన్ని గదులు సహా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండే పాత్రలు ఉన్న గదికి సైతం తాళాలు వేశారు సిబ్బంది. అయితే స్కూల్ రీఓపెన్ కాగా.. నేడు భోజనం వండేందుకు మధ్యాహ్న భోజన కార్మికులు వంట పాత్రలు శుభ్రం చేసేందుకు బయటకు తీశారు. ఈ క్రమంలో దుర్వాసన, నీళ్లతో కడుతుంటే నురగ వచ్చింది. అప్రమత్తమైన కార్మికులు విషయాన్ని వెంటనే ప్రధానోపాధ్యాయుడు, టీచర్లకు తెలియజేశారు. దీంతో వారంతా పాఠశాల ఆవరణను తనిఖీ చేయగా.. పురుగులమందు డబ్బాలు దర్శనమిచ్చాయి. ఒక్కసారిగా ఉలిక్కిపడిన పాఠశాల సిబ్బంది మరింతగా తనిఖీ చేశారు. ఈ మేరకు వాటర్ ట్యాంక్‌లోనూ పురుగులమందు కలిపినట్లు గుర్తించారు. దీంతో విద్యార్థులను మంచినీరు తాగొద్దని హెచ్చరించారు. పోలీసులకు వెంటనే సమాచారం అందించగా హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. విషం డబ్బాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కొంప ముంచిన 'గిబ్లీ ఫోటో' రీ ట్వీట్..

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ చిక్కుల్లో పడ్డారు ఏఐ ఆధారిత గిబ్లీ ఫోటో ఆమెకు కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది. గిబ్లీ ఫోటోను ఆమె ట్విట్టర్ ఎక్స్‌లో రీట్వీట్ చేయగా.. తెలంగాణ పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో ఫేక్ ప్రచారం చేశారంటూ ఆమెకు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గత కొన్ని రోజులుగా కంచ గచ్చిబౌలి భూముల వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. దాదాపు 400 ఎకరాల్లో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టాలని భావించగా.. అవి హెచ్‌సీయూ భూములని విద్యార్థులు ఆందోళన చేశారు. అది అటవీ భూమి అని అక్కడ అరుదైన వృక్ష సంపద, జంతువులు ఉన్నాయంటూ పర్యావరణవేత్తలు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దీంతో సుప్రీం కోర్టు కలుగజేసుకొని ఎటువంటి పనులు చేపట్టవద్దంటూ స్టేటస్ కో విధించింది. ఇక కంచ గచ్చిబౌలిలో బుల్డోజర్లతో విధ్వంసం సృష్టిస్తున్నారంటూ కొన్ని ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అక్కడ పర్యావరణ విధ్వంసం, జంతుజాలం ఆవాసం కోల్పోయాయని నెటిజన్లు రకరకాల వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ఏఐ వీడియోలు, ఫోటో ద్వారా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని మండిపడింది. వీరి వెనక ప్రతిపక్ష పార్టీలకు





చెందిన పెద్దలు ఉన్నారని ఆరోపించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వాటిలో చాలా వరకు ఫేక్, ఏఐ ఆధారిత ప్రచారమే ఉందని సర్కార్ వెల్లడించటంతో తాము చేసిన పోస్టులను కొందరు నెజిటన్లు తొలగించారు. ఈ క్రమంలోనే కంచ గచ్చిబౌలి భూములపై తప్పుడు ప్రచారానికి పాల్పడ్డారంటూ కొన్ని యూట్యూబ్ చానళ్లు, న్యూస్ వెబ్ సైట్లతో పాటు పలువురు నెటిజన్లకు హైదరాబదాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలికి సంబంధించిన గిబ్లీ ఇమేజ్‌ను రీపోస్ట్ చేసిన స్మితా స్మితా సబర్వాల్‌కు సైతం తాజాగా నోటీసులు జారీ చేశారు. మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసిన ఒక గిబ్లీ చిత్రాన్ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఆ చిత్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లోని 'మష్రూమ్ రాక్' ముందు భారీ సంఖ్యలో బుల్డోజర్లు, వాటి ముందు గిబ్లీ శైలిలో నెమలి, జింక ఉన్నాయి. అయితే వైరల్ చిత్రం నకిలీదని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ పోస్ట్‌ను రీట్వీట్ చేసినందుకు స్మితా సబర్వాల్‌కు బీఎన్ఎస్ఎస్ యాక్ట్ సెక్షన్ 179 కింద నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. అయితే ఈ నోటీసులపై ఆమె ఏవిధంగా స్పందిస్తారనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది.

## ఇందిరమ్మ ఇళ్ల జాబితా వెల్లడి ఆ తేదీనే..




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయడానికి సంకల్పించింది. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హులైన నిరుపేదలకే ఈ పథకం ప్రయోజనాలు చేకూరేలా ఒక సమగ్రమైన 23 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి కలెక్టర్ల సదస్సులో ఈ పథకం అమలుపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం.. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తారు. అలాగే, మండల స్థాయిలో నాలుగైదు గ్రామాలకు కలిపి ఒక గెజిటెడ్ అధికారి (ఎంపీడీవో, ఎంపీవో, ఎంఏవో లేదా ఇతర శాఖల ఏఈలు) బాధ్యత వహిస్తారు. లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలను జిల్లా స్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఒకవేళ లబ్ధిదారుల జాబితాలో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు తేలితే.. అందుకు సంబంధిత గ్రామ పంచాయతీ .. మండల గెజిటెడ్ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం నిరుపేదలకు మాత్రమే గృహాలు అందించడం. లబ్ధిదారుల ఎంపికను గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు సూచిస్తాయి. ఒకవేళ జాబితాలో అనర్హులు ఉంటే, వారి స్థానంలో నిజమైన అర్హత కలిగిన కొత్తవారికి అవకాశం కల్పిస్తారు. ఈ 23 రోజుల ప్రణాళికను దశలవారీగా అమలు చేస్తారు. ఏప్రిల్ 15 నుండి 17 వరకు, అధికారులు ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, నియోజకవర్గంలోని ఏ గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలో నిర్ణయిస్తారు. ఏప్రిల్ 18 నుండి 21 వరకు.. ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను సూచిస్తాయి. అధికారులు వాటిని పరిశీలిస్తారు. ఏప్రిల్ 22 నుండి 30 వరకు జిల్లా స్థాయి అధికారులు లబ్ధిదారుల జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలిస్తారు. మే 1న అర్హులైన లబ్ధిదారుల జాబితాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. మే 2 నుండి 4 వరకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ జాబితాలపై తుది పరిశీలన జరుగుతుంది. చివరిగా.. మే 5 నుండి 7 వరకు జిల్లా కలెక్టర్లు అర్హులైన వారికి ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తారు. గతంలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఇళ్ల కేటాయింపు కేవలం ఎల్-2 జాబితాలో ఉన్న దరఖాస్తుదారులకే ఉంటుంది. ఇందిరమ్మ కమిటీల సూచనలు, గెజిటెడ్ అధికారుల విచారణ ద్వారా మాత్రమే ఈ ఇళ్లను అర్హులకు కేటాయిస్తారు. ఒకవేళ ఏమైనా ఇళ్లు అసంపూర్తిగా ఉంటే, వాటిని లబ్ధిదారులే పూర్తి చేసుకోవలసి ఉంటుంది. ఈ పకడ్బందీ కార్యాచరణ ద్వారా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజమైన నిరుపేదలకు చేరుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## ఆలయ బోర్డుల్లో ముస్లింలకు చోటిస్తారా?

**(1వపేజీ తరువాయి)**సూటి ప్రశ్నలు వేసింది. ఇందులో వినియోగం ఆధారంగా వక్ఫ్ ఆస్తిగా పరిగణించే నిబంధన తొలగింపుపై సూటిగా ప్రశ్నించింది. అలాగే కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను చేర్చే నిబంధనను కూడా కోర్టు ప్రస్తావించింది. ముస్లింలను హిందూ ఎండోమెంట్ బోర్డులలో భాగం కావడానికి కూడా కేంద్రం అనుమతిస్తుందా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరుల్ని చేర్చేందుకు వీలుగా చట్టాన్ని కేంద్రం సవరించిన నేపథ్యంలో అలాగే హిందూబోర్డుల్లోనూ ముస్లింలకు ప్రవేశం కల్పిస్తారా అని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయితే సుప్రింకోర్టులో కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం వివరణ తీసుకునేందుకు సమయం కోరారు. అలాగే సుప్రీంకోర్టు అడిగిన మరికొన్ని ప్రశ్నలపైనా కేంద్రం వివరణ తీసుకుని జవాబు ఇస్తానని తెలిపారు. %ూశ్రీంశీ =ుఎ% "సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్.. " మరోవైపు పిటిషనర్లలో ఒకరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, కొత్త చట్టంలోని అనేక నిబంధనలు మతపరమైన వ్యవహారాల నిర్వహణ స్వేచ్ఛకు హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. కొత్త చట్టం కలెక్టర్‌కు ఇచ్చే అధికారాలను కూడా సిబల్ ప్రశ్నించారు. కలెక్టర్ ప్రభుత్వంలో ఒక భాగమని, ఆయన న్యాయమూర్తి పాత్ర పోషిస్తే అది రాజ్యాంగ విరుద్ధమని ఆయన వాదించారు. అనంతరం సుప్రీంకోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది.

## గద్దర్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా జయసుధ

**హైదరాబాద్-నవభూమి:** తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్‌గా సీనియర్ నటి జయసుధ (%జీుఝుంబఎఘ్మ%)ను ఎంపిక చేశారు. 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ఏప్రిల్ 21 నుంచి జ్యూరీ పరిశీలించనుంది. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో బుధవారం సమావేశమయ్యారు ఎఫ్‌డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను ఛాలెంజ్‌గా తీసుకుని ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా జయసుధ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్సుకు అందిన నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని జ్యూరీ సభ్యులకు ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కోరారు. %ూశ్రీంశీ =ుఎ% " ఒకే హీరోయిన్‌తో 130 సినిమాల్లో నటించిన ఏకైక తెలుగు హీరో ఎవరో తెలుసా..?" ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. తెలుగు చలనచిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను కోరారు. జ్యూరీలో నిష్ణాతులైన వారిని ప్రభుత్వం నియమించినట్లు దిల్ రాజు తెలిపారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డ్సును ఇస్తున్నట్లు దిల్ రాజు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డ్సు కు ఇంత స్పందన రాలేదని చెప్పారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరీల్లో 76 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

## టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

**అమరావతి-నవభూమి:** రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది సీఆర్డీఏ. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్‌లను ఆహ్వానించింది. అలాగే సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లకు, సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ చేసింది. మొత్తం 5 టవర్లను రూ.4,668 కోట్ల వ్యయంతో చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. మే 1న సచివాలయ, హెచ్‌వోడీ టవర్లకు టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరువనుంది. సచివాలయంలో ఉండే హెచ్‌వోడీలకు సంబంధించి 45 అంతస్థులతో ఒక టవర్ నిర్మాణం, మిగతా టవర్లు 40 అంతస్థులతో నిర్మాణం జరుగనుంది. ఈ సచివాలయం టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్ట్రక్చర్‌తో నిర్మించాలని సీఆర్డీఏ టెండర్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ టెండర్ రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణమే అత్యంత కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయ టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెండున్నర సంవత్సరాల గడువు విధించారు.
ఈ రెండున్నర సంవత్సరాల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో పాటు, ఏడీబీ, హడ్కో, జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రాజధాని అమరావతిలో పలు నిర్మాణాల కోసం రూ.31వేల కోట్లు రుణాలుగా సమకూర్చాయి. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే రూ.480 కోట్లు మొదటి విడత రుణం కూడా మంజూరు అయ్యింది

## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్

**(1వపేజీ తరువాయి)** రాజా భోన్సాలేతో కలిసి పనిచేశారు. బాంబే హైకోర్టులో 1987 నుంచి 1990 మధ్య కాలంలో న్యాయవాదిగా విధులు నిర్వర్తించారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వ ప్లీడరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో హైకోర్టులో అదనపు జడ్జి బాధ్యతలను స్వీకరించారు. 2005లో పూర్తిస్థాయి జడ్జిగా నియమితులయ్యారు. 2019లో ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

## విద్యార్థులపై విష ప్రయోగం

**(1వపేజీ తరువాయి)**వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది చుట్టూ గమనించగా, అక్కడ పురుగుల మందు డబ్బా కనబడింది. వెంటనే తాగు నీటి ట్యాంక్‌ను పరిశీలించగా, అందులోనూ అదే విషాన్ని కలిపినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని స్కూల్ టీచర్లకు తెలియజేయగా.. వెంటనే స్పందించిన సిబ్బంది విద్యార్థులను నీటి కుళాయిల వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్న భోజనం వండడం పూర్తిగా నిలిపివేసి ఏ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్ఎం ప్రతిభ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు చెబుతున్నారు. ఇంతటి దురాగతానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలంటూ కోరుతున్నారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాలతో మానసిక వ్యధను తట్టుకోలేక ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిందితుడు అంగీకరించాడు.

## తెలంగాణ సర్కార్‌కు సుప్రీం చురకలు

**(1వపేజీ తరువాయి)**ప్రదర్శనలను నిర్వహించారు. తరగతులను బహిష్కరించారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారు. వణ్యప్రాణులు తమ ఆవాసాలను కోల్పోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి వారి ఆందోళనలు కొనసాగాయంటే దాని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిణామాల మధ్య సుప్రీంకోర్టు రంగంలోకి దిగింది. 400 ఎకరాల అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత అంశం సుప్రీంకోర్టు సమక్షానికి వచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది దేశ అత్యున్నత న్యాయస్థానం. మధ్యంతర నివేదికను అందజేయాలంటూ తెలంగాణ హైకోర్టును గతంలో ఆదేశించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా మరోసారి ఆదేశాలను ఇచ్చింది. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల భూమిలో అటవీ నిర్మూలన కారణంగా ప్రభావితమైన వన్యప్రాణుల స్థితిగతులపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక అందజేయాలంటూ తెలంగాణ అటవీ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, జస్టిప్ మసీతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అలాగే- చెట్ల నరికివేత వల్ల ఆవాసాలను కోల్పోయిన వణ్యప్రాణులను రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు అటవీ మంత్రిత్వ శాఖ వణ్యప్రాణుల సంరక్షణ విభాగం వార్డెన్‌కు ఈ ఆదేశాలను ఇచ్చింది.

## స్మితా సబర్వాల్‌కు షాకిచ్చిన పోలీసులు!

**(1వపేజీ తరువాయి)**నెమలి, జింక లాంటి జంతువులతో జిబ్లి శైలిలో రూపొందించినట్లు ఉంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని చిత్రంలో చూపించారు. ఆ ఫొటోను స్మితా సబర్వాల్ షేర్ చేశారు. నోటీసుల విషయంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ.. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 179 ప్రకారం స్మిత్ సబర్వాల్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే, నోటీసులో పేర్కొన్న విషయాలను ఇప్పుడే బయటపెట్టలేమని సదరు అధికారి స్పష్టం చేశారు. కాగా, బీఎన్ఎస్-ఎస్ సెక్షన్ 179 ప్రకారం కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి.. సంబంధిత వ్యక్తులను స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ పీఎస్‌కు హాజరయ్యేలా పిలిచే అధికారం కలిగి ఉంటారు. ఆ నిబంధనల ఆధారంగానే స్మితా సబర్వాల్‌కు నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజా చైతన్యాన్ని కలిగించే విభాగంలో ఉన్న ఒక అధికారికి నోటీసు రావడం చర్చనీయాంశంగా మారింది.

## త్వరలో రాజకీయాల్లోకి

**(1వపేజీ తరువాయి)**వారిపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను దుర్వినియోగం చేస్తే, ఆ సంస్థలను ప్రజలు విశ్వసించరని ఆయన అభిప్రాయపడ్డారు. తాను బీజేపీలో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రజలు తనతో ఉన్నారని, త్వరలో రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు.
ఈ కేసులో హర్యానా ప్రభుత్వం తనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. విచారణలో భాగంగా ఈడీ ఇప్పుడు అడుగుతున్న ప్రశ్నలకు తాను 2019లోనే సమాధానం ఇచ్చానని తెలిపారు. మళ్లీ ఇప్పుడు అవే ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు.

## ఏపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఖరారు

**(1వపేజీ తరువాయి)**పార్టీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లే నేతకు పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎంపీ జీవీఎల్ పేర్లు పరిశీలనకు వచ్చాయి. అదే సమయంలో కొత్త అధ్యక్షుడు ఎంపిక వేళ.. ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరిని మరో ఏడాది పాటు పొడిగించే ప్రతిపాదన పైన చర్చ జరిగినట్లు సమాచారం.

## వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటీ కృష్ణవేణి అరెస్ట్



**గుంటూరు-నవభూమి:** వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటీ కృష్ణవేణి హైదరాబాద్‌లో అరెస్ట్ అయ్యారు. పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీసులు బుధవారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పాలేటీ కృష్ణవేణిని ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌కు ఏపీ పోలీసులు తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి దాచేపల్లి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించనున్నారు.

## లా కమీషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దినేశ్



**న్యూఢిల్లీ-నవభూమి:**సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి.. 23వ లా కమీషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. లా కమీషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు న్యాయవాది హితేశ్ జైన్, ప్రొఫెసర్ డీపీ వర్మ.. కమీషన్‌లో సభ్యులుగా నియమితులయ్యారు. ఏప్రిల్ 15, 2025 నాడు వాళ్లు ఛార్జ్ తీసుకున్నారు. ఆగస్టు 31, 2027న వాళ్ల పదవీ కాలం పూర్తి అవుతుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వా శాఖ .. దినేశ్ మహేశ్వరి నియామకంపై ట్వీట్ చేసింది.
రాజస్థాన్‌లో సుమారు రెండు దశాబ్ధాల పాటు లాయర్‌గా జస్టిస్ మహేశ్వరి ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత 2004లో ఆయన రాజస్థాన్ హైకోర్టు బెంచ్‌కు పదోన్నత పొందారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా చేశారు. మేఘాలయా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కూడా చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. 2023 మేలో రిటైర్ అయ్యే వరకు ఆయన సుప్రీంకోర్టులో జడ్జిగా చేశారు.లా కమీషన్ సభ్యుడిగా నియమితులైన హితేశ్ జైన్.. పరినం లా అసోసియేట్స్‌లో మేనేజింగ్ పార్ట్నర్‌గా ఉన్నారు. ముంబై ప్రదేశ్ బీజేపీలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. రెండు దశాబ్ధాల నుంచి ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సివిల్, క్రిమినల్, కమర్షియల్, రాజ్యాంగ అంశాల్లో అనుభవం ఉన్నది. మహారాష్ట్ర తరపున ముంబై హైకోర్టులో, సుప్రీంకోర్టులో స్పెషల్ కౌన్సిల్‌గా హాజరయ్యారు. 22వ భారత లా కమీషన్‌లో ప్రొఫెసర్ వర్మ పూర్తి స్థాయి సభ్యుడిగా చేశారు.

## కాంగ్రెస్ అగ్రనేతలు ఆ పత్రికను ఏటీఎంలా వాడుకున్నారు : బీజేపీ



**న్యూఢిల్లీ-నవభూమి:**నేషనల్ హెరాల్డ్ కేసు లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ రాహుల్‌గాంధీ లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేయడం, అందుకు ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టడం లాంటి పరిణామాల నేపథ్యంలో బీజేపీ స్పందించింది. చారిత్రక నేపథ్యంగల నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను కాంగ్రెస్ అగ్రనేతలు తమ ప్రైవేటు ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించింది. బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నిరసన తెలిపే హక్కుందికానీ ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసి నేషనల్ హెరాల్డ్‌కు ఇచ్చే హక్కు లేదని అన్నారు. దేశ రాజధానిలోని బహదూర్ షా జాఫర్ మార్గ్ నుంచి ముంబై, లక్నో, భోపాల్, పట్నా వరకు దేశవ్యాప్తంగా ఉన్న విలువైన ప్రజా ఆస్తులను యంగ్ ఇండియా లిమిటెడ్ ద్వారా గాంధీ కుటుంబం చేతుల్లోకి బదిలీ చేయడానికి ఈ కార్పొరేట్ కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. 'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్' (ఏజేఎల్) కు సంబంధించిన 99% షేర్లను కేవలం రూ.50 లక్షలకు బదలాయించుకొని, రూ.2000 కోట్ల విలువ చేసే ఆస్తుల్ని గాంధీ కుటుంబం తప్పుడు మార్గాన కైవసం చేసుకుందని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల గొంతును బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఆ వార్తా పత్రికను గాంధీల కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంలా వాడుకుందని దుయ్యబట్టారు. ఈ కేసును కొట్టివేయించడానికి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అవన్నీ విఫలమయ్యాయని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని అన్నారు. అక్రమాలకు పాల్పడిన వారు తప్పించుకోవడానికి ఇది కాంగ్రెస్ పాలన కాదని.. ప్రధాని నరేంద్ర మోదీ నడిపిస్తున్న దేశమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదని, అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. సోనియాను ఎ-1గా, రాహుల్‌ను ఎ-2గా పేర్కొంది. తదుపరి విచారణను ఈడీ కోర్టు ఈ మనెల 25కి వాయిదా వేసింది. కేసు డైరీలను తమ పరిశీలన కోసం సమర్పించాలని ఈడీ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. కాంగ్రెస్ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దూబె తదితరులను కూడా ఈ కేసులో నిందితులుగా ఈడీ పేర్కొన్నది.

## మీ హెూంమంత్రిని అదుపులో పెట్టండి.. ప్రధానికి బెంగాల్ సీఎం సూచన



**పశ్చిమబెంగాల్-నవభూమి:**కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టం-2025 కు వ్యతిరేకంగా బెంగాల్‌లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారడం వెనుక ఆయన హస్తం ఉందని ఆరోపించారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని మండిపడ్డారు. అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా వ్యవహరించారని, బంగ్లాదేశీయులను రాష్ట్రంలోకి వదిలారని వ్యాఖ్యానించారు. హెూంమంత్రి అమిత్ షా దర్యాప్తు సంస్థలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని మమత మండిపడ్డారు. సొంత రాజకీయ అజెండాను నెరవేర్చుకోవడానికి దేశానికి హాని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ.. అమిత్‌షాను నియంత్రించాలని సూచించారు. ముర్షిదాబాద్ అల్లర్ల వెనుక సరిహద్దు అవతల నుంచి వచ్చిన వ్యక్తుల పాత్ర ఉందని, ఈ విషయాన్ని నిఘా వర్గాలు తమకు తెలిపాయని చెప్పారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్‌లో జరుగుతున్నట్లు చెబుతూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మమత ఆరోపించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందని అన్నారు. దీనిపై ప్రజలు శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధానిని కోరారు. హింసాకాండలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇస్తామని సీఎం మమత ప్రకటించారు. ఘర్షణల్లో బీఎస్ఎఫ్ పాత్రపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆమె ఆదేశించారు. కాగా వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో ఆందోళనలు జరిగాయి. ఈ ఘర్షణల్లో హింస చెలరేగింది.

## రెండో రోజూ ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా.. నిజమే గెలుస్తుందని వ్యాఖ్య..!

**హర్యానా-నవభూమి:** హర్యానా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ నిమిత్తం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త.. రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఈడీ కార్యాలయం వరకు వెళ్లారు. కాగా ఈ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి వాద్రా ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించింది. నోటీసులు అందిన వెంటనే ఆయన నడుచుకుంటూ ఈడీ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటలపాటు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించడంతో ఇవాళ మళ్లీ వెళ్లారు. వాద్రా లోపలికి వెళ్తుండగా అప్పటిదాక ఆయనతోపాటు ఉన్న ప్రియాంక భర్తను ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం వాద్రాను అధికారులు విచారిస్తున్నారు. ప్రియాంకను ఈడీ కార్యాలయంలోని వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టారు. విచారణకు హాజరయ్యే ముందు వాద్రా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను బయటకు చెప్పేవారిపై ఈడీతో సహా ఇతర ఏజెన్సీలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ తీరును దేశంలోని ప్రతిఒక్కరూ గమనిస్తున్నారని, ఈ ఏజెన్సీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని వాద్రా అన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలా చేస్తున్నారని చెప్పారు. తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా తాను పోరాటం చేస్తున్నానని, ప్రజలు తనతోనే ఉన్నారని, వారు తనను రాజకీయాల్లో చూడాలనుకుంటున్నారని వాద్రా తెలిపారు. ఇదిలావుంటే ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది.

# పిచ్చుక కోసం రంగంలోకి జిల్లా యంత్రాంగం..



**న్యూఢిల్లీ-నవభూమి:**లిఫ్టులో ఉండగానో, ఏదైనా గదిలో ఉండగానో అనుకోకుండా ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి అక్కడే మనం చిక్కుకుపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఓసారి ఆలోచించండి. మనకు ఏమీ కాకపోయినా.. అక్కడి నుంచి బయటకు రాలేకపోతే ఎంతగానో అల్లాడిపోతాం. ప్రాణాలు కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తాం. అవేవీ ఫలించవని తెలిస్తే.. మనకు సంబంధించిన వాళ్లందరినీ గుర్తు చేసుకుంటూ విపరీతంగా ఏడుస్తాం. అందరి దేవుళ్లను తలుచుకుంటూ ప్రాణాలు కాపాడమని వేడుకుంటాం. ఎలాంటి ఉపయోగమూ ఉండదని తెలిసినా బతుకుపై ఆశతో సాయం చేయండి, సాయం చేయండంటూ కేకలు వేస్తుంటాం. మనుషులం కాబట్టి ఇలా నోరు తెరిచి అందరికీ అర్థమయ్యేలా చెబుతున్నాం. కానీ ఇదే కష్టం ఓ పక్షికి వస్తే..?దాదాపు ఆరేడు నెలలుగా మూసి ఉన్న ఓ దుకాణంలోకి వెళ్లిన పిచ్చుక అక్కడే చిక్కుకుపోయింది. బయటకు రాలేక నానా అవస్థలూ పడింది. ప్రాణాలు కాపాడుకోవాలని ఎన్నెన్నో ప్రయత్నాలు చేసింది. గాజు గ్లాసును సైతం పగులగొట్టాలనుకుని.. దాని బుచ్చి ముక్కుతో టిక్ టిక్ మని కొడుతూ తీవ్రంగా కష్టపడింది. కానీ అదంతా వృథా అని తెలుసుకుని కన్నీటి పర్యంతం అయింది. మూడ్రోజులు తిండీ తిప్పల్లేకుండా నరకం చూసింది. ఇక తానక్కడే చినపోతానని నిశ్చయించుకుని.. దీనంగా చూస్తూ కూర్చుండిపోయింది. అప్పుడే ఓ వ్యక్తి దాన్ని చూసి బాధను అర్థం చేసుకున్నాడు. పిచ్చుక ప్రాణం కూడా మనిషి ప్రాణంలాగే అని భావించి.. దాన్ని కాపాడేందుకు చాలానే ప్రయత్నించాడు. కానీ ఆ దుకాణం తెరిస్తే తప్ప పిచ్చుకను బయటకు తీసుకురాలేమని గుర్తించగా.. అతడి మనసు చివుక్కుమంది. ఎందుకంటే ఆ దుకాణాన్ని కోర్టు ఆదేశాల మేరకు సీల్ చేశారు. దాన్ని ఓపెన్ చేసే అధికారం ఎవరికీ లేదు. కానీ ఎలాగైనా ఆ బుజ్జి పిట్టను కాపాడాలనుకున్న అతడు ఊరందరినీ ఏకం చేశాడు. వారందరినీ తీసుకుని జిల్లా యంత్రాంగాన్ని కదిలించి మరీ పిచ్చుక ప్రాణాలు కాపాడాడు. ప్రతీ ఒక్కరి హృదయాన్ని కదలిస్తున్న ఈ కథ ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.
కేరళ కన్నూర్‌లోని ఉల్లికల్ గ్రామంలో ఓ బట్టల దుకాణం ఉంది. అయితే ఆరు నెలల క్రితం ఆ దుకాణ భాగస్వాములు గొడవ పడి కోర్టుకు వెళ్లారు. దీంతో విచారణ జరిపిన న్యాయస్థానం సదరు దుకాణాన్ని సీల్ చేసింది. ఎవరూ అందులోకి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఇక అప్పటి నుంచి ఆ దుకాణం మూసే ఉంచగా.. ఏప్రిల్ 7వ తేదీ రోజు అనుకోకుండా ఓ పిట్ట అందులోకి ప్రవేశించింది. ముఖ్యంగా షెటర్ ముందు వైపు గాజు గ్లాస్ ఉండగా ఆ రెండింటి మధ్య ఇరుక్కుపోయింది. ఇలా ఆ దుకాణంలో చిక్కుకుపోయిన పిచ్చుకకు బయటకు ఎలా రావాలో తెలియక నానా ఇబ్బందులు పడింది. ముఖ్యంగా తీవ్రంగా చప్పుడు చేస్తూ.. తన బుజ్జి ముక్కుతో ఆ గాజు గ్లాసును పగలగొట్టేందుకు ప్రయత్నించింది. అయితే అటుగా వెళ్తున్న బాటసారులు, ఆటో డ్రైవర్లు ఈ విషయాన్ని గుర్తించారు. వెంటనే కొందరు అక్కడకి వెళ్లి దాన్ని కాపాడేందుకు ప్రయత్నించారు. ఎటు నుంచి కూడా మార్గం లేకపోవడంతో పిట్టను బయటకు తీసుకురావడం కుదరలేదు. దీంతో గాజు గ్లాసు మధ్య ఉన్న చిన్న సందులోంచి ఆహారపు గింజలు, నీళ్లను పోశారు. అది చూసిన పిచ్చుక వాటితో ఆకలి, దప్పిక తీర్చుకుంది. అదలా ఆత్రంగా ఆహారం తినడం చూసి గ్రామస్థుల మనసు చివుక్కుమంది. ఎలాగైన సరే ఆ పిట్టను కాపాడాలనుకున్నారు. అందుకోసం గ్రామాధికారులంతా కలిసి తహసీల్దార్ వద్దకు వెళ్లారు. కోర్టు ఆదేశాలతో మూసిన దుకామం తలుపులు తెరిచి పిచ్చుకును కాపాడాలని కోరారు. కానీ కోర్టు ఆదేశాలతో మూసిన దాన్ని మనం తెరవడానికి వీల్లేదని.. మళ్లీ కోర్టు చెబితేనే దాన్ని తెరవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. దీంతో గ్రామస్థులంతా జిల్లా కలెక్టర్ అరుణ్ కే విజయన్ వద్దకు వెళ్లారు. పిచ్చుక విషయం చెప్పి ఎలాగైనా కాపాడామని కోరారు. దీంతో ఆయన చట్టపరంగా ఆ దుకాణాన్ని ఎలా తెరవాలో పరిష్కారాలు చెప్పమంటూ జిల్లా అధికారులను ఆదేశించారు. ఇలా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.టి నిసార్ అహ్మద్ జోక్యం చేసుకుని.. కేరళ హైకోర్టును సంప్రదించారు. న్యాయస్థానం సలహా మేరకు ఏప్రిల్ 10వ తేదీ రోజు న్యాయమూర్తి అహ్మద్, కలెక్టర్ అరుణ్ కె. విజయన్, జిల్లా అధికారులు అంతా కలిసి ఉలిక్కన్‌లోని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో హైకోర్టు అనుమతితో తాళాలు తీసి మరీ గాజు తలుపును తెరిచారు. ఆపై అక్కడే చిక్కుకుపోయిన పిచ్చుకను సున్నితంగా పట్టుకుని గాల్లోకి వదిలేశారు. దీంతో పిచ్చుక పక్కనే ఉన్న చెట్టుపైకి వెళ్లి కూర్చుంది. చాలా సేపు అక్కడే ఉండి ఆపై మళ్లీ గాల్లోకి ఎగిరింది. ఇదంతా చూసిన గ్రామస్థులు తెగ సంబుర పడిపోయారు. ముఖ్యంగా దీనిపై జడ్జి మాట్లాడుతూ.. చట్టాలు జీవితాలను కాపాడేందుకు, రక్షించడానికి రూపొందించబడ్డాయని చెప్పారు. కేవలం మనుషుల కోసం మాత్రమే కాదని.. ప్రతీ ప్రాణికి ఈ లోకంలో అన్ని హక్కులు ఉన్నాయని వివరించారు.

## రోడ్డుపై వెళ్తున్న కారు డిక్కీలోంచి బయటకు వేలాడుతున్న చేయి



**న్యూఢిల్లీ-నవభూమి:**అదొక రద్దీ రోడ్డు. నిత్యం ప్రయాణికులతో నిండిపోయే కనిపిస్తుంది. అలాంటి ఓ రోడ్డుపై వెళ్తున్న కారు డిక్కీలోంచి మనిషి చేయి వేలాడుతూ కనిపంచింది. దీంతో ఆ వాహనం పక్కన, వెనక ఉన్న వాళ్లంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. దాన్ని వెంబడిస్తూ మరీ పోలీసులకు ఫోన్ చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కారు డిక్కీలో శవాన్ని పెట్టి తరలిస్తున్నారని సమాచారం ఇచ్చారు. అలాగే ఈ కారు నెంబర్, ఏ రోడ్డుపై వెళ్తుందో కూడా వివరించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఛేజ్ చేసి మరీ కారును పట్టుకున్నారు. ఆపై డిక్కీ తెరిచి చూసి షాక్ అయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియాలంటే మీరీ కథ చదివేయాల్సిందే.
మహారాష్ట్ర రాజధాని ముంబైలో సోమవారం రోజు ఈ ఘటన జరిగింది. ముఖ్యంగా సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో రద్దీగా ఉన్న వాషి ప్రాంతంలోని రోడ్డుపై ఓ కారు వెళ్తోంది. అయితే ఆ కారు డిక్కీలోంచి ఓ మనిషి చేయి కిందకు వేలాడుతూ కనిపించింది. విషయం గుర్తించిన స్థానికులు, వాహన దారులంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కారు వెనకే పరుగులు పెడుతూ వారిని పట్టుకోవడానికి కూడా ప్రయత్నించారు. మరికొందరు అయితే దాన్ని వీడియోగా తీసి సోషల్ మీడియాలో పెట్టారు. మరికొందరు నేరుగా ఆ వీడియోను, కారు నెంబర్ వివరాలు, వెళ్తున్న రోడ్డు మార్గం అన్నింటికి పోలీసులకు తెలియజేశారు.
దీంతో పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. చేయి వేలాడుతున్న కారును వెంబడించి మరీ పట్టుకున్నారు. ముందుగా కారు ఆపి.. నేరుగా వెనక్కి వచ్చి డిక్కీ తెరిచి చూశారు. అయితే అంతా అనుకున్నట్లుగా డిక్కీలో ఉంది శవం కాదు. ఓ మనిషి. అందులోనూ ఓ కుర్రాడు. నవ్వుతూ, జోకులు చేస్తూనే ఆ వ్యక్తి తన చేయిని డిక్కీలోంచి కిందకు జార విడిచాడు. దీంతో తీవ్ర కోపోద్రిక్తులైన పోలీసులు కారులో ఉన్న ముగ్గురు యువకులను కిందకు దింపి.. తమదైన స్టైల్లో విచారించారు. దీంతో తీవ్రంగా భయపడిపోయిన యువకులు.. తామంతా ఓ రీల్ చిత్రీకరించేందుకే ఇలా చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఓ ల్యాప్‌టాప్ షాప్ కోసం అందరి దృష్టిని ఆకర్షించే విధంగా రీల్ చిత్రీకరించాలనుకున్నామని.. కానీ అది ఇలా అవుతుందని అస్సలే ఊహించలేదంటూ పోలీసులకు వివరించారు. వారి మాటలు విన్న పోలీసులు విస్తుపోయారు. రీల్ కోసం ఇలాంటి పనులు చేసి ప్రయాణికులను, స్థానిక ప్రజలకు భయపెట్టడం ఏంటంటూ మరింత ఫైర్ అయ్యారు. మరోసారి ఇలాంటి పనులు చేస్తే జైల్లో వేస్తామంటూ హెచ్చరించి ఆపై ముగ్గురు యువకులను వదిలి పెట్టారు. అప్పటికే ఈ వీడియోను పలువురు సోషల్ మీడియాలో పెట్టగా.. నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన ప్రతీ ఒక్కరూ.. చాలా భయమేస్తుంది భయ్యా, ఎవరో శవాన్ని డిక్కీలో పెట్టి తీసుకెళ్తున్నారు, వీడియో తీస్తుంటే మీకు భయం వేయలేదా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరి ఈ వీడియో చూస్తే మీకేమనిపిస్తుందో కామెంట్ల రూపంలో వెల్లడించేయండి.

## ఆ దేశాలకు భారీగా తగ్గిన భారత విద్యార్థుల సంఖ్య.. కారణం..!



**న్యూఢిల్లీ-నవభూమి:**గడిచిన ఐదేళ్లలో తొలిసారిగా విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. ఇండియన్ స్టూడెంట్స్ ప్రధానంగా వెళ్లే కెనడా అమెరికా యూకే ల్లో వీసా తిరస్కరణలు కూడా అందుకు కారణం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. గత ఏడాది కెనడా, అమెరికా, యూకేల నుంచి భారతీయ విద్యార్థులకు లభించే స్టూడెంట్ వీసాల్లో 25 శాతం తగ్గుదల కనిపించింది.
కెనడాకు వెళ్లేవారి సంఖ్యలో 32 శాతం తగ్గుదల నమోదైంది. ఇది 2.78 లక్షల నుంచి 1.89 లక్షలకు తగ్గింది. ఈ విషయాన్ని కెనడాకు చెందిన ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ సంస్థ వెల్లడించింది. అదేవిధంగా అమెరికాకు వెళ్లే వారి సంఖ్య 34 శాతం పడిపోయింది. క్రితం ఏడాదితో పోలిస్తే ఎఫ్-1 వీసాల్లో 1,31,000 నుంచి 86,000కు తగ్గుదల నమోదైంది. ఇక యూకేకు వెళ్లే వారి సంఖ్యలో 26 శాతం తగ్గుదల కనిపించింది. గతంలో 1,20,000లుగా ఉన్న విద్యార్థి వీసాలు.. తర్వాత 88,732కు తగ్గాయి.

**కారణాలేమిటి..?**

కెనడా, యూకేల్లో విద్యార్థి వీసాలపై పరిమితులు విధించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అలాగే కెనడా, భారత్ మధ్య ఉద్రిక్తతలు కూడా ఈ పరిస్థితికి కారణమే. కెనడా దేశం భారతీయ విద్యార్థులపై పలు ఆంక్షలు విధించింది. స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ ప్రోగ్రామ్‌ను వేగవంతం చేసింది. తమ దేశంలో తాత్కాలికంగా నివసించే విదేశీయుల సంఖ్యను 2026 నాటికి 5 శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. విదేశీ విద్యార్థుల సంఖ్య భారీగా ఉండటంతో గృహ, ఆరోగ్య, ఇతర ప్రజా సేవలు భారంగా మారాయని సాకు చెబుతోంది. భారతీయ విద్యార్థులకు కేటాయించే స్టడీ పర్మిట్లను 32 శాతం తగ్గించింది. అదే సమయంలో చైనీయులకు కేవలం 3 శాతం కుదించింది.
ఇక యూకే కూడా విదేశీ విద్యార్థులు వారిపై ఆధారపడిన వారిని తమవద్దకు తీసుకురాకుండా నిబంధనలు విధించింది. ఈ కారణంతో అక్కడి వీసాకు దరఖాస్తు చేసేవారి సంఖ్య తగ్గింది. వాస్తవానికి కొవిడ్ తర్వాత 2023 నుంచే భారతీయులకు విద్యార్థి వీసాలు ఇవ్వడం యూకే తగ్గించింది. దాంతో ఆ ఏడాది 13 శాతం తగ్గుదల కనిపించింది. ఇక 2024లో అది 26 శాతానికి పరిమితమైంది.
అయితే గడిచిన పదేళ్లలో కెనడా, అమెరికా, యూకే దేశాల్లో భారతీయ విద్యార్థులు సంఖ్య అత్యంత వేగంగా పెరిగింది. ఒక దశలో చైనా విద్యార్థులను కూడా భారత విద్యార్థులు దాటేశారు. 2015 నుంచి 2023 మధ్య కెనడా వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య 31,920 నుంచి 2,78,160కు చేరింది. అదే సమయంలో యూకేకు వెళ్లేవారి సంఖ్య 10,418 నుంచి 1,19,738కి పెరిగింది. అమెరికాకు 2015లో 74,831 మంది ఎఫ్1 వీసాపై వెళ్లగా.. 2023లో అది 1,30,730కి పెరిగింది.

## మీ గదికి కూడా పేడ పూశాం.. ఏసీ తీసేయండి మేడం..

# ప్రిన్సిపల్‌కు షాకిచ్చిన విద్యార్థులు



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఓ కాలేజీలోని విద్యార్థులు తరగతి గదిలో చాలా ఉక్కపోస్తుందని ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఏ ఫ్యానో, ఏసీయో పెట్టిస్తుందని అంతా అనుకోగా.. గోడలకు ఆవుపేడ పూశారు ప్రిన్సిపల్. అయితే దీనిపై రెండ్రోజులుగా వివాదం సాగుతోంది. ముఖ్యంగా దీన్ని కొందరు విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ప్రిన్సిపల్ ఆఫీస్ గది గోడలకు కూడా పేడ పూశారు. ఇక మీ గది చాలా చల్లగా ఉంటుంది.. ఏసీ తీసేయండి మేడమ్ అంటూ చెప్పుకొచ్చారు. ఆపూర్తి వివరాలు మీకోసం.
మీ గదికి కూడా పేడ పూశాం.. ఏసీ తీసేయండి మేడం..: ప్రిన్సిపల్‌కు షాకిచ్చిన విద్యార్థులు
: దేశ రాజధాని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ఓ కళాశాల విద్యార్థులు తరగతి గదిలో చాలా వేడిగా ఉందని ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. రెండు మూడు ఫ్యాన్లో, ఏసీయో పెట్టించాలని కోరారు. అయితే ప్రిన్సిపల్ మాత్రం ఆ తరగతి గది గోడలకు ఆవుపేడ పూశారు. చల్లగా ఉంటుందని చెబుతూ వీడియో కూడా చేసి సోషల్ మీడియాలో పెట్టారు. దీన్ని కొందరు సమర్థిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే తాజాగా కొందరు విద్యార్థులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ.. ప్రిన్సిపల్ ఆఫీస్ గది గోడలకు ఆవుపేడ పూశారు. ఇక మీ గది కూడా చల్లగా ఉంటుంది.. ఏసీ తీసేయండి చెప్పారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.
ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని లక్ష్మీబాయి కళాశాలలోని అనేక తరగతి గదులకు ఎక్కువగా వెంటిలేషన్ లేదు. దీంతో ఎక్కువగా ఉక్కపోస్తుంటుంది. అసలే వేసవి కాలం కావడం.. అందులోనూ ఎండలు మండిపోతుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నరకం చూస్తున్నారు. తరచుగా దీనిపై ప్రిన్సిపల్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ గదిలో నాలుగైదు ఫ్యాన్లో, ఓ ఏసీయో పెట్టించాలని కోరుతున్నారు. కానీ ప్రిన్సిపల్ ప్రత్యూష వత్సల మాత్రం ఆ గదని చల్లగా మార్చేందుకు సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఓ పని చేశారు.
ప్రత్యేకంగా ఆవుపేడ తెప్పించి దాంట్లో కొన్ని నీళ్లు కలిపి మరీ తరగతి గోడలకు పూశారు. అలా చేస్తుండగా వీడియో తీయించుకుని మరీ సోషల్ మీడియాలో పెట్టారు. అలాగే అధ్యాపకుల పరిశోధన ప్రతిపాదనలో భాగంగానే ఈ పని చేసినట్లు చెప్పారు. గది గోడలకు ఆవుపేడ రాయడం వల్ల చాలా చల్లగా ఉంటుందని.. దానికి ఉష్ణోగ్రతను అడ్డుకునే సామర్థ్యం ఉంటుందని వివరించారు. ఇది జరిగి రెండ్రోజులు కావొస్తుండగా.. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. కొందరు ప్రిన్సిపల్ ప్రత్యూష వత్సల చేసిన పనిని సమర్థిస్తుండగా.. మరికొందరు మాత్రం ఇలా చేయడం అంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే తాజాగా యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు రోనక్ ఖత్రి నేతృత్వంలోని విద్యార్థులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పిల్లల గదిలో ఏసీ పెట్టించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆవుపేడ రాయడంపై చాలా కోపంగా ఉన్న వాళ్లు.. ప్రిన్సిపల్ ప్రత్యూష వత్సల ఆఫీసులోని గోడలపై కూడా ఆవుపేడను పూశారు. ఆపై మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతూ.. ప్రిన్సిపల్ మేడమ్ గదికి కూడా పేడ పూశాం కాబట్టి చల్లగా ఉంటుందని.. ఇక ఈ గదిలో ఉన్న ఏసీని తీసేసి విద్యార్థులకు ఇచ్చేస్తే సరిపోతుందని చెప్పారు. ఆవుపేడతో వచ్చే చల్లదనంలోనే మేడమ్ వేసవి కాలం అంతా విధులు నిర్వహిస్తారని తాము బలంగా నమ్ముతున్నామంటూ కామెంట్లు చేశారు. అక్కడితో ఆగకుండా అసలు విద్యార్థుల సమ్మతి లేకుండా.. గది గోడలకు ఆవుపేడ పూయడం ఏంటని రోనక్ ఖత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వాసన వల్ల పిల్లలు గదుల్లో కూడా కూర్చోలేకపోతున్నారని చెప్పుకొచ్చారు. ఇలాంటి ప్రయోగాలు ఏమైనా ఉంటే ప్రిన్సిపల్ మేడమ్.. తన ఇంట్లో చేసుకోవాలని, విద్యార్థులను ఇబ్బంది పెడితే ఏమాత్రం సహించమని వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సైతం నెట్టింట వైరల్ అవుతుండగా.. అనేక మంది స్పందిస్తున్నారు. మంచి పని చేశారు, ఆవుపేడ వాసన పీల్చుకుంటూ అదే గదిలో మేడమ్ చల్లగా కూర్చుని పనులు చేసుకుంటారంటూ వ్యంగ్యంగా కామెంట్లు చేస్తున్నారు. మరి ఈ ఘటనపై మీకేమనిపిస్తుందో కామెంట్ల రూపంలో వెల్లడించేయండి.

## సీఈసీ నియామక చట్టంపై పిటిషన్లు.. మే 14న విచారణ జరుపుతామన్న సుప్రీంకోర్టు..




**న్యూఢిల్లీ-నవభూమి:** సీఈసీ, ఈసీల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు తేదీని నిర్ణయించింది. అన్ని పిటిషన్లపై మే 14న విచారించనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఓ పిటిషన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. ఈ విషయంలో త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వచ్చే నెలలో విచారణకు తేదీని నిర్ణయించింది. భూసేకరణతో పాటు అనేక ఇతర కీలకమైన కేసులను ఈ రోజు ధర్మాసనం విచారిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అయితే, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ 2023లో కేంద్రం చట్టాన్ని తీసుకువచ్చింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. అయితే, కమిటీ నుంచి సుప్రీంకోర్టు సీజేఐని తొలగించి కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్జీవో అయిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో హాజరయ్యారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని ఆయన గతంలో కోర్టును కోరారు. అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని.. కానీ, ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందన్నారు. చట్టాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

## ద్వారకా కోర్టుకు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీసులు




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా ఢిల్లీ లోని ద్వారకా కోర్టు కు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు గుర్తించారు. ఇవాళ ఉదయం కోర్టు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బెదిరింపుల గురించి బుధవారం ఉదయం 10:45 గంటల సమయంలో పీసీఆర్‌కు కాల్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కోర్టు ఆవరణకు చేరుకున్నారు. అక్కడ ఖాళీ చేయించి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువలూ కనిపించలేదని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



## మహనీయుల మాసం ఏప్రిల్

ఈ దేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా సామాజిక వివక్షను ఎదుర్కొంటూ, ఆర్థిక దోపిడీకి గురవుతున్నవారు అణగారిన వర్గాలే. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాలు, మహిళపై చిన్నచూపు చూస్తున్న సమాజంపై కొందరు సంఘసంస్కర్తలు శంఖం పూరించారు. యాదృచ్ఛికంగా వారిలో చాలామంది జయంతులు, వర్ధంతులు ఏప్రిల్‌లోనే ఉండటం విశేషం.

ఏప్రిల్ 3న శివాజీ వర్ధంతి, ఏప్రిల్ 5న బాపు జగ్జీవన్‌రామ్ జయంతి, ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 13న బీపీ మండల్ వర్ధంతి, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి, ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి

వీరేశలింగం పంతులు. తెలుగు గడ్డపై తొలితరం సంఘసంస్కర్త ఆయన. మహిళల సంక్షేమం కోసంజీవితాంతం పనిచేసాడు. స్త్రీవిద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలను స్థాపించాడు. బాల్యవివాహాలనువ్యతిరేకించాడు, వితంతు పునర్వివాహాలు చేయించాడు.

కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16నరాజమండ్రిలో జన్మించాడు. ఆయన తల్లి పున్నమ్మ, తండ్రి సుబ్బారాయుడు. నాలుగేళ్ళపిన్నవయసులోనే వీరేశలింగం తండ్రిని కోల్పోయాడు. నానమ్మ, పెదనాన్నల పెంపకంలోఅల్లారుముద్దుగా పెరిగాడు. ఐదవయేట బడిలో చేరి బాలరామాయణం, ఆంధ్రనామసంగ్రహం,అమరకోశం, రుక్మిణీ కళ్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం వంటివి నేర్చుకున్నాడు.పన్నెండవ యేట ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. పదమూడవ యేట ఆనాటి పద్ధతులప్రకారం ఎనిమిదేళ్ళ బాపమ్మతో వివాహమైంది. తర్వాత ఆమెకు రాజ్యలక్ష్మిగా పేరు మారింది.

విద్యాభ్యాసం పూర్తయాక, పెదనాన్న మరణం తర్వాత,వీరేశలింగం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. పిల్లలకు పాఠాలతో పాటు సంఘసంస్కరణ భావాలూబోధించాడు. సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కృషి చేసాడు. ఆ క్రమంలో "సంఘం లోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వవ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులనుసంఘం ముందు పెట్టడం" అనే లక్ష్యాలతో వివేకవర్ధని పత్రికను 1874 అక్టోబరులోప్రారంభించాడు.

తెలుగు గడ్డకు బ్రహ్మసమాజాన్ని తీసుకువచ్చింది కందుకూరి వీరేశలింగమే. అలాగేయువజన సంఘాల స్థాపన కూడా తెలుగునాట ఆయనతోనే మొదలైంది. సమాజసేవ చేయాలనే సంకల్పంతో1905లో హితకారిణీ సమాజాన్ని స్థాపించి తన ఆస్తి మొత్తాన్నీ ఆ సమాజానికే రాసిచ్చేసాడు.పాతికేళ్ళు రాజమండ్రిలోనూ, ఐదేళ్ళు మద్రాసులోనూ తెలుగు పండితుడిగా పనిచేసాడు.కందుకూరి వీరేశలింగం యుగకర్తగా ఖ్యాతి గడించాడు, గద్యతిక్కన అనే బిరుదుగడించాడు. సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, సంఘాన్ని సంస్కరించే పనినిసాహిత్యం ద్వారానూ కొనసాగించాడు. అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వోద్యోగాన్నీ,అబద్ధాలు ఆడకూడదని న్యాయవాద వృత్తినీ వదులుకున్న మహనీయుడు కందుకూరి. సాంఘికదురాచారాలపై తన వివేకవర్ధిని పత్రిక ద్వారా యుద్ధమే చేసాడు. స్త్రీవిద్య కావాలిఅని నినాదాలు చేయడం మాత్రమే కాదు, దాన్ని సాధించడం కోసం బాలికా విద్యాలయం

ప్రారంభించిన మహనీయుడు ఆయన.

ఏప్రిల్ 18న దొండో కేశవ్ కార్వే జయంతి, ఏప్రిల్ 23న విఠల్ రాంజీ షిండే జయంతి, ఆ రోజుల్లో సమాజంలో వితంతువుల కష్టాలు చూసి, వితంతు పునర్వివాహాల గురించి ఆలోచించాడు. 1893లో 8వ యేటనే వితంతువైన 23యేళ్ళ గోదూబాయిని కర్వే వివాహమాడి సాంప్రదాయక మహారాష్ట్ర సమాజంలో ఒక ఉదాహరణగా నిలిచాడు.పూనాలోని ఫెర్గూసన్ కళాశాలలో గణిత అధ్యాపకునిగా పనిచేశారు. కర్వే 1962 నవంబర్ 9 న పూణేలో మరణించాడు. ఏప్రిల్ 26న బాబా ఆమ్టే జయంతి. ఇలా ఈ మాసాంతం సంఘ సంస్కరణ కోసం పాటుపడిన మహనీయుల జయంతో, వర్ధంతో జరుపుకుంటూ వారి సేవలను స్మరించుకుందాం.క్షత్రియులే కాదు, అణగారిన వర్గాలు కూడా రాజ్యాధికారాన్ని చేపట్టి రాజ్యాలను ఏర్పాటు చేయగలరని నిరూపించిన యోధుడు శివాజీ. తరతరాలుగా సామాజిక వివక్షకు గురవుతున్నవారి పక్షాన పూలే పోరాడారు. ఒకవైపు అక్షర జ్ఞానం నేర్పుతూనే మరోవైపు సామాజిక పరివర్తనకు నడుంకట్టి వేల ఏండ్లుగా వస్తున్న దురాచారాలను పెకిలించారు.పూలే మరణించిన ఏడాది తర్వాత 1891 ఏప్రిల్ 14 మరో సామాజిక విప్లవ యోధుడు అంబేద్కర్ జన్మించారు. సామాజిక వివక్షతోపాటు, ఆర్థిక దోపిడీ, రాజకీయ అసమానతలపై ఆయన పోరు సలిపారు. స్వాతంత్ర్య భారతదేశంలో 'నా జాతుల స్థానం ఏమిట'ని ప్రశ్నించారు. రాజ్యాధికారంలో ప్రాతినిధ్యం లేని జాతులు అంతరిస్తాయని పేర్కొంటూ రాజకీయ చైతన్యం కోసం పోరాడారు. తరతరాలుగా దోపిడీకి గురైన వర్గాలకు రాజ్యాంగ రక్షణ కల్పించారు. ఇతర వెనకబడిన తరగతులకు కూడా రాజ్యాంగ హక్కులు ఉండాలని 340 లాంటి ఆర్టికల్స్‌ను రాజ్యాంగంలో పొందుపరిచారు.పూలే, అంబేద్కర్ లాగానే మరో సామాజిక యోధుడు బీపీ మండల్. ఉన్నత ఉద్యోగాన్ని కాదని వెనుకబడిన వర్గాల కోసం రాజకీయ పోరాటం నడిపారు. రామ్ మనోహర్ లోహియా ప్రేరణతో సంయుక్త సోషలిస్ట్ పార్టీలో చేరి, ఆరోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. 1967 షోషిత్ దళ్ పార్టీని స్థాపించి, బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. సీఎంగా, ఎంపీగా సేవలందించినప్పటికీ రెండో ఓబీసీ కమిషన్ చైర్మన్‌గానే ఆయన గుర్తింపు పొందారు. ఇతర వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా ప్రయోజనాల కోసం బీసీ కమిషన్ చైర్మన్‌గా 40 సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి అందించారు. వీపీ సింగ్ హయాంలో విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చేశారు. సామాజిక సంస్కరణల కోసం పాటుపడిన ఎందరో మహనీయుల జయంతులు, వర్ధంతులు ఈ నెలలోనే ఉన్నాయి. అందుకే ఇది మహనీయుల మాసం.

## తెలుగు జానపదం బిరుదు రాజు రామరాజు



బిరుదు రాజు రామరాజు హై స్కూల్ విద్యార్థిగా ఉన్న నాటి నుండి, "భారతి" మొదలైన పత్రికలలో మానవల్లి, వేటూరి, నిడదవోలు, మల్లంపల్లి, వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథములు పీటికలు చదివాడు. వారిలాగే సాహిత్య లోకానికి తెలియని క్రొత్త విషయాలు తాను కూడా చెప్పాలని నిశ్చయంతో పరిశోధన రంగంలో అడుగు పెట్టాడు. జానపద విజ్ఞానంలో విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో దక్షిణ దేశభాషలన్నింటిలోనూ, బిరుదు రాజు రామరాజు యొక్క "తెలుగు జానపద గేయ సాహిత్యం" మొదటి సిద్ధాంత గ్రంథం అయింది. జానపద గేయ రంగంలో అనేక జానపద గేయాలు సంకలనాలు బిరుదరాజు రామరాజు ప్రకటించాడు. తెలుగులో, ఇంగ్లీషులో, జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాత్మక పత్రాలు, రామరాజు చదివాడు. ఇంగ్లీషులో "ఫోక్ టేల్స్ ఆఫ్ ఏ పి." ఫోక్ లోరు ఆఫ్ ఏ పి. సౌత్ ఇండియన్ ఫోక్ సాంగ్స్, గ్లీంప్సెస్ ఇన్ టూ, తెలుగు ఫ్లోక్ లోర్,అనే గ్రంథాలు బిరుదు రాజు ప్రకటించాడు. బిరుదు రాజు తెలంగాణ అంతా తిరిగి వందల కొద్ది తెలుగు, సంస్కృతంలో ఉన్న తాళపత్ర గ్రంధాలు, పదులకొద్దీ, శిలా శాసనాలను, సేకరించాడు. అచ్చు కాకుండా పడి ఉన్న తెలుగు, సంస్కృత కావ్యాలను దాదాపుగా నూరింటిని సాహిత్య ప్రపంచానికి తెలియజేశాడు. మరుగున పడిన మాణిక్యాలు, చరిత్రకి ఎక్కనీ చరితార్థులు, అనే పేరుతో అనేక వ్యాసాలు పత్రికల్లో బిరుదు రాజు రాశాడు.



పరిష్కరించిన, గ్రంధాలు:- సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన 'వసు చరిత్రం' మధురవాణి రచించిన రామాయణ సార తిలకం, వెల్లలా ఉమామహేశ్వర్లు 'శృంగార శేఖర బాణం' శ్రీకృష్ణదేవరాయల జాంబవతి పరిణాయ నాటకం, మొదటిసారిగా పరిష్కరించిన బిరుదు రాజు అనంత రామయ్య, సీతా విజయ చంపు వంటి సంస్కృత కృతులను బిరుద రాజు రామరాజు పరిష్కరించాడు.

తెలుగు గ్రంథాల పరిష్కరణ :- తెలుగులో బొడ్డు చర్ల చీన తిమ్మ కవి 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం' చింతపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయం, వెంకటాద్రి నాయకుని సకల జీవసంజీవనం, పాల్కురికి సోమనాథుని, పండిత రాద్యోదాదహరణం, అనే కావ్యాలను మొదటగా సేకరించి ప్రకటించారు. బిరుదు రాజు రామరాజు, "ఉర్దూ తెలుగు నిఘంటువు"ను కూర్చారు. ఇంగ్లీష్ హిందీల నుండి నాలుగు గ్రంధాలు అనువదించాడు. బిరుదు రాజు పర్యవేక్షణలో 38 మంది ఎంఫిల్, పి హెచ్ డీలు సంపాదించారు.

తెలుగు జానపద విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి ఆచార్య బిరుదు రాజు రామరాజు, పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా, జాతీయ వక్తగా ప్రసిద్ధి పొందిన ఈయన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో 1925 ఏప్రిల్ 16న జన్మించాడు. దేవునూరు, మడికొండ, హనుమకొండలో ప్రాథమిక విద్య మాధ్యమిక విద్యతోపాటు ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తరువాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మీడియం లో బిఏ పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తెలుగు, ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో పిహెచ్ డి పూర్తి చేశాడు. 1952 లో ఉస్మానియా తెలుగు శాఖలో అధ్యాపకుడిగా చేరి రీడర్ గా, ప్రొఫెసర్ గా పదోన్నతి పొందాడు. 1973 నుంచి 1983 వరకు తెలుగు శాఖ అధ్యక్షులుగా కొనసాగాడు.1967 నుంచి 1974 వరకు వరంగల్ స్నాత కోత్తర కేంద్రంలో పనిచేసిన బిరుదరాజు రామరాజు 1983లో పదవి విరమణ పొందాడు.

తెలుగు జానపద గేయ సాహిత్యం పై పిహెచ్ డి చేసి ఆ రంగంలో ఎందరికో మార్గదర్శకుడయ్యడు. జానపద సాహిత్య పరిశోధన దక్షిణ భారతదేశ భాషల్లో నే మొదటి పరిశోధనగా గుర్తింపు పొందింది. బిరుదు రాజు రామరాజు వందల కొద్ది జానపద గేయాలను, అనేక తాళపత్ర గ్రంథాలను, శిలాశాసులను సేకరించాడు. ప్రాచీన కావ్యాలను పరిష్కరించాడు. ఆంధ్రదేశంలోని యోగుల చరిత్రను సేకరించి పుస్తకాలను నిలవరించాడు. ఈయన చేసిన సాంస్కృతిక సేవగాను జాతీయా చార్య పదవి లభించింది. 2010 ఫిబ్రవరి 8న హైదరాబాదులో మరణించాడు. జానపద సాహిత్యాన్ని, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన బిరుదు రాజు రామరాజు, తెలుగు జానపద సాహిత్యం అంటేనే బిరుదు రాజు రామరాజు అని చెప్పుకోవచ్చు.

**ఏప్రిల్ 16 బిరుదు రాజు రామరాజు శతజయంతి సందర్భంగా**


**దేవులపల్లి రమేశ్,**
**సిద్దిపేట, నంగునూర్**
**9963701294**


## రిజర్వేషన్లకు రాజకీయ రంగు ఎందుకు?


తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల కల్పన ఒక గొప్ప సామాజిక లక్ష్యానికి దారిచూపే చర్య. ఇది ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం కాదు. రాష్ట్ర శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లు. అయినప్పటికీ, ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందకముందే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై విమర్శలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేయడం తగదు. ఒకవైపు చట్టం తయారు చేస్తూ, మరోవైపు దాని అమలుపై తటస్థంగా ఉండటం... తరువాత దానికి విరుద్ధంగా కేంద్రాన్ని నిందించటం... ప్రజాస్వామ్య ధర్మానికి విరుద్ధం. గవర్నర్ ఆమోదం తీసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. బిల్లును అమలులోకి తీసుకురావాల్సిన కర్తవ్యాన్ని వదిలేసి, రాజకీయ ఆరోపణల వైపు మళ్ళడం బాధాకరం. ఈ వ్యవహారంలో బాధ్యతను కేంద్రం మీదకు నెట్టడం రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యత నుంచి తప్పించుకోవడమే. అంతేకాకుండా, ఇది ప్రజల మధ్య అపోహలు పెంచే ప్రమాదం కలిగిస్తుంది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పు వంటి అంశాలు చట్టం అమలులోకి వచ్చిన తరువాత మాత్రమే కేంద్ర ప్రభుత్వంతో చర్చించవలసినవి. చట్టానికి బలమైన న్యాయాధారాలు, సమగ్ర డేటా, నివేదికలు అవసరం. అవి లేకుండా ఏ ఇతర చర్యలకైనా వెళ్లడం సాంకేతికంగా ఇబ్బందికరం.తెలంగాణలో బీసీల జనాభా సుమారుగా 56 శాతం పైనే. కానీ విద్యా, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ 29 శాతం లోపే. అలాగే స్థానిక సంస్థలలో 21 శాతమే. ఈ అసమానతలకు నివారణగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లు తేవడమేగాక, వాటిని చట్టబద్ధంగా అమలుచేయడమే లక్ష్యం కావాలి. కానీ రాజ్యాంగ ప్రక్రియను పూర్తి చేయకుండా, ప్రజలలో కేంద్ర ప్రభుత్వమే అడ్డంకి అనే అపోహలు కలిగించడం సమంజసం కాదు. ప్రజల చైతన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వక్రీకరించడం బీసీల చరిత్రలో జరిగిన అన్యాయాలకు మరో రూపమే అవుతుంది.ఒక చట్టాన్ని న్యాయస్థానాల్లో నిలబెట్టాలంటే, శాస్త్రీయ డేటా, కమిషన్ నివేదికలు, సామాజిక పునర్వ్యాఖ్యలు తప్పనిసరి. ఈ విషయాన్ని ఇంద్రా సాహ్ని యూనియన్ ఆఫ్ ఇండియా (1992): 50శాతం గరిష్ఠ పరిమితి, మినహాయింపులకు మార్గంబీ కృష్ణమూర్తి %జం% యూనియన్ (2010): కమిషన్ నివేదికలు తప్పనిసరిబీ వికాస్ గవాళి (2021), రాహుల్ వాఘ్ (2023): డేటా లేకుంటే రిజర్వేషన్లు నిలవవుబీ కోయెలో తమిళనాడు (2007): 9వ షెడ్యూల్‌లో చట్టాలు కూడా కోర్టు పర్యవేక్షణలో ఉంటాయిబీ గౌరవ్ కుమార్ బిహార్ (2023): డేటా లేకుండా రిజర్వేషన్ చట్టం నిలవదు వంటి కీలక తీర్పుల ద్వారా స్పష్టమయింది.తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ ఆమోదం అనంతరం ఈ చట్టాన్ని తక్షణం అమలుచేయాలి. తరువాత డేటా ఆధారంగా పటిష్టంగా నిలబడేలా చేసి, ఆ పిమ్మట కేంద్రాన్ని ఆశ్రయించి 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియ ప్రారంభించాలి. గవర్నర్ ఆమోదం పొందకుండా అమలు ప్రకటనలు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆర్టికల్ 243D ప్రకారం రాష్ట్రానికి స్థానిక రిజర్వేషన్లపై చట్టం చేసే అధికారం ఉంది. కానీ 9వ షెడ్యూల్‌లో చేర్పుపై ముందుగా చర్చించకూడదు.

## రాయల్ డిసీజ్‌పై అవగాహనే ప్రధానం



ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా- డబ్ల్యుఎఫ్హెచ్) స్థాపకులు ఫ్రాంక్ ష్నాబెల్ పుట్టినరోజును పురస్కరించుకుని విశ్వవ్యాప్తంగా ప్రపంచ హిమోఫిలియా దినోత్సవాన్ని 1989 నుండి ప్రతీ ఏడాది ఏప్రిల్ 17న హిమోఫిలియాతో పాటుగా ఇతర జన్యురక్తస్రావ రుగ్మత వ్యక్తుల జీవితాలను మెరుగు పరిచేందుకు అంకితమైన లాభాపేక్షలేని అంతర్జాతీయసంస్థ అయిన ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం ఆధ్వర్యంలో జరుపుతారు. ఈ సంస్థని 1963లో ఫ్రాంక్ ష్నాబెల్ స్థాపించారు. ఈయన తీవ్రమైన హిమోఫిలియాతో జన్మించారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం కెనడాలోని మాంట్రియల్‌లో ఉంది. ఇది 147 దేశాలలో సభ్య సంస్థలను కలిగి ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి అధికారిక గుర్తింపు పొందింది. ఈ రోజున రక్తస్రావం రుగ్మతలతో బాధ పడుతున్న వారికి మెరుగైన వైద్య చికిత్స కోసం అవగాహన కలిగిస్తారు. ఈ సంవత్సరం థీమ్ " అందరికీ అందుబాటులో ఉంది: మహిళలు, బాలికలకు కూడా రక్తస్రావం జరుగుతుంది." రక్తస్రావ రుగ్మతలు ఉంటూ నిర్ధారణ చేయబడిన మహిళలు, బాలికలు ఇప్పటికీ ఉన్నారని, ఒక వేళ వ్యాధి మూలాలు ఉన్నవారికి తక్కువ సేవలు అందుతున్నాయని, వీటిని మార్చవలసిన బాధ్యత సమాజానికి ఉందని ఈ ఇతివృత్త సారాంశం. ఇతివృత్తం కేవలం అవగాహన గురించి మాత్రమే కాదు. లింగంతో సంబంధం లేకుండా అందరూ వారికి అవసరమైన రోగ నిర్ధారణ, చికిత్స, సంరక్షణను పొందేలా చూసుకోవాలని, ఈ సంవత్సరం ఇతివృత్తం ఆరోగ్య సంరక్షణలో సమానత్వ ప్రాముఖ్యతను, రక్తస్రావం రుగ్మతలు ఉన్న మహిళలు, బాలికల అవసరాలకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కలుపుకొని ప్రతిస్పందించేలా ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం 2025 అనేది రక్తస్రావం రుగ్మతలు వివక్ష చూపవని, మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కూడా వివక్ష చూపకూడదని గుర్తుచేస్తుంది.

ఈ రోజు యొక్క లక్ష్యాలు:




హిమోఫిలియా, ఇతర రక్తస్రావం రుగ్మతల గురించి అవగాహన పెంచడం. ఈ పరిస్థితుల వల్ల బాధపడే వ్యక్తులకు మద్దతును అందించడం. రోగ నిర్ధారణ, చికిత్సకు మెరుగైన ప్రాప్యత కలిగించడం ప్రధాన లక్ష్యాలు. ఆలస్యం, తప్పుడు నిర్ధారణలను నివారించడానికి రక్తస్రావం లోపాలు పురుషుల మాదిరిగానే మహిళలను కూడా ప్రభావితం చేస్తాయని గుర్తించడం కూడా ఒక లక్ష్యంగా ఉంది.

**రాయల్ డిసీజ్:**

హిమోఫిలియా వ్యాధి మొదటిగా పురాతన ఈజిప్టులో కనిపించింది. అయితే 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌కు చెందిన విక్టోరియా రాణి ద్వారా ఈ వ్యాధి ఆమె వారసులకు వ్యాపించింది. అలాగే 19, 20 వ శతాబ్దాలలో ఇంగ్లండ్, జర్మనీ, రష్యా , స్పెయిన్ రాజకుటుంబాలను ప్రభావితం చేసినందున ఈ వ్యాధిని కొన్నిసార్లు రాయల్ డిసీజ్ లేదా రాజరిక వ్యాధి అని పిలుస్తారు.

**జన్యుపరమైన రుగ్మత:**

హిమోఫిలియా అరుదైన జన్యుపరమైన వంశపారంపర్య రక్తస్రావ రుగ్మత. దీనిలో రక్తం సాధారణంగా గడ్డకట్టదు. రక్త ప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టడానికి కొన్ని రసాయనాలు ఉంటాయి. వాటిని గడ్డకట్టే కారకాలని అంటారు. ఇవి రక్తం గడ్డకట్టడానికి సహాయపడతాయి. ఒక వ్యక్తి రక్తంలో ఈ కారకాలు సాధారణ మొత్తంలో లేనప్పుడు లేదా రక్తం గడ్డకట్టడానికి అవసరమైన గడ్డకట్టే కారకం ప్రోటీన్‌లను తయారుచేయడానికి సూచనలను అందించే జన్యువులలో పరివర్తన (మ్యుటేషన్) లేదా మార్పు వల్ల హిమోఫిలియా సంభవిస్తుంది. ఈ వ్యాధి ఉన్న వారికి చిన్న గాయాల నుండి కూడా దీర్ఘకాలిక రక్తస్రావం జరుగుతుంది. ఈ వ్యక్తులు గాయపడినప్పుడు, శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు ఎక్కువసేపు రక్తస్రావం అవుతుంది. కొన్ని సందర్భాల్లో కీళ్లలో, మెదడులో కూడా అంతర్గత రక్తస్రావం సంభవించవచ్చు. ఫ్యాక్టర్ %ఎ×××% ప్రోటీన్ లోపం హిమోఫిలియా - ఎ, ఫ్యాక్టర్ %×శ% ప్రోటీన్ లోపం హిమోఫిలియా - బి, ఫ్యాక్టర్ %×శ% ప్రోటీన్ లోపం హిమోఫిలియా - సి వ్యాధులను కలుగజేస్తాయి. దీనికి కారణమయ్యే జన్యువు ' ఎక్స్ ' క్రోమోజోములో ఉంటుంది. అందువలన పురుషులు ఎక్కువగా ప్రభావితమవుతారు. ఈ జన్యువును కలిగిన తల్లి ఒక వేల మగ బిడ్డను ప్రస్తావిస్తే ఆ అబ్బాయి కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశం యాభై శాతం, అదే ఆడ పిల్లకుజన్మనిస్తే ఆ పాప క్యారియర్‌గా ఉండే ప్రమాదం యాభై శాతం ఉంది. అందువల్ల హిమోఫిలియా పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. అయినప్పటికీ ఇది స్త్రీలను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల అమ్మాయిలలో ఋతుస్రావం, ప్రసవానికి ఇబ్బందులు ఏర్పడతాయి.

**ప్రపంచ వ్యాప్తంగా ఎంతమంది?**

ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధిగలవారు సుమారు నాలుగు లక్షల మంది ఉన్నారు. వాస్తవంగా ప్రపంచవ్యాప్తంగా హీమోఫిలియాతో నివసిస్తున్న వారిలో 75% కంటే ఎక్కువ మందిని ఇంకా గుర్తించలేదు. అన్ని దేశాల జాతుల మధ్య సమానంగా పంపిణీ చేయబడింది. ఇది పదివేల సజీవ జననాలలో ఒకరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. మొత్తం హిమోఫిలియా జనాభాలో 80% నుండి 85% వరకు హిమోఫిలియా - ఎ రకం వారు ఉన్నారు. భారతదేశంలో సుమారు 1,36,000 మంది బాధితులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఎందుకంటే ఈ వ్యాధి నిర్ధారణ కానివారు చాలామంది ఉండవచ్చు. ప్రపంచంలో మనదేశం రెండవ స్థానంలో ఉంది.

**లక్షణాలు:**

వ్యాధి ఉన్న వారి మోకాలు, మోచేతులు, చీలమండలు, కణజాలం, కండరాలలో కూడా భారీ అంతర్గత రక్తస్రావం ఏర్పడుతుంది. ప్రభావిత ప్రాంతాల్లో వాపు, నొప్పి వంటి పరిణామాలకు దారితీస్తుంది. ప్రభావితమైన శరీర భాగాలకు శాశ్వత నష్టం కలుగుతుంది. ముఖ్యంగా మెదడులో రక్తస్రావం జరిగినప్పుడు అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. తేలికపాటి లేదా మితమైన హిమోఫిలియా బాల్యం లేదా కౌమారదశలో కనిపిస్తుంది. వీరిలో ఆకస్మిక రక్తస్రావం అసాధారణం. తీవ్రమైన హిమోఫిలియా సాధారణంగా జీవితంలోని మొదటి కొన్ని నెలల్లో కనబడుతుంది. వీళ్ళల్లో తరచుగా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. ఇది బహుళ అవయవాలపై ప్రభావం చూపుతుంది. ఆకస్మిక కీళ్ల రక్తస్రావం సాధారణంగా 65 సంవత్సరాల వయస్సులో 60% వరకు పెరిగే అవకాశం ఉంది. కీళ్ళల్లో రక్తస్రావం తరచుగా పునరావృతమయితే ' కీళ్ళ హిమోఫిలియాకు దారి తీస్తుంది.


**హిమోఫిలియా నివారణ:**

హిమోఫిలియా అనేది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కావున దీనిని నివారించలేము. వీరు శస్త్రచికిత్సలు, దంత చికిత్సలకు ముందు వైద్యులకు తెలియజేయాలి. వ్యాధితో ఉన్న మహిళలు గర్భధారణ సమయంలో పిండ పరీక్షలు చేయించుకోవాలి. ఈ వ్యాధిలో కుటుంబంలోని మహిళా సభ్యులు మాత్రమే వాహకాలు. ఒక కుటుంబంలో హిమోఫిలియా చరిత్ర ఉన్నట్లయితే వైద్యుడిని సంప్రదించి రక్త పరీక్ష చేయించుకుని గడ్డకట్టే కారకాలను పరీక్షించాలి. జన్యువులలోని వాహకాలను పరీక్షించడానికి జన్యుపరీక్ష నిర్వహించడం ద్వారా ముందుజాగ్రత్తలు తీసుకోవచ్చు. వ్యాధి ఉన్నవారు శారీరక దృఢత్వానికి, కండరాలను బలోపేతం కోసం, ఆరోగ్యకరమైన శరీరబరువు నిర్వహణకు, ఎముక సాంద్రత సరైన కండరాల అభివృద్ధిని నిర్ధారించడానికి శారీరక శ్రమ చాలా ముఖ్యమైనది. హిమోఫిలియాతో జీవించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఎందుకంటే ఇది సరళమైన రోజువారీ పనులను కూడా కష్టతరం చేస్తుంది. అయితే వైద్య పురోగతితో జన్యు చికిత్స వంటి ఆధునిక చికిత్సలు భవిష్యత్తులో ఈ రుగ్మతను నయం చేయగలవు. సమతుల్య ఆహారం, సరైన పోషకాహారం హిమోఫిలియా ఉన్నవారు సాధారణ జీవితాన్ని గడపడానికి సహాయపడతాయి. సరైన చికిత్స, జాగ్రత్తలతో హిమోఫిలియా ఉన్నవారు సాధారణ జీవితం గడపగలరు.


**జనక మోహన రావు దుంగ**
**ఫోన్:8247045230**


భక్తి

## ఆ దేవి దర్శనం ఏడాదికి ఒకసారే!



మంగళాదేవి కన్నగి ఆలయ సందర్శన ఆధ్యాత్మిక యాత్ర మాత్రమే కాదు, సాహస యాత్ర కూడా. చుట్టూ క్రూరమృగాల సంచారం ఉన్న దట్టమైన అడవుల మధ్య ఉన్న ఈ ఆలయంలోకి భక్తులను ఏడాదికి ఒకసారి మాత్రమే అనుమతిస్తారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో కొలువైన మంగళాదేవి కన్నగికి చారిత్రకంగానూ, సాహిత్యపరంగానూ కూడా ప్రాధాన్యం ఉంది.పశ్చిమ కనుమల్లోని పెరియార్ పులుల అభయారణ్యం వృక్ష, జీవ వైవిధ్యానికి నెలవు. ఈ అరణ్యంలో... సముద్రమట్టానికి దాదాపు అయిదువేల అడుగుల ఎత్తున ఉన్న మంగళాదేవి కన్నగి ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. దీని నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది.

ఎవరీ కన్నగి?

ప్రాచీన తమిళ సాహిత్యంలో గొప్ప ఇతిహాసాలుగా పరిగణించే అయిదింటిలో 'సిలప్పదికారం' ఒకటి. దీన్ని క్రీస్తుశకం అయిదు, ఆరు శతాబ్దాల మధ్య తమిళ సంగమ సాహిత్య యుగంలో రచించారనేది చరిత్రకారుల అభిప్రాయం. ఒక సామాన్య మహిళ ప్రధాన పాత్రగా రూపొందిన తొలి తమిళ కావ్యం కూడా ఇదే. 'సిలప్పదికారం' కథాంశానికి వస్తే... కోవలన్ అనే ధనికుడైన వ్యాపారితో కన్నగి వివాహం జరిగింది. తన సంపదనంతటినీ ఒక నర్తకి కోసం ఖర్చు చేసిన కోవలన్... పశ్చాత్తాపంతో తిరిగి భార్యను చేరుకున్నాడు. కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్న ఆ దంపతులు... మదురై నగరానికి వెళ్ళారు. అక్కడ కన్నగి కాలి అందెను అమ్మడానికి వెళ్ళాడు. మదురై రాణి కాలి అందె దొంగతనానికి గురి కావడంతో... దానికోసం వెతుకుతున్న భటులు కోవలన్‌ను అనుమానించి బంధించారు. ఎలాంటి విచారణ లేకుండానే రాజు ఆదేశం మేరకు కోవలన్‌కు మరణ శిక్ష అమలు చేశారు. ఈ సంగతి తెలిసిన కన్నగి రాజాస్థానానికి వెళ్ళి, చోరీకి గురైన అందె, కోవలన్ అమ్మబోయిన అందె ఒకటి కాదని నిరూపించింది. దాంతో... ఒక నిరపరాధిని శిక్షించాననే వేదనతో రాజు గుండె పగిలి మరణించాడు. కన్నగి కోపాగ్నికి మధురై నగరం దగ్ధమయింది. ఆ తరువాత పధ్నాలుగు రోజుల పాటు కాలినడకన ప్రయాణించిన కన్నగి... ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశమైన వెంగైకనల్ నెడున్‌కుంద్రం దగ్గరకు చేరుకుంది. అక్కడ దివ్య రూపంలో ఉన్న తన భర్తను ఆమె కలుసుకుందనీ, వారిద్దరూ ఆకాశంలోకి ఎగిరి అంతర్ధానమైపోయారనీ ఆ ఇతిహాసం చెబుతోంది. ఈ అపూర్వ ఘటనను ప్రత్యక్షంగా చూసినవారు... చేర రాజు సెంగుట్టువన్‌కు వివరించగా... ఆయన ఆ ప్రదేశాన్ని సందర్శించాడనీ, హిమాలయాల నుంచి శిలలను తెప్పించి... కన్నగి ఆలయాన్ని నిర్మించాడనీ స్థల పురాణం వెల్లడిస్తోంది. సెంగుట్టవన్ క్రీస్తుశకం రెండో శతాబ్దానికి చెందినవాడు. కాబట్టి ఈ ఆలయం 1800 ఏళ్ళ నాటిదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎన్నో ఆంక్షల మధ్య...కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కన్నగిని దేవతగా ఆరాధించే ఆలయాలు అనేక చోట్ల కనిపిస్తాయి. మంగళాదేవి కన్నగి ఆలయం అడవుల్లో ఉండడం వల్ల చేరుకోవడం కష్టం. దానికి తోడు ఈ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించడంతో అనేక ఆంక్షలు అమలవుతున్నాయి. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమినాడు జరిగే ఉత్సవాలకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు.

# నవతార





## ఐరన్ తక్కువైందని తెలిసేదెలా

జీవక్రియలు సజావుగా జరగడానికి ఐరన్ అత్యవసరం. పోషకాహార లోపం వల్ల ఒక్కోసారి శరీరంలో ఐరన్ మోతాదు తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి తగ్గి పలు ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. శరీరంలో ఐరన్ స్థాయి తగ్గిందని తెలిపే సంకేతాల గురించి నిపుణులు ఇలా చెబుతున్నారు.

సాధారణంగా కాళ్లు, చేతులు కొద్దిగా వేడిగా ఉంటాయి. శరీరంలో ఐరన్ లోపిస్తే కాళ్లు, చేతులు చల్లగా అనిపిస్తాయి. చిన్న పని చేసినా అలసట వస్తుంది. ఎప్పుడూ నీరసంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. సుద్ద, సబ్బు, బలపాలు తినాలనే కోరిక ఏర్పడుతుంది. శరీరంలో ఐరన్ తగినంత పరిమాణంలో లేని పక్షంలో ఊపిరి సరిగా ఆడదు. బలంగా ఊపిరి తీసుకోవాల్సి వస్తుంది.

తరచూ తలనొప్పి వస్తూ ఉంటుంది. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ నిద్ర మబ్బు వదలదు

గోర్లు త్వరగా విరిగిపోతూ ఉంటాయి. కండరాలు పట్టేసినట్లు ఉంటాయి.

శిరోజాలు అధికంగా రాలిపోతూ ఉంటాయి. చర్మం పొడిబారుతుంది. పెదవులు పగిలిపోతాయి. కళ్లలో నీళ్లు తిరుగుతూ ఉంటాయి. శరీరంలో ఐరన్ స్థాయి తగ్గితే రక్త హీనత ఏర్పడుతుంది. దీంతో మెదడుకి ఆక్సిజన్ సరఫరా తగ్గి తల తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. శరీరం వణుకుతూ ఉంటుంది. నిలబడడం కష్టమవుతుంది.

# నారింజ తొక్కతో దంతాల పాచిని వదిలించుకోవచ్చు

పసుపు దంతాలతో ఇబ్బంది పడుతుంటే.. వాటి తెల్లగా మార్చే సహజ ఇంటి చిట్కాలు ఉన్నాయి. కొన్ని సహజ పదార్థాలతో దంతాల పసుపు తొలగించుకోవచ్చు. నారింజ తొక్కలతో దంతాల పాచి వదిలించుకోవచ్చు.

దంతాలు ముఖ సౌందర్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. పళ్ళు తెల్లగా ముత్యాల్లా మెరిసిపోవాలని చాలా మంది కోరుకుంటారు. దంతాలు తెల్లగా మెరిసిపోతే మనలో











ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే పళ్ళు పాచి పట్టి పసుపు రంగులోకి మారితే.. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అందరిలో ఉన్నప్పుడు నవ్వడానికి చాలా తంటాలు పడాల్సి ఉంటుంది. ఈ రోజుల్లో చాలా మంది దంతాలు పాచి పట్టి పసుపు రంగులోకి మారిపోతాయి. పళ్లు తోమే విషయంలో బద్ధకం, ఎప్పుడూ పడితే అప్పుడు తినడం, కెఫీన్ ఉండే డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం, సిగరెట్లు ఎక్కువగా తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారతాయి.

ఇంకొందరు రోజూ రెండు పూటలా బ్రష్ చేస్తారు. కానీ, వారి పళ్ళు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఇక, ఈ సమస్యలు ఉంటే చాలా మంది దంత వైద్యుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. వేల రూపాయల్లో ఖర్చుపెడతారు. మీరు కూడా

పసుపు దంతాలతో ఇబ్బంది పడుతుంటే.. వాటి తెల్లగా మార్చే సహజ ఇంటి చిట్కాలు ఉన్నాయి. కొన్ని సహజ పదార్థాలతో దంతాల పసుపు తొలగించుకోవచ్చు. నారింజ తొక్కలతో దంతాల పాచి వదిలించుకోవచ్చు. దంతాల పాచికి కారణాలు, నారింజ తొక్కలతో ఎలా వదిలించుకోవాలో తెలుసుకుందాం.

దంతాల పాచికి కారణాలు
-సరిగ్గా బ్రష్ చేయకపోవడం
- పొగాకు నమిలే అలవాటు
- ధూమపానం, మద్యపానం
- ఎక్కువగా టీ, కాఫీ తాగడం
- చెడు ఆహారపు అలవాట్లు
- ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీరు తాగడం
- సోడా, కార్బోనేటెడ్ డ్రింక్స్ తాగడం
- దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాట్లకు దూరంగా ఉండండి.

**దంతాలకు నారింజ తొక్కతో ప్రయోజనాలు**

నారింజ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నారింజ పండులో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు ఎన్నో ఉన్నాయి. అయితే నారింజ పండు మాత్రమే కాదు దాని తొక్క కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిం చడంలో సాయ పడుతుంది. ఎందుకంటే ఇందులో ఫైబర్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు వంటి అనేక లక్షణాలు ఉన్నాయి. పసుపు దంతాలను తెల్లగా చేసుకోవాలనుకుంటే, నారింజ తొక్కను దంతాలపై రుద్దవచ్చు. ఇది మాత్రమే కాదు, మీరు ప్రతిరోజూ ఒక నారింజ పండు తింటే, అది మీ దంతాలను శుభ్రంగా ఉంచుతుంది. నోటిలో బ్యాక్టీరియాను నివారిస్తుంది.

**నారింజ తొక్కతో పేస్ట్**

నారింజ తొక్క పేస్ట్ చేయడానికి.. ముందుగా నారింజ తొక్కను ఎండబెట్టుకోండి. ఆ తర్వాత ఆ తొక్కల్ని పొడిలా చేసుకోవాలి. ఆ తర్వాత నారింజ తొక్కల పొడికి కొంచెం ఉప్పు, ఆవాల నూనె కలపండి. ప్రతిదీ కలిపి బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకోండి. ఇలా చేయడం వల్ల దంతాలు మెరుస్తాయి. దంతాలపై పేరుకుపోయిన మురికిని వదిలించుకోవచ్చు. దంతాలపై పాచి తగ్గి మిలమిల మెరుస్తాయని నిపుణులు అంటున్నారు.

అరటి తొక్కని కూడా ట్రై చేయవచ్చు

అరటి పండు తినగానే.. అరటి తొక్కను మనం పారేస్తాం. అయితే, అరటి తొక్కలో బోలెడు మ్యాటర్ ఉంది. అరటి తొక్కలో పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి దంతాలు తెల్ల రంగులో మెరిసేలా చేయడంలో సాయపడతాయి. అరటి తొక్కతో పాటు బేకింగ్ సోడా కలిపితే.. ఈ రెమిడీ అద్భుతంగా పనిచేస్తుంది. ఇంతకీ.. ఈ రెమెడీ ఎలా తయారు చేయాలి.. ఎలా వాడాలో తెలుసుకుందాం.

**అరటి తొక్కని వాడే విధానం**

- ముందుగా అరటిపండు తొక్కను తీసుకుని దాని లోపలి భాగాన్ని పళ్లపై రుద్దాలి. పై నుండి క్రిందికి వృత్తాకార కదలికలో పై తొక్కను రుద్దండి. దీంతో.. అరటి తొక్క పోషకాలు.. దంతాలకు అప్లై అవుతాయి.
- ఇప్పుడు ఒక చెంచా బేకింగ్ సోడా తీసుకుని, దానికి కొంచెం నీళ్ళు పోసి పేస్ట్‌లా మిక్స్ చేసుకోండి.
- ఈ పేస్ట్‌ని అరటిపండు తొక్కతో మిక్స్ చేసి దంతాల మీద అప్లై చేయాలి.
- దంతాల మీద 2-3 నిమిషాల పాటు అలాగే ఉంచి.. ఆపై నీటితో శుభ్రం చేసుకోండి.
- ఈ రెమెడీని వారానికి రెండు సార్లు రిపీట్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# బంగారు నగలు ఎప్పటికీ కొత్తగానే

బంగారం కొత్తగా మెరవాలని అందరికీ ఉంటుంది. అయితే, కొన్నప్పుడు కొత్తలో ఉన్నంత మెరుపు రాన్రాను ఉండదు. అలా కాకుండా ఎప్పటికీ బంగారు నగలు కొత్తగానే ఉండాలంటే ఎలా క్లీన్ చేయాలి, ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి.

బంగారు నగలు వేసుకోవడం చాలా మందికి ఇష్టం. అయితే, వీటిని కొన్నప్పుడు ఎంత కొత్తగా మెరుస్తూ ఉన్నాయో అలానే ఉంచడం కాస్తా కష్టమే. వాడినప్పుడల్లా వాటి మెరుపు కాస్తా తగ్గుతుంది. జ్యువెలరీని వాడితేనే కాదు వాటిని స్టోర్ చేసి పెట్టినప్పటికీ ముందులా కొత్తగా ఉండవు. దీనికి చాలానే కారణాలు ఉంటాయి. అలా కాకుండా బంగారు నగలు ఎప్పటికీ కొత్తగా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. ఇంట్లో దొరికే కొన్ని పదార్థాలతోనే వీటిని క్లీన్ చేసి స్టోర్ చేస్తే అవి తిరిగి కొత్తగా మారతాయి. మరి ఆ కిటుకులేంటో మీరూ తెలుసుకోండి.

**నీటిలో నానబెట్టడం**

నగల్ని నేరుగా క్లీన్ చేయడం కంటే ఓ సారి నీటిలో నానబెట్టి క్లీన్ చేయండి. దీనికోసం గోరువెచ్చని నీరు వాడండి. అలా అని మరీ వేడి నీరు వాడొద్దు. కేవలం గోరువెచ్చని నీటిలో నానబెట్టండి. దీంతో అందులో ఇరుక్కున్న జిడ్డు కరిగి నగలు తెల్లగా వస్తాయి. కాస్తా సమయం నీటిలో నానబెట్టాక ఆ తర్వాత వాటిని క్లీన్ చేయాలి.

**నెమ్మదిగా రుద్దడం**

చాలా మంది బంగారు నగల్ని టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, సర్ఫ్, సబ్బు, లిక్విడ్ ఇలా రకరకాలవి వేసి క్లీన్ చేస్తారు. అయితే, అలా కాకుండా కాస్తా మైల్డ్ సోప్ సొల్యూషన్ అంటే ఎక్కువగా కెమికల్స్ లేని సోప్‌ని వేసి క్లీన్ చేయండి. అది కూడా మెత్తని టూత్ బ్రష్‌తో రుద్దండి. అంతేకానీ, బరబరా రుద్దొద్దు. దీంతో మెరుపు తగ్గడమే కాదు, గీతలు పడే అవకాశం ఉంది. కాబట్టి,



నెమ్మదిగా మైల్డ్ సోప్‌తో నగల్ని క్లీన్ చేయండి.

**క్లీన్ చేయడం**

బ్రష్‌తో రుద్దాక ఒక్కో నగ తీసుకుని నల్లకింద పెట్టి వాటర్ ఆన్ చేయండి. అయితే జాగ్రత్త ఎక్కువ ఫోర్స్‌తో ఆన్ చేయకూడదని గుర్తుంచుకోండి. అదే విధంగా, ఒక్కొక్కటి మాత్రమే జాగ్రత్తగా తీసి వాటర్ కింద ఉంచండి. అంతేకానీ, మనం ఎక్కువగా నీటి కిందపెడితే నగలు జారి కిందపడే అవకాశం ఉంది.

**ఆరనివ్వడం**

అదే విధంగా, ఇలా క్లీన్ చేసిన నగల్ని జాగ్రత్తగా ఆరనివ్వండి. ఇందుకోసం మంచి సాఫ్ట్ అండ్ క్లీన్ క్లాత్ తీసుకుని అద్దాలి. గాలికి ఆరనివ్వండి. పూర్తిగా ఆరిన తర్వాతే స్టోర్ చేయండి. అంతేకానీ, తడిగా ఉన్నప్పుడు పెడితే నగల రంగు మారే అవకాశం ఉంది. కచ్చితంగా పూర్తిగా ఆరిన తర్వాతే భద్రంగా

**స్టోర్ చేయండి.**

వీటిని చక్కగా క్లీన్ చేశాక సెపరేట్‌గా ప్యాక్ చేసి స్టోర్ చేయాలి. ఒక్కొక్కటి విడివిడిగా ఉంచితే గీతలు పడవని గుర్తుంచుకోండి. అంతేకానీ, అన్నీ కలిపి స్టోర్ చేయొద్దు.

అదే విధంగా, గాలి చొరని బాక్స్‌లు వీలైతే ఆ గోల్డ్ కోసం వచ్చిన బాక్సుల్లోనే వాటిని ఉంచాలి.

అప్పుడే గోల్డ్ నగలు ఎప్పటికీ అప్పుడే కొన్నవాటిలా ఉంటాయి.

గోల్డ్, సిల్వర్ నగల్ని కూడా కలిపి ఉంచొద్దని గుర్తుపెట్టుకోండి.

క్లీన్ చేయడం, స్టోర్ చేయడం రెండూ కూడా సెపరేట్‌గానే ఉండాలి.

**వీటిని అసలే వాడొద్దు**

అయితే, కొంతమంది ఎక్కువ మెరుపు రావాలని బ్లీచ్, అమోనియా, ఇతర హార్ష్ కెమికల్స్ వాడతారు. దీని వల్ల మెరుపు వచ్చినప్పటికీ అది శాశ్వతం కాదు. తర్వాత వాటి కళ తగ్గుతుంది. అదే విధంగా, వీటిని క్లీన్ చేసేందుకు స్క్రబ్బర్స్, వూల్ ప్యాడ్స్ వంటివి వాడొద్దు. అవి నగలకి చుట్టుకునే అవకాశం ఉమంది.

# వయసు తగ్గి యవ్వనంలో..

ఫేస్ మాస్క్ తయారు చేసుకోవడం చాలా కష్టం. సింపుల్ గా క్రీమ్ తెచ్చుకుని ముఖానికి రాసేసుకుందాం అని అనుకుంటారు కొందరు. కానీ పెద్దగా రిస్క్ లేకుండానే మాస్క్ తయారు చేసుకునే టిప్ ఇప్పుడు చెప్పుకోబోతున్నాం. దీనికి పెద్ద హడావుడి ఏమీ అక్కర్లేదు. వంటిట్లో ఎప్పుడూ ఉండే పదార్థాలతోనే ఈ మాస్క్ ని తయారు చేసుకోవచ్చు. తరచూ ఈ పేస్ట్ ని ముఖానికి అప్లై చేసుకుంటే యాక్నీ సమస్య చాలా వరకూ తగ్గిపోతుంది. అందరికీ అందంగా కనిపించాలని ఉంటుంది. కానీ చర్మం అందుకు సహకరించదు. కొంత మంది చర్మం చాలా జిడ్డుగా ఉంటుంది. ఎన్ని మందులు వాడినా, ఏం చేసినా ఆ జిడ్డుదనం తొందరగా పోదు. ఈ కారణంగా మరి కొన్ని సమస్యలు వస్తాయి. తరచూ మొటిమలు



అవుతుంటాయి. వాటిని అద్దంలో చూసుకున్న ప్రతిసారీ ఇబ్బందిగా అనిపిస్తుంది. పైగా కొన్ని సార్లు ఈ మొటిమలు చాలా చిరాకు పెడతాయి. అవి కనబడుండా ఉండేందుకు కొందరు గోటితో గిల్లేస్తుంటారు. ఇది సమస్య పోగొట్టకపోగా మరో సమస్యని తెచ్చి పెడతాయి. అక్కడ బ్లాక్ స్పాట్స్ ఏర్పడతాయి. వీటిని పోగొట్టుకోడానికి ఇంకా తంటాలు పడాల్సి వస్తుంది. అయితే..చాలా మంది ఈ ఇబ్బందిని తప్పించేందుకు చాలా ఖర్చు చేస్తుంటారు. రకరకాల క్రీమ్ లు వాడతారు. వీటన్నింటినీ అంత ఖర్చు చేసే బదులు ఇంట్లోనే చాలా సింపుల్ పరిష్కరించుకోవచ్చు. పెద్దగా ఖర్చు లేకుండానే ముఖం మెరిసిపోయేలా చేసుకోవచ్చు. ఓ ఫేస్ మాస్క్ చేసుకుంటే చాలు ముఖంపై ఉన్న మొటిమలు, డార్క్ స్పాట్స్ అన్నీ తొలిగిపోతాయి.

**ఏంటీ ఫేస్ మాస్క్**

ఇప్పుడు చెప్పుకోబోయే ఫేస్ మాస్క్ తో ముఖంపై ముడతలు కూడా తగ్గిపోతాయి. అంతే కాదు. ఇది యాంటీ ఏజింగ్ లా గా పని చేస్తుంది. అంటే..వృద్ధాప్య ఛాయలే ముఖంపై కనిపించవు. మొటిమలు పూర్తిగా మాయమైపోతాయి. ఇంతకీ ఈ మాస్క్ ఎలా తయారు చేసుకోవాలో ఓసారి పరిశీలిద్దాం. ఈ మాస్క్ కోసం కావాల్సినవి

సాబుదానా, అన్నం, శనగపిండి, బంక మట్టి, తేనె, రోజ్ వాటర్. వీటిని సరైన విధంగా మిక్స్ చేస్తే సరిపోతుంది. అయితే ఈ ప్రాసెస్ లో కొన్ని చిట్కాలు పాటించాలి. వీటిని మిక్స్ చేసేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. వాటిని ఎంత మోతాదులో తీసుకుంటున్నామనే దాన్ని బట్టి ఎంత ఎఫెక్టివ్ గా పని చేస్తుందన్నది ఆధారపడి ఉంటుంది.

ఎలా తయారు చేసుకోవాలి

ముందుగా 2 నుంచి మూడు టేబుల్ స్పూన్స్ మేర సాబుదానా తీసుకోవాలి. అంతకు ముందే వాటిని ఓ కప్పు నీటిలో ఉడకబెట్టాలి. అయితే..ఫేస్ మాస్క్ తయారీ కోసం వీటిని ఆ నీటితో పాటు వాడాలి. ఈ మాస్క్ లో అన్నం కూడా కలపాలి. రెండు మూడు టేబుల్ స్పూన్స్ అన్నాన్ని తీసుకోవాలి. ఆ తరవాత ఓ టేబుల్ స్పూన్ శనగపిండి, ఓ టేబుల్ స్పూన్ బంక మట్టి, ఓ టేబుల్ స్పూన్ తేనె అందుబాటులో ఉంచుకోవాలి. చివరగా మూడు నుంచి నాలుగు టేబుల్ స్పూన్స్ మేర రోజ్ వాటర్ నీ తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్ లో వేయాలి.

ముద్దగా మారేంత వరకూ

పైన చెప్పిన పదార్థాలన్నింటినీ మిక్సీ జార్ లో వేసిన తరవాత దాన్ని గ్రైండ్ చేయాలి. అయితే..ఈ పేస్ట్ మరీ బిరుసుగా, వదులుగా కాకుండా ముఖానికి రాసుకునే విధంగా ముద్దగా మారేంత వరకూ చేసుకోవాలి. ఆ తరవాత ఓ బౌల్ తీసుకుని అందులో ఈ పేస్ట్ ని ఉంచాలి. చేతులు శుభ్రంగా కడుక్కుని ఈ పేస్ట్ ని ముఖం అంతా అప్లై చేసుకోవాలి. కాసేపు ఉంచుకుని ఆ తరవాత చల్లని నీళ్లతో కడుక్కోవాలి.

**తరచూ చేస్తే మొటిమలు మాయం**

ఇప్పుడు చెప్పిన ఈ ఫేస్ మాస్క్ ఇంట్లో తయారు చేసుకోవడం ఎంత సులభమో అర్థమయ్యే ఉంటుంది. సాబుదానా మనం రెగ్యులర్ గా సరుకుల్లో తెప్పించుకుంటాం. ఇక శనగపిండి ఎలాగో ఉండే ఉంటుంది. తేనె కూడా రెగ్యులర్ గా వాడుతుంటాం. అదనంగా తెచ్చుకోవాల్సిందల్లా బంక మట్టి ఒక్కటే. ఇది కూడా ఆన్ లైన్ లో ఆర్డర్ పెట్టుకోవచ్చు. చూడడానికి ముల్తానీ మట్టిలానే ఉన్నా ఇది చర్మ సమస్యలకు బాగా పని చేస్తుంది. అయితే..ఏదో ఒకటి రెండు సార్లు చేసి ఎలాంటి ప్రభావం లేదని లైట్ తీసుకోవద్దు. తరచూ దీన్ని తయారు చేసుకుని ముఖానికి అప్లై చేసుకుంటే క్రమంగా పిగ్మెంటేషన్, యాక్నీ లాంటి సమస్యలు తొలగిపోతాయి. చర్మం చాలా మృదువుగా మారుతుంది.

# అక్కడ సిబ్బంది అందరూ మహిళలే

గ్రామీణ మహిళల ప్రస్తావన వచ్చినప్పుడు చాలామంది వారు పొలం పనులకే పరిమితం అనుకుంటారు. కానీ అవకాశాలు లభిస్తే వారు కూడా ఎవరికీ తీసిపోరు. దీనికి ఉదాహరణ మహబూబ్‌నగర్ దివిటిపల్లిలో ఉన్న అమర్‌రాజా గిగా ప్లాంట్‌లో పని చేసే మహిళలు. అక్కడ సుమారు 430మంది సిబ్బంది ఉంటే వారిలో 350 మంది గ్రామీణ యువతులే! వారిలో కొందరిని 'నవ్య' పలకరించింది.

మన గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించే పెద్ద పరిశ్రమలు తక్కువ. పరిశ్రమలు తక్కువ కావటం వల్ల ఇంటర్ దాకా చదువుకున్న అమ్మాయిలు కూడా కూలి పనులకే వెళ్తూ ఉంటారు. కూలి పనికి వెళ్లటం వల్ల ఆదాయం తక్కువగానే వస్తుంది. వారు కుటుంబానికి చేసే సాయం కూడా తక్కువే.. పైగా వారికి పెళ్లి అయి పిల్లలు పుడితే మరిన్ని సమస్యలు పెరుగుతాయి. ఇదంతా ఒక విషవలయంలా తయారవుతుంది. దీని నుంచి వీలైనంత మందిని బయటపడేయాలనే ఉద్దేశంతో అమర్‌రాజా సంస్థ పేదరికం ఎక్కువగా ఉండే మహబూబ్‌నగర్‌లో విడిభాగాలను బిగించి.. బ్యాటరీలను తయారుచేసే గిగా ప్లాంట్‌ను నెలకొల్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా ప్లాంట్‌లను నెలకొల్పినప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. "మేము ఈ ప్లాంట్‌ను ప్రారంభించినప్పుడు- చుట్టుపక్కల ప్రాంతాలలో చదువుకున్న యువతులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించుకున్నాం. అందులో ఎక్కువ మంది పదోక్లాసు,



ఇంటర్ దాకా చదువుకున్నవారే. వారికి సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉండదు. ముందు వారికి శిక్షణ ఇచ్చాం.." అని కంపెనీ ప్రతినిధి వివరించారు. ఈ శిక్షణ ఇవ్వటానికి కూడా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందంటారు ఆమె. "మొదట్లో ఇక్కడ ఉన్న కుటుంబాలలో అనేక అనుమానాలు ఉండేవి.

కంపెనీకి పంపించటానికి సంశయించేవారు. ముందు కొద్ది మంది చేరారు. ఆ తర్వాత వారిని చూసి ఇతరులు వచ్చారు. మా దగ్గర చాలా సురక్షితమైన వాతావరణం ఉంటుందనే విషయాన్ని తెలియజేయటానికి వీరందరినీ చిత్తూరులో ఉన్న మా ప్లాంట్‌కు తీసుకువెళ్లాం. అక్కడ కూడా అందరూ మహిళలే పనిచేస్తూ ఉంటారు. దానితో వీరందరికీ నమ్మకం వచ్చింది. ఇప్పుడు కంపెనీపై పూర్తి భరోసా వచ్చింది" అంటారు ఆ ప్రతినిధి.

జీవన ప్రమాణాలు మెరుగ్గా..

సాధారణంగా పెళ్లి అయ్యి.. పిల్లలు పుట్టిన తర్వాత ఖర్చులు పెరుగుతాయి. ఈ సమయంలో అదనపు సంపాదన మార్గాల కోసం అన్వేషిస్తూ ఉంటారు. ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న సౌజన్యది కూడా ఇదే కథ. "నేను ఇంటర్ దాకా చదివా. తర్వాత పెళ్లి అయిపోయింది. నేను గృహిణి పాత్రకు పరిమితయిపోయా. ఇంటర్ దాకా చదువుకున్నా మంచి ఉద్యోగాలు ఏమి రాలేదు. పొలం పనికి వెళ్తే రోజుకు మూడొందలే వచ్చేది. పైగా అన్ని సీజన్లలోను పని దొరకదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను ప్లాంట్‌లో చేరా. ప్రస్తుతం స్థిరమైన ఆదాయం వస్తోంది. పిల్లల చదువుకు భరోసా వచ్చింది.." అంటారు ఆమె. ప్లాంట్‌లో చేరి ఆదాయం పెరిగిన తర్వాత కూడా రకరకాల అపోహలు వెంటాడుతూ ఉంటాయి. ఇవి తప్పని ఎవరో ఒకరు ఉదాహరణగా నిలిస్తే మిగిలిన వారిలో సైర్థ్యం పెరుగుతుంది. ఈ ప్లాంట్‌లో పనిచేసే మల్లీశ్వరి అలాంటి ఉదాహరణే. "సాధారణంగా బ్యాటరీలు తయారీ ప్లాంట్ అంటే కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయనే అపోహలు ఉండేది. నేను ఉద్యోగంలో చేరటానికి చాలా భయపడ్డా. చేరిన తర్వాత ముడిపదార్థాల నాణ్యతను పరిశీలించి ప్లాంట్‌కు ఇచ్చే బాధ్యతను నాకు అప్పగించారు. పైగా షిఫ్టులు కూడా ఉంటాయి. మొదట్లో ఇబ్బంది అనిపించేది. కానీ నా కుటుంబ సభ్యులు సహకరిస్తూ ఉండటంతో ఇబ్బంది లేకుండా సాఫీగా సాగిపోతోంది" అంటారు మల్లీశ్వరి.

# తీపి తడాఖా తగ్గేలా

బరువు తగ్గే ప్రయత్నంలో భాగంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు, తీపి విషయంలో కూడా అదే సూత్రాన్ని అనుసరిస్తూ ఉంటారు. కానీ ఇలా మనసు చంపుకోవలసిన అవసరం లేకుండా, సంతృప్తి పొందేలా తీపి తినేయాలని సూచిస్తున్నారు ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్ రుజుత దివేకర్. ఆమె ఏమంటున్నారంటే...

సాధారణంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు మైదాకు బదులుగా బాదం పిండి, లేదా తృణధాన్యాలతో తయారైన కేకులు, బిస్కెట్లు ఎంచుకుంటూ ఉంటారు. కానీ నేనైతే మైదా, చక్కెర, నెయ్యి దట్టించి తయారుచేసిన పిండి వంటలనే ఎంచుకుంటాను. తినే ప్రతి పదార్థాన్నీ పిండిపదార్థాలు, కొవ్వులు, క్యాలరీల్లో లెక్కించుకుంటూ ఉంటే, తినడంలో ఉండే సంతోషాన్ని కోల్పోతాం! దాంతో తినే పదార్థాలన్నీ రుచిని కోల్పోయి, అసంతృప్తిని మిగులుస్తాయి. కాబట్టి ఈ లోటు తెలియకుండా ఉండాలంటే పాలు తాగాలనుకుంటే



వెన్న తీయని పాలే ఎంచుకోవాలి.


గుడ్డు తింటే పచ్చసొనతో సహా మొత్తం గుడ్డు తినేయాలి. ఇలా తినగలిగితే తర్వాత అసంతృప్తి వేధించదు,

తినాలనే యావ పెరగదు. పరిమిత ఆహారం తీసుకునేవారు అప్పుడప్పుడూ తీపి తినడం వల్ల ఒరిగే నష్టం పెద్దగా ఉండదు. తీపి తినాలనుకుంటే, షుగర్ లేదని చెప్పుకునే చాక్లెట్లకు బదులుగా నచ్చిన స్వీటును తినేయాలి. ఇలా తినడం వల్ల మానసిక సంతృప్తి దక్కి, తీపి మీద యావ పోతుంది. అలాగే తీపితో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి కాబట్టి తీపిని ఖాళీ కడుపుతో కాకుండా, భోజనం తర్వాత తినాలి. ఇలా తినడం వల్ల భోజన పదార్థాల్లోని పోషకాలు, తీపి పదార్థం లోని చక్కెరల శోషణను క్షీణింపచేస్తాయి. ఫలితంగా శరీరం మీద తీపి ప్రభావం తగ్గుతుంది.

## భారత్‌కు శుభసూచకం.. వరుసగా మూడో సెషన్‌లోనూ బలపడ్డ రూపాయి



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికన్ డాలర్ తో పోల్చితే భారత రూపాయి వరుసగా మూడో సెషన్‌లోనూ బలపడింది. ఇవాళ (బుధవారం) 12 పైసలు మెరుగుపడి చివరికి 85.68 వద్ద ముగిసింది. విదేశీ నిధుల రాక పెరగడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే అమెరికా కరెన్సీని కొంత బలహీనపర్చింది. అమెరికా వివిధ దేశాలపై టారిఫ్‌లు విధించడం ఇండియన్ రూపీకి లాభం చేకూర్చిందని ఫారెక్స్ నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం కూడా రూపాయి బలోపేతం కావడానికి దోహదపడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో ఇవాళ 85.66 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 85.50 గరిష్ఠ స్థాయిని తాకింది. అదేవిధంగా 85.72 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరికి 85.68 వద్ద సెటిల్ అయ్యింది. క్రితం రోజు అంటే మంగళవారం నాటి ముగింపుతో పోల్చుకుంటే 12 పైసలు మెరుగుపడింది.మంగళవారం కూడా రూపాయి బలపడింది. 30 పైసలు మెరుగుపడి 85.80 వద్ద ముగిసింది. అంతముందు సెషన్‌లో అంటే శుక్రవారం నాటి సెషన్‌లో రూపాయి ఏకంగా 58 పైసలు మెరుగుపడింది.




## లాభాల్లో ముగిసిన మార్కెట్లు.. 309 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు.. చివరి సెషన్‌లో పుంచుకోవడంతో లాభాల్లోకి వచ్చా యి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రతికూల ప్రభావంతో దేశీయ మార్కెట్లు స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. బ్యాం కింగ్ స్టాక్స్ రాణించడంతో లాభాలను ఆర్జించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. ఉదయం సెన్సెక్స్ 76,996.78 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,543.77 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. ఒక దశలో 77,110.23 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది.చివరకు 309.40 లాభంతో 77,044.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 108.65 పాయింట్లు పెరిగి.. 23,437.20 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,561 షేర్లు లాభపడ్డాయి. 1,244 షేర్లు నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ట్రెంట్, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి. మారుత సుజుకీ, హిందాల్కో, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్ నష్టపోయాయి. ఆటో, ఐటీ, ఫార్మా మినహా మిగతా అన్ని సూచీలు మీడియా, పీఎస్‌యు బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ ఒకటి నుంచి రెండుశాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది.

## మార్కెట్లోకి నకిలీ ఫోన్ పే, గూగుల్ పే యాప్స్.. జర జాగ్రత్త..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత కాలంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం బాగా పెరిగినప్పటికీ, సైబర్ మోసాలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్లోకి ఇటీవల నకిలీ చెల్లింపు యాప్స్ వచ్చాయి. వీటిని చూస్తే నిజంగా %ఫ్ఖఎ, గ్రాష్ట్రశీఅవువ, గ్ఖువ్ఎ%ల మాదిరిగానే కనిపిస్తాయి. కానీ నిజానికి ఇవి ఫేక్ చెల్లింపు యాప్‌లు. ఇవి డబ్బు పంపిన తర్వాత నోటిఫికేషన్ పంపించినట్లు చూపిస్తాయి. కానీ చెల్లింపు మాత్రం జరగదు.

**మోసాలను గుర్తించి**

ఇలాంటి వాటి విషయంలో విక్రేతలు లేదా వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నకిలీ యాప్‌లను ఉపయోగించి అనేక మంది మోసాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ప్రత్యేకించి చిన్న వ్యాపారులు ఈ మోసాల వల్ల ఎక్కువగా నష్టపోతారని చెప్పారు. ఈ క్రమంలో వినియోగదారులు, వ్యాపారులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నకిలీ యాప్‌ల వలలో పడకుండా, అసలైన యాప్‌లను మాత్రమే గుర్తించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపుల విషయంలో మోసాలను గుర్తించి, అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని నిపుణులు సూచించారు.

**నోటిఫికేషన్ వస్తుంది కానీ డబ్బులు రావు**

మార్కెట్లో యాక్టివ్‌గా ఉన్న ఈ నకిలీ చెల్లింపుల్లో కొన్ని చాలా అధునాతనమైనవి కావడంతో వాటిని గుర్తించడానికి చిన్న చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ యాప్ చెల్లింపు నోటిఫికేషన్ బీప్ సౌండ్ నిజం మాదిరిగా అనిపించడంతో అనేక మంది కూడా గుర్తించలేకపోతున్నారు. దీని కారణంగా చెల్లింపు పూర్తయినట్లు అనిపిస్తుంది. అయినప్పటికీ చెల్లింపు జరగదు. డబ్బు కూడా ఖాతాలోకి రాదు.

**నకిలీ చెల్లింపు యాప్‌లను ఎలా నివారించాలి**

మోసపూరిత లావాదేవీల విషయంలో స్కామర్లు నకిలీ చెల్లింపు యాప్‌లను ఉపయోగిస్తారు. ఆ క్రమంలో వ్యాపారులు కొన్ని చిట్కాలను పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. మీ చెల్లింపు యాప్ లేదా బ్యాంక్ లావాదేవీలను ఎల్లప్పుడూ తనిఖీ చేయాలి. స్క్రీన్‌షాట్‌లు లేదా నోటిఫికేషన్‌లపై మాత్రమే ఆధారపడవద్దు. లావాదేవీ వివరాలలో వ్యత్యాసాలు ఉన్నాయో లేదా పరిశీలించాలి. లావాదేవీని త్వరగా పూర్తి చేయమని మిమ్మల్ని ఒత్తిడి చేసే, మీకు సమయం ఇవ్వని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

**ఈ యాప్స్ గురించి**

మీ ప్రాంతంలో సాధారణంగా ఉపయోగించే చట్టబద్ధమైన చెల్లింపు యాప్‌ల గురించి తెలుసుకోండి. ఎవరైనా తెలియని యాప్ ద్వారా చెల్లింపు చేయమని అడిగితే జాగ్రత్తగా వహించాలి. రద్దీగా ఉండే దుకాణంలో గందరగోళాన్ని లేదా వ్యాపారి దృష్టి మరల్చడాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్ళు ఈ నకిలీ చెల్లింపు యాప్‌లను ఉపయోగించి మోసం చేసే అవకాశం ఉంది. ఈ మోసపూరిత లావాదేవీల గురించి అందరికీ అవగాహన కల్పించండి.

## 10 నిమిషాల్లో ఇంటికి సిమ్ కార్డు




**హైదరాబాద్ -నవభూమి:** భారతి ఎయిర్‌టెల్ మరో వినూత్న సర్వీసుకు శ్రీకారం చుట్టింది. కస్టమర్లు కోరిన 10 నిమిషాల్లో వారి ఇంటికి సిమ్ కార్డు పంపిస్తామని ప్రకటించింది. ఇందుకోసం క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'బ్లింకిట్' ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సేవ కోసం ఖాతాదారులు రూ.49 చెల్లించాలి. ప్రస్తుతం ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, హైదరాబాద్ వంటి 16 నగరాల్లో ఈ సర్వీసు లభిస్తుంది. త్వరలోనే మిగతా నగరాలు, పట్టణాలకూ ఈ సేవను విస్తరించబోతున్నట్టు తెలిపింది. ఈ పద్దతిలో సిమ్ కార్డు అందుకున్న ఖాతాదారులు 15 రోజుల్లోగా తమ ఆధార్ సాయంతో తమ కనెక్షన్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

# బంగారంపై కళ్లుచెదిరే రిటర్న్స్..లక్షకు ఎంతొచ్చిందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** 2017-18 ప్రీ మెచ్యూర్ రిడెంప్షన్ ధరను RBI ప్రకటించింది. ఇష్యూ ధరతో పోలిస్తే పెట్టుబడిదారులు 211 శాతం పన్ను రహిత రాబడిని పొందనున్నారు. బంగారం ధరలు భారీగా పెరగడం దీనికి కారణం. అసలు సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ ఏంటి.. రిటర్న్స్ ఎలా వస్తాయ్ వంటి వివరాల గురించి తెలుసుకుందాం.

బంగారం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో.. సావరిన్ గోల్డ్ బాండ్స్‌లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాలు వస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా SGB 2017-18 సిరీస్ III కి సంబంధించి.. ముందస్తు విమోచన ధరను (ప్రీ మెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్) ప్రకటించింది. ఏప్రిల్ 16, 2025 నాటికి ఈ బాండ్ల ధర ఒక్కో బాండ్‌కు రూ. 9,221గా నిర్ణయించింది. సాధారణంగా గోల్డ్ బాండ్ పథకంలో.. కాలపరిమితి 8 సంవత్సరాలుగా ఉంటుంది. కానీ ఐదేళ్ల తర్వాత ముందస్తుగా విత్‌డ్రా చేసుకునేందుకు ఛాన్స్ ఉంది. అయితే 2017-18 సిరీస్ III అంటే ప్రస్తుతం చెప్పుకునేది ఇప్పుడే 8వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. పూర్తి మెచ్యూరిటీకి మరో ఏడాది ఉన్నప్పటికీ ఇప్పుడు ముందస్తుగా తీసుకునే ఛాన్స్ ఉంది.2017-18లో %SGB% సిరీస్ %III% ఇష్యూ ధర గ్రాముకు కేవలం రూ 2,964 మాత్రమే. ఒక గ్రామును ఒక యూనిట్‌గా చెబుతుంటారు. అంటే, అప్పుడు మీరు ఒక గ్రాము బంగారం విలువైన ఒక యూనిట్ గోల్డ్ బాండ్ రూ. 2,964కు కొనుగోలు చేసి ఉంటే, ఇప్పుడు దాని ముందస్తు విమోచన ధర రూ. 9,221 గా ఉంది. అంటే ఎంత రిటర్న్స్ వచ్చాయో అర్థం చేసుకోవచ్చు. ఈ లెక్కన మనం రూ. లక్ష పెట్టుబడిపై రిటర్న్స్ ఎలా వచ్చాయో తెలుసుకుందాం.

ఇష్యూ ధర: రూ. 2,964
ప్రీ మెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్ : రూ. 9,221
అబ్సల్యూట్ రిటర్న్స్: రూ. 9,221 – రూ. 2,964 = రూ. 6,257

ఇక్కడ ఏకంగా 211 శాతానికిపైగా రాబడి అందింది. అప్పట్లో మీరు రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, మీకు సుమారు 33.74 యూనిట్ల (రూ. 1,00,000 / రూ. 2,964) గోల్డ్ బాండ్లు వచ్చి ఉండేవి. ఇప్పటి గ్రాము ధర రూ. 9,221 ప్రకారం ఈ విలువ రూ. 33.74%x9221R% రూ. 3,11,193. అంటే లక్ష పెట్టుబడికి రూ. 3 లక్షలకుపైగా వచ్చింది. మరోవైపు వార్షిక ప్రాతిపదికన 2.50 చొప్పున వడ్డీ కూడా అందిస్తుంది. ఇది పైన చెప్పుకున్న రాబడికి అదనం. ఇలా బంపర్ రిటర్న్స్ వచ్చాయని చెప్పొచ్చు.

**సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్**

సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ అనేది భౌతిక బంగారం కొనకుండానే అందులో పెట్టుబడి పెట్టడానికి భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలిసి తీసుకొచ్చిన పథకం. ఇది ఒక రకమైన ప్రభుత్వ సెక్యూరిటీ. బాండ్ విలువ గ్రాముల బంగారంలో ఉంటుంది. పెట్టుబడిదారులు ఇష్యూ ధర చెల్లించి బాండ్లను కొనుగోలు చేస్తారు. మెచ్యూరిటీ సమయంలో అప్పటి బంగారం ధర ప్రకారం నగదును పొందుతారు. దీనిపై వార్షికంగా స్థిరమైన వడ్డీ కూడా లభిస్తుంది. అయితే, ఇటీవల కేంద్ర ప్రభుత్వం అధిక రుణ వ్యయాలు, బంగారం ధరల అస్థిరత్వం వంటి కారణాల వల్ల ఈ పథకాన్ని నిలిపివేయాలని యోచిస్తోంది. 2015లో ప్రారంభించిన ఈ పథకం బంగారం దిగుమతులను తగ్గించడం, ప్రజలను భౌతిక బంగారం పెట్టుబడి సాధనాల వైపు మళ్లించడం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎస్‌బీఐ నుంచి టాప్-5 పథకాలు ఇవే




**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలని అనుకున్నప్పుడు ముందుగా మీకు ఎదురయ్యే ప్రశ్న ఏ ఫండ్ ఎంచుకోవాలి? అనే ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమైన అంశంగా ఫండ్ రేటింగ్ కనిపిస్తుంది. మంచి రేటింగ్ ఉంటే ఆ ఫండ్ పనితీరును చెప్పడమే కాకుండా మార్కెట్ ఒడిదొడుకుల్లో ఫండ్ ఏ విధంగా స్థిరంగా ఉంటుందో తెలియజేస్తుంది. మీరు తొలిసారి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే టాప్ రేటింగ్ ఉన్న ఫండ్స్ ఎంచుకోవడం తెలివైన పనిగా నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలో దిగ్గజ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ నుంచి 5 టాప్ రేటింగ్ స్కీమ్స్ గురించి ఇక్కడ మనం తెలుసుకుందాం. గడిచిన 10 సంవత్సరాల్లో ఈ స్కీమ్ హైరిటర్న్స్ అందించాయి.ఎస్‌బీఐ కాంట్రా ఫండ్ కి 5 స్టార్ రేటింగ్ కలిగి ఉంది. ఈ పథకాన్ని జులై 5, 1999లో లాంచ్ చేశారు. గత 10 సంవత్సరాల రిటర్న్స్ చూస్తే సగటున వార్షిక రాపడి 15.04 శాతంగా ఉంది.

ఎస్‌బీఐ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్‌కి సైతం 5 స్టార్ రేటింగ్ ఉంది. ఈ పథకాన్ని మార్చి 31, 1993లో లాంచ్ చేశారు. గత 10 సంవత్సరాల్లో చూస్తే సగటున వార్షిక రాబడి 13.63 శాతంగా ఉంది.

ఎస్‌బీఐ మాగ్నమ్ మిడ్ క్యాప్ ఫండ్ 4 స్టార్ రేటింగ్ కలిగి ఉంది. ఈ పథకాన్ని మార్చి 29, 2005లో లాంచ్ చేశారు. గత 10 సంవత్సరాల్లో సగటున వార్షిక రాబడి 14.82 శాతం అందించింది.

ఎస్‌బీఐ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఈ స్కీమ్ 4 స్టార్ రేటింగ్ కలిగి ఉంది. ఈ పథకాన్ని ఫిబ్రవరి 29, 1993లో లాంచ్ చేశారు. గత 10 ఏళ్లలో చూసుకుంటే సగటున వార్షిక రాబడి 13.96 శాతంగా ఉంది.

ఎస్‌బీఐ బ్లూచిప్ ఫండ్ )కి సైతం 4 స్టార్ రేటింగ్ కలిగి ఉంది. ఈ పథకాన్ని ఫిబ్రవరి 14, 2006లో లాంచ్ చేశారు. గత 10 ఏళ్ల సగటు వార్షిక రాబడి 12.02 శాతంగా ఉంది.

అయితే, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకున్నప్పుడు మీరు ఎంచుకునే ఫండ్ గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలి. నష్టపోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా మార్కెట్ రిస్క్ అనేది కచ్చితంగా ఉంటుంది. మీ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యం బట్టి మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ ఎంచుకోవాలి. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకుల్లోనూ స్థిరమైన రాబడిని అందించే ఫండ్స్ ఎంచుకుంటే నష్టభయం అనేది తక్కువగా ఉంటుంది. హైరేటింగ్ ఉన్న అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల పథకాల నుంచి ఎంచుకోవచ్చు. అయినప్పటికీ మార్కెట్ నిపుణుల సలహాలు తీసుకోవడం మంచింది. లేదంటే నష్టపోయే ప్రమాదం అధికంగా ఉంటుంది.

## భయపెడుతున్న బంగారం ధరలు.. ఏకంగా 98 వేలకు చేరి రికార్డ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ టైం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టుబడులపైన ఫోకస్ చేస్తున్నారు.

**బంగారం ర్యాలీకి ప్రధాన కారణం..**

మరోవైపు బుధవారం వెండి ధర కిలోకు రూ.1,900 పెరిగి రూ.99,400కి చేరుకుంది. ఇది కూడా సురక్షిత పెట్టుబడులకు అనుగుణంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడం బంగారం ర్యాలీకి ప్రధాన కారణాల్లో ఒకటని నిపుణులు అంటున్నారు. డాలర్ విలువ పడిపోతే, బంగారం ధర పైపైకి చేరుతుంది. అదనంగా, వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు, ఆర్థిక మందగమనం భయాలు, ఫెడరల్ రిజర్వ్ పాలసీ అనిశ్చితి వంటి అంశాలు కూడా ఈ రేట్లను ప్రభావితం చేస్తున్నాయి.

కొత్త గరిష్టాలకుఇంకోవైపు MCXలో జూన్ గోల్డ్ ఫ్యూచర్స్ రూ.1,984 లేదా 2.12 శాతం పెరిగి రూ.95,435 రికార్డు గరిష్టాన్ని తాకాయి. COMEXలో స్పాట్ గోల్డ్ ఔన్సుకు $3,300 దాటి వెళ్లింది. ఇది ప్రపంచ స్థాయిలో బంగారంపై ఉన్న విశ్వాసాన్ని మరోసారి చూపిస్తుంది. గ్లోబల్ ఇన్వెస్టర్లు ఇప్పుడు బంగారాన్ని 'సురక్షిత స్వర్గం'గా తిరిగి ఆదరిస్తున్నారు. అయితే అమెరికా, చైనా మధ్య సుంకాలపై చర్చలు ఇంకా తగ్గడం లేదు. అధ్యక్షుడు ట్రంప్ కీలకమైన ఖనిజాలపై సుంకాలు విధించే ప్రకటన, చైనా వస్తువులపై 245 శాతం వరకు సుంకాల పెంపు, అన్ని అంశాలు కూడా బంగారం ధరలను మరింత పెరిగేలా చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# రూ.1499కే విమాన ప్రయాణం..

## ఇండిగో సమ్మర్ సేల్.. కడప, కర్నూల్ నుంచీ ఫ్లైట్స్!




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ దిగ్గజ విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగో ఎయిర్‌లైన్స్ మరోసారి బంపర్ ఆఫర్ తెచ్చింది. ఈ వేసవిలో ఏదైనా పర్యటక ప్రాంతానికి వెళ్లాలనుకునే వారికి చాలా తక్కువ రేటుకే విమాన ప్రయాణం కల్పిస్తోంది. ఇండిగో సమ్మర్ సేల్ పేరుతో ప్రత్యేక సేల్ నిర్వహిస్తోంది. ఈ స్పెషల్ ఆఫర్‌లో భాగంగా బస్ టికెట్ ధరకే విమాన ప్రయాణం కల్పించడంతో పాటు వివిధ రకాల సేవలపై 50 శాతం వరకు డిస్కౌంట్ సైతం కల్పిస్తోంది. ఇండిగో సమ్మర్ సేల్ ద్వారా కేవలం రూ.1499కే విమాన ప్రయాణం చేయవచ్చు. సమ్మర్ సేల్ ఏప్రిల్ 15వ తేదీనే ప్రారంభమైంది. ఏప్రిల్ 18, 2025 అర్ధరాత్రి వరకు టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు.

ఇండిగో ఎయిర్ లైన్స్ తీసుకొచ్చిన ఈ సమ్మర్ సేల్‌లో భాగంగా దేశీయ ఎకానమీ క్లాస్ టికెట్ ధరలు రూ.1499కే లభిస్తున్నాయి. ఎంపిక చేసిన రూట్లలో ఈ టికెట్ ధరలు వర్తిస్తాయని తెలిపింది. అందులో మన తెలుగు రాష్ట్రాల మధ్య సైతం విమానాలు నడుస్తున్నాయి. కడప, కర్నూలు, హైదరాబాద్, చెన్నైల మధ్య రూ.1499కే విమాన ప్రయాణం చేయవచ్చు. కడప నుంచి హైదరాబాద్, కడప నుంచి చెన్నై, చెన్నై నుంచి కర్నూల్, కడప నుంచి విజయవాడ మధ్య రూ.1499కే టికెట్లు అందిస్తోంది. తెలుగు రాష్ట్రాల వారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. విమాన టికెట్లు బుకింగ్‌కి ప్రయాణానికి మధ్య వారం రోజులు వ్యవధి ఉండాలి. అంటే టికెట్ బుక్ చేసుకున్న 7 రోజుల తర్వాత ప్రయాణం ఉండేలా చూసుకోవాలి.

ఇండిగో అధికారిక వెబ్‌సైట్ goindigo.in లేదా ఇండిగో మొబైల్ యాప్ లేదా ఇండిగో లేదా ఇండిగో వాట్సాప్ నంబర్ 7065145858 తో పాటు గుర్తింపు పొందిన ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ఏప్రిల్ 15 నుంచి 18 వ తేదీ మధ్య టికెట్లు బుకింగ్ చేసుకున్న వారికి ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఇక అంతర్జాతీయ మార్గాల్లో కేవలం రూ.4,499కే విమాన టికెట్లు అందిస్తోంది. ఎంపిక చేసిన రూట్లలో ఈ ధరలు వర్తిస్తాయి.

**అదనపు డిస్కౌంట్లు..**

దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో ప్రీ పెయిడ్ అదనపు బ్యాగేజీపై 50 శాతం వరకు డిస్కౌంట్ కల్పిస్తోంది. అలాగే స్టాండర్డ్ సీట్ సెలెక్షన్ పై 35 శాతం తగ్గింపు ఇస్తోంది. ముందస్తుగా భోజనం బుక్ చేసుకుంటే 10 శాతం వరకు తగ్గింపు ఉంటుంది. 6%జు% ప్రైమ్, సీట్, ఈట్ పై 30 శాతం వరకు తగ్గింపు ఇస్తోంది. ఈ రాయితీలు అనేవి సెక్టార్, ఫ్లైట్ షెడ్యూల్, జర్నీ రంకం బట్టి మారుతుంటాయని ఇండిగో తెలిపింది. పూర్తి వివరాలకు ఇండిగో అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు.

# సేవింగ్స్ అకౌంట్ వడ్డీ తగ్గిస్తోన్న బ్యాంకులు



**న్యూఢిల్లీ-నవభూమి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలే రెపో రేటును తగ్గించింది. దీంతో బ్యాంకులు సైతం డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్నాయి. ఈ క్రమంలో పొదుపు ఖాతాలో జమ చేసే డబ్బులపై రాబడి తగ్గిపోతుంది. సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లు తగ్గిన క్రమంలో లిక్విడ్, మనీ మార్కెట్, ఓవర్ నైట్ ఫండ్స్ అనేవి ఇన్వెస్టర్లకు మంచి అవకాశంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. స్వల్ప కాలిక రిటర్న్స్ కోసం చూసే వారికి లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ సరైనవిగా సూచిస్తున్నారు. కారణాలు తెలుసుకుందాం.

'లిక్విడ్, మనీ మార్కెట్ ఫండ్స్ కేవలం మంచి రాబడులే కాదు హైలిక్విడిటీని కలిగి ఉండి తక్కువ వడ్డీ రేటు రిస్క్ కలిగి ఉంటాయి. స్వల్పకాలిక లాభాల కోసం చూసే వారికి ఇవి సరైన ఎంపికగా చెప్పవచ్చు.' అని ఫిస్డమ్‌లో రీసర్చ్‌గా సేవలందిస్తున్న సాగర్ షిండే పేర్కొన్నారు. సేవింగ్స్ ఖాతా మాదిరిగా ఎప్పుడు అవసరమైతే అప్పుడు డబ్బులు తీసుకునే అవకాశం ఉండి మంచి రాబడి కావాలనుకునే వారికి లిక్విండ్ ఫండ్స్ సరైన ఎంపికగా చెబుతున్నారు. ప్రస్తుతం బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తున్న క్రమంలో రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉండి హైరిటర్న్స్ కోసం చూసే పెట్టుబడిదారులు తమ డబ్బులను లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లించవచ్చని చెబుతున్నారు.

ఇటీవలే ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లను తగ్గించింది. ప్రైవేట్ రంగంలోని బ్యాంకింగ్ వ్యవస్థలోనే అత్యల్పంగా 2.75 శాతం వడ్డీ రేటును ఇస్తోంది. 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింది. కొత్త వడ్డీ రేట్లను ఏప్రిల్ 12 నుంచే అమలులోకి తెచ్చింది. మరోవైపు.. యాక్సిస్ బ్యాంక్ సైతం సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింద. కొత్త వడ్డీ రేట్లను ఏప్రిల్ 15 నుంచే అమలులోకి తెచ్చింది. ఈ బ్యాంకుల మాదిరిగానే ఇతర బ్యాంకులు సైతం సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నట్లు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

**లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్..**

లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ గత మార్చి నెల పని తీరును గమనిస్తే వీటి నుంచి రూ.1.33 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. జనవరి నెలలో రూ.91,592 కోట్లు, ఫిబ్రవరి నెలలో 4,976 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఆర్థిక సంవత్సరం 2025లో లిక్విడ్ ఫండ్స్ మొత్తంగా రూ. 38,348 కోట్ల పెట్టుబడులను అందుకున్నాయి. ఇక ఓవర్ నైట్ ఫండ్స్ ఔట్ ఫ్లో రూ.4995 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్ రూ.66,581 కోట్ల ఇన్‌ఫ్లో కలిగి ఉన్నాయి. అయితే మార్చి నెలలో కార్పొరేట్ సంస్థలు, ఇన్‌స్టిట్యూషన్లు ఇయర్ ఎండ్ ట్యాక్స్, ఆర్థిక అవసరాలు తీర్చుకోవడం, అడ్వాన్స్ ట్యాక్స్ పేమెంట్ల కోసం వెనక్కి తీసుకుంటాయి. అందుకే మార్చిలో ఔట్ ఫ్లో ఎక్కువగా ఉంటుంది.అయితే మ్యూచువల్ ఫండ్స్‌లో హైరిస్క్ ఉంటుంది. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకుని, పూర్తి స్థాయిలో అవగాహనతోనే ఇన్వెస్ట్ చేయాలి. లేదంటే నష్టపోయే ప్రమాదం ఉంటుందని గమనించాలి.

## చైనా చర్యలకు తగ్గేదేలే.. అమెరికాకు వచ్చే దిగుమతులపై 245 శాతం సుంకాలు

**అమెరికా-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా ఇటీవల చైనాపై ప్రకటించిన సుంకాల నిర్ణయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా దిగుమతులపై 245 శాతం వరకు సుంకాలను పెంచారని వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ పేర్కొనడం, ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. అయితే ఈ సుంకాలు మొత్తం చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై వర్తించవు. వాస్తవానికి 245% సుంకం అనేది పలు వేర్వేరు సుంకాల సమ్మేళనంగా ఉంటుందని తెలిపింది. ఇది చైనా ఉత్పత్తులపై అమలు చేయబడుతున్న మొత్తం సుంకాల గరిష్ట పరిమాణం.ఉదాహరణకు చైనీస్ సిరంజిలపై 100% సుంకం, ఫెంటానిల్ (ఓపియాయిడ్ డ్రగ్)పై 20% సుంకం, పరస్పర సుంకాలుగా 125% సుంకం విధించబడ్డాయి. ఈ మొత్తం సుంకాలను కలిపితే 245 శాతం అవుతుంది. ఈ విధంగా, చైనా ఉత్పత్తులపై అమలు చేయబడుతున్న సుంకాల మొత్తం 245%గా ఉంది. ఇది ట్రంప్ పరిపాలన చైనా దిగుమతులపై మొత్తం సుంకాలను 145% నుంచి 245%కి పెంచిందని మాత్రం కాదు. ఇప్పటికే అమల్లో ఉన్న వేర్వేరు సుంకాల మొత్తం 245%కి చేరుకుందని ఆయా వర్గాలు తెలిపాయి.అరుదైన వస్తువుల విషయంలో..ఈ సుంకాల పెంపు నిర్ణయం ఇప్పటికే అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. చైనా ఈ చర్యలకు ప్రతీకారంగా, అమెరికా నుంచి వచ్చే వస్తువులపై సుంకాలను పెంచింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత సంక్లిష్టం చేస్తోంది. దీంతోపాటు చైనా కూడా అమెరికా నుంచి వచ్చే వస్తువులపై నిషేధం విధిస్తోంది. ఈ క్రమంలోనే చైనా ఆటో, ఏరో స్పేస్, అయస్కాంతాలు సహా అరుదైన వస్తువుల ఎగుమతులను అమెరికాకు నిలిపివేసింది. అమెరికాకు ఎగుమతి చేయాల్సిన దుస్తువుల విషయంలో కూడా ఆంక్షలు విధించింది.వచ్చే రోజుల్లో..ఈ క్రమంలో ఈ రెండు దేశాల మధ్యం వాణిజ్య యుద్ధం ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. ఈ సుంకాల ప్రభావం కాస్తా ఇప్పుడు అక్కడి ప్రజలపై భారం పడుతుంది. చైనా ఈ సుంకాలను తప్పించుకోవడానికి కొత్త విధాన చర్యలను ప్రకటించింది. ఇది చైనా ఎగుమతులను రక్షించడానికి, విదేశీ వాణిజ్య పరిమితులకు వ్యతిరేకంగా మంచి వాతావరణాన్ని సృష్టించడానికి చైనా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే రోజుల్లో సుంకాల తగ్గింపు అంశంపై ఈ దేశాలు వెనక్కి తగ్గుతాయా లేదా అనేది చూడాలి మరి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ గురువారం
17 । ఏప్రిల్ । 2025

## కోడలిని గొడ్డలితో నరికి చంపి.. ఊరిబయట చెట్టుకు ఉరేసుకుని..!



**షాజహాన్‌పూర్-నవభూమి:** ఓ వృద్ధుడు కోడలిని గొడ్డలితో నరికి చంపి తాను చెట్టుకు ఉరేసుకున్నాడు. ఉత్తరప్రదేశ్ లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. షాజహాన్‌పూర్ జిల్లా కాంట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాతీపూర్ కురియా గ్రామానికి చెందిన రాజ్‌పాల్ సత్య (70), సుమిత్ర (30) ఇద్దరూ మామాకోడళ్లు.రాజ్‌పాల్ కొడుకు లారీ డ్రైవర్. విధి నిర్వహణలో భాగంగా అతడు ఎక్కువ సమయం ఇంటి దూరంగా ఉంటాడు. తండ్రి అతడి భార్యను చంపిన రోజు కూడా తను ఇంట్లో లేడు. అయితే రాజ్‌పాల్ నిత్యం తాగొచ్చి కోడలితో గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో రాజ్‌పాల్ ఇంట్లో దాచి ఉన్న గొడ్డలితో కోడలి మెడ నరికాడు. దాంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రాజ్‌పాల్ ఊరిబయట చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపారు. తాగిన మైకంలో రాజ్‌పాల్ చేసిన గొడవే రెండు నిండు ప్రాణాలు పోవడానికి కారణమైందని స్థానికులు చెబుతున్నారు.

## క్యాష్ ఆన్ ట్రాక్స్.. ఇకపై రైళ్లలోనూ ఏటీఎం సేవలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** మాల్స్, ఆఫీసులు, రహదారుల పక్కన, పెద్దపెద్ద ఆఫీసులు, ఉన్న ఏటీఎం (ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్ %ూవీ%) సేవలు త్వరలో కదిలే రైళ్లలోనూ రానున్నాయి. ప్రయాణికులకు ఈ సేవలను అందించేందుకు ఇండియన్ రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా దేశంలోని మొట్టమొదటిసారి మధ్య రైల్వే ఈ సేవలు ప్రారంభిస్తోంది. మంగళవారం విజయవంతంగా ట్రయల్ రన్ పూర్తి చేసింది. మన్మాడ్-ముంబయి మధ్య నడిచే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ఏటీఎంను ఏర్పాటు చేసింది. ట్రయల్ రన్ సాఫీగా జరిగిందని అధికారులు తెలిపారు. అయితే, ఇగత్పురి, కసారా మధ్య ఉండే నెట్‌వర్క్ లేని ప్రాంతంలో ముఖ్యంగా సొరంగాల వల్ల కొన్నిసార్లు సిగ్నల్ పోవడం మాత్రమే ఒక చిన్న సమస్య అని పేర్కొన్నారు.

భుసావల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఇటి పాండే మాట్లాడుతూ... ట్రయల్ రన్‌లో మంచి రిజల్ట్స్ వచ్చాయి.. ఇక ప్రయాణికులు కదులుతున్న రైలులో నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. మేం ఏటీఎం పనితీరును నిరంతరం పరిశీలిస్తూనే ఉంటాం' అని తెలిపారు.రైల్వే భుసావల్ డివిజన్, మహారాష్ట్ర బ్యాంక్ భాగస్వామ్యంతో ఇన్నోవేటివ్ అండ్ నాన్-ఫేర్ రెవెన్యూ ఐడియాస్ స్కీమ్ కింద ఈ ఏటీఎం ఏర్పాటైంది. ' సమావేశం సమయంలో రైళ్లలో ఏటీఎం పెట్టే ఆలోచనను మొదట ప్రతిపాదించాం... ప్రతిపాదన వచ్చిన వెంటనే మేము అమలు విధానాలపై చర్చించాం' అని పాండే చెప్పారు.పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులు, రైల్లో ఏటీఎం అందుబాటులోకి తీసుకురావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏసీ కోచ్‌లో దీనిని ఏర్పాటు చేసినప్పటికీ, రైలులోని 22 బోగీల్లోని అందరికీ కనిపించేలే అనుసంధానం చేశారు..

రైలు టికెట్ అడ్వాన్స్ బుకింగ్ 60 రోజులకు కుదింపు.. కొత్త రూల్స్ ఇవేసంజయ్ ఝా అనే ప్రయాణికుడు మాట్లాడుతూ.. 'ఇది రైల్వే చేపట్టిన మంచి కార్యక్రమం. రైళ్లోనే నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు, చెక్‌బుక్‌లు ఆర్డర్ చేయవచ్చు, స్టేట్‌మెంట్‌లు పొందవచ్చు. ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది' అని అన్నారు.

పంవటి ఎక్స్‌ప్రెస్ బోగీలు.. ముంబయి-హింగోలి జన్‌శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (12071)ను కలపడం వల్ల ఈ ఏటీఎం సేవలు హింగోలి వరకు ప్రయాణించే దూర ప్రయాణికులకు కూడా అందుబాటులో ఉంటాయి. ఏటీఎం సేవలకు ప్రజాదరణ పొందితే ఇతర ముఖ్యమైన రైళ్లలో కూడా ఈ సదుపాయం విస్తరించే అవకాశముంది. భద్రత పరంగా ఏటీఎం కియోస్క్‌ను అవసరమైనప్పుడు మూసివేయొచ్చు. అలాగే 24 గంటల సీసీటీవీ పర్యవేక్షణలో ఉంటుందని అధికారులు తెలిపారు.


## ఆలయ ఉత్సవాల్లో అపశ్రుతి.. అగ్నిగుండంలో పడి భక్తుడు మృతి



**తమిళనాడు-నవభూమి:** తమిళనాడు రాష్ట్రంలోని ఓ ఆలయ వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండంలో పడి ఓ భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన రామనాథపురం జిల్లాలో ఏప్రిల్ 10న చోటు చేసుకోగా.. ఇప్పుడు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.కుసవంకుడి గ్రామంలో సుబ్బయ్య ఆలయ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండంలో నడవడం అక్కడి ఆచారం. ఇలా చేస్తే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో భక్తులు చెప్పులు లేకుండా అగ్నిగుండంలో నడుస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని వలంతరవాయ్ గ్రామానికి చెందిన కేశవన్ (56) కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అగ్నిగుండంపైకి పరిగెత్తుతూ అకస్మాత్తుగా నిప్పులపై పడిపోయాడు. దీంతో అప్రమత్తమైన రెస్క్యూ బృందం వెంటనే అతన్ని అగ్నిగుండం నుంచి బయటకు తీసుకొచ్చారు. కేశవన్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రామనాథపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు.

## భార్యను విడిచి తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు డిమాండ్..

### నిరాకరించిన ప్రియుడిపై దాడి



**చండీగఢ్-నవభూమి:** భార్యాపిల్లలను విడిచి తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు డిమాండ్ చేసింది. దానికి నిరాకరించిన ప్రియుడ్ని తన కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి ఐసీయూలో చికిత్స పొందాడు. హర్యా నాలోని ఫరీదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. గుల్షన్ బజరంగీకి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అయితే విడాకులు తీసుకుని పిల్లలున్న గుంజన్‌తో అతడికి ఏడేళ్లుగా వివాహేతర సంబంధం ఉన్నది. ఈ నేపథ్యంలో భార్యాపిల్లలను విడిచిపెట్టాలని లేదా వారిని చంపి తనను పెళ్లి చేసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది.కాగా, మార్చి 18 నుంచి ఐదు రోజులపాటు గుల్షన్‌ను గుంజన్ నిర్బంధించింది. మార్చి 22న మత్తులో ఉంచి అతడి ఇంటికి తీసుకెళ్లింది. భార్య, పిల్లలకు విషం ఇచ్చి చంపాలని లేదా తనను పెళ్లి చేసుకునేందుకు భార్యను ఒప్పించాలని ఒత్తిడి చేసింది. అయితే తన కుటుంబానికి హాని తలపెట్టబోనని గుల్షన్ చెప్పాడు. ఈ నేపథ్యంలో అతడు రెండో పెళ్లి చేసుకునేందుకు భార్య అంగీకరించింది. అయినప్పటికీ ఆమెను రెండో పెళ్లి చేసుకునేందుకు అతడు నిరాకరించాడు.మరోవైపు మార్చి 29న గుంజన్‌కు ఇచ్చిన రూ.21.50 లక్షలు తిరిగి ఇవ్వాలని గుల్షన్ డిమాండ్ చేశాడు. దీంతో తన తల్లిదండ్రులతో కలిసి అతడిపై ఆమె దాడి చేయగా అక్కడి నుంచి తప్పించుకున్నాడు. రాజీ పేరుతో గుల్షన్‌కు ఒక చోటకు రప్పించారు. అక్కడ గుంపుగా అతడిపై దాడి చేశారు. కర్రలతో కొట్టారు. తీవ్రంగా గాయపడిన గుల్షన్‌ను స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. దీంతో వారం రోజులపాటు ఐసీయూలో చికిత్స పొందాడు.కాగా, ప్రియురాలు, ఆమె కుటుంబ సభ్యులు తనపై దాడి చేసినట్లు పోలీసులకు గుల్షన్ ఫిర్యాదు చేశాడు. అయితే అంతగా శిక్ష పడని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని, వారిని అరెస్ట్ చేయలేదని అతడు ఆరోపించాడు.

# తమ్ముడు చేసిన దొంగతనంతో.. అక్క ఇంట్లో 3 మరణాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లై అత్తింట్లో ఉంటున్న ఏ అమ్మాయికి అయినా పుట్టింటి నుంచి ఎవరైనా వస్తే వచ్చే సంతోషమే వేరు. వారు వచ్చినప్పటి నుంచి వెళ్లేదాకా తెగ మురిసిపోతూ సపర్యలు చేస్తుంటారు. ముఖ్యంగా అమ్మానాన్నలు, అక్కాచెల్లెల్లు, సోదరులు వస్తే ఇక ఆమె సంతోషానికి అవధులే లేకుండా పోతాయి. అచ్చంగా ఇలాగే ఫీలైందో అమ్మాయి. తన తమ్ముడి ఇంటికి రాగా అతడికి నచ్చినవన్నీ వండి ప్రేమగా వడ్డించింది. చాలా కాలం తర్వాత కలిశామంటూ అనేక విషయాలు గురించి మాట్లాడింది. చిన్ననాటి రోజులను గుర్తు చేసుకుంటూ తమ్ముడిపై ప్రేమను గుర్తు చేసింది. అతడు కూడా అక్క ప్రేమకు పొంగిపోయాడు.ఇలా చూస్తుండగానే రెండు రోజులు గడిసిపోగా తిరిగి ఇంటికెళ్లిపోతానని చెప్పాడు తమ్ముడు. అక్క కూడా గుండెల నిండా ప్రేమతో మళ్లీ రమ్మని చెప్పి సాగనంపింది. కానీ ఆ తర్వాత ఆమెకు అసలు విషయం బోధ పడింది. ముఖ్యంగా తమ్ముడు వెళ్తూ వెళ్తూ తన ప్రేమను, జ్ఞాపకాలను మాత్రమే తీసుకెళ్లలేదని భర్త మొబైల్ ఫోన్ సహా నగదును ఎత్తుకెళ్లాడని గుర్తించింది. అయితే తనకంటే ముందే ఈ విషయం ఆమె భర్తకు తెలిసింది. ఫలితంగా బావ మరిదికి ఫోన్ చేసి వాదులాడాడు. అప్పటికే విపరీతమైన బాధతో కన్నీళ్లు పెట్టుకుంటున్న మహిళను సైతం తిట్టగా అవమాన భారం భరించలేక ఆత్మహత్య చేసుకుంది. తనతోపాటు తన ఇద్దరు పిల్లలను కూడా వెంట తీసుకెళ్లింది. ఈ విషాధకర ఘటన ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

కర్ణాటకలోని చామరాజనగర జిల్లా హనూరు తాలుకా కాడుగోళ గ్రామానికి చెందిన మహేశ్‌కు చాలా ఏళ్ల క్రితమే వేరే గ్రామానికి చెందిన 30 ఏళ్ల సుశీలతో వివాహం జరిగింది. అయితే వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా 11 ఏళ్ల దివ్య, 8 ఏళ్ల చంద్రు పుట్టారు. అయితే హాయిగా సాగుతున్న వీరి కాపురంలోకి అనుకోకుండా ఓ విషాధం వచ్చి పడింది. ముఖ్యంగా సుషీల తమ్ముడ మాదేవ ఆదివారం రోజు వారింటికి వచ్చాడు. చాలా రోజుల తర్వాత తమ్ముడు రాగా తెగ మురిసిపోతూ సుశీల సపర్యలు చేసింది. తమ్ముడు మాదేవపై ప్రేమను కురిపిస్తూ మంచిగా చూసుకుంది. మేనమామ రావడంతో పిల్లలు కూడా తెగ సంబుర పడిపోయారు. అతడితో ఆడుకుంటూ చాలా ఎంజాయ్ చేశారు.ఈక్రమంలోనే అక్క, పిల్లలు చూడకముందు మాదేవ ఇంట్లో నుంచి బావ ఫోన్, నగదును తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఇక వెళ్తానంటూ అక్కకు చెప్పి వెళ్లిపోయాడు. అయితే అతడు వెళ్లిన చాలా సేపటికి మహేశ్.. తన ఫోన్, నగదు లేకపోవాడన్ని గుర్తించాడు. ఇంటికి వచ్చింది మాదేవనే కాబట్టి అతడే తీసుంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. వెంటనే బావమరిదికి ఫోన్ చేసి ఇంటికొచ్చి ఇలా చేయడం తప్పు, నేను చాలా కష్టపడి సంపాదించిన డబ్బు అది తిరిగిచ్చేయమంటూ గొడవ పడ్డాడు. ఆపై ఫోన్ పెట్టేసి భార్య సుశీలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశాడు. మీ తమ్ముడు మనింట్లోనే ఇలా ఎలా చేయగలిగాడని ప్రశ్నించాడు.

తమ్ముడు దొంగతనం చేసిన విషయం గుర్తించి తీవ్ర మనోవేదనకు గురైన సుశీలను భర్త మాటలు మరింత బాధ పెట్టాయి. దీంతో అవమాన భారం భరించలేక అదేరోజు పిల్లల్ని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే కోపంగా ఉంది కాబట్టి భార్య పుట్టింటికే వెళ్లుండొచ్చని భావించిన మహేష్ ఆమెతో వెళ్లలేదు. కానీ సుశీల మాత్రం పుట్టింటికి వెళ్లకుండా తమ ఇంటికి దగ్గర్లో ఉన్న ఓ బావి వద్దకు వెళ్లి పిల్లలను అందులో తోసేసింది. ఆపై ఆమె కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే మరుసటి రోజు ఉదయం స్థానికులు సుశీల బట్టలు, పిల్లల బట్టలు, తాళిబొట్టు వంటివి బావి వద్ద ఉండడాన్ని గమనించారు. ఇలా ఆమె భర్తతో పాటు పోలీసులకు సమాచారం అందించారు.హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు సుసీల, దివ్య, చంద్రు మృతదేహాలను బావిలోంచి వెలికి తీశారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త మహేష్ ఫిర్యాదు మేరకు ఆమె సోదరుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చున్నీతో భర్తను ఉరేసి చంపి.. శవాన్ని కాల్వలో పడేసిన యూట్యూబర్



**మీరట్-నవభూమి:** యూపీలోని మీరట్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన తర్వాత ఓ వ్యక్తి తనకు అలారి పరిస్థి రాకూడదని తన భార్యకు.. ప్రియుడితో పెళ్లి చేశాడు. తాజాగా, అలాంటి మరో ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో వీడియోలు, రీల్స్ చేస్తోన్న ఓ వివాహిత.. అతడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.. ప్రియుడితో ఉండగా భర్తకు దొరికిపోయి.. దారుణానికి ఒడిగట్టింది. భర్తను ఉరేసి హత్యచేసి.. ప్రియుడితో కలిసి శవాన్ని కాల్వలో పడేసింది. దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన హర్యానాలోని హిసార్ జిల్లాలో చోటుచే సుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హిసార్‌లోని ప్రేమనగర్‌కు చెందిన ప్రవీణ్ (35), రవీనా (32) భార్యాభర్తలు. వీరికి ఆరేళ్ల బాబు ఉన్నాడు. రవీనాకు సురేష్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఈ పరిచయంతో ఇద్దరూ షార్ట్ వీడియోలు తీయడం మొదలుపెట్టారు. దీనికి భర్త ప్రవీణ్, అతడి కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పారు. అయినాసరే ఏడాదిన్నర నుంచి వీడియోలు చేస్తూ.. సోషల్ మీడియాలో పెడుతున్నారు.

డాన్స్ రీల్స్ ద్వారా రవీనాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 34,000 మందికి పైగా ఫాలోవర్లు వచ్చారు. యూట్యూబ్‌లో కూడా ఇతరులతో కలిసి వీడియో సిరీస్‌లు చేస్తోంది. కుటుంబ సభ్యుల అభ్యంతరాలను పట్టించుకోకుండా.. భర్తతో గొడవలు పడుతూ కూడా వీడియోలు చేస్తూనే ఉంది. అయితే, ప్రవీణ్‌తో సాన్నిహిత్యం పెరిగి.. అక్రమ సంబంధానికి దారితీసింది.

ఈ క్రమంలో మార్చి 25న సురేశ్‌తో అభ్యంతరకరమైన స్థితిలో ఉండగా ప్రవీణ చూసి భార్యను నిలదీశాడు. దాంతో రవీనా, సురేష్ కలిసి దుపట్టాతో అతడి గొంతుకు ఉరేసి హత్య చేశారు. ప్రవీణ్ ఎక్కడున్నాడని కుటుంబ సభ్యులు అడిగితే తనకు తెలియదని అబద్ధం చెప్పింది. అదే రోజు రాత్రి 2:30 గంటల సమయంలో, ప్రవీణ్ మృతదేహాన్ని ప్రియుడి సాయంతో బైక్‌పై ఎక్కించుకుని వెళ్లి, ఇంటి నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిన్నోడ్ రోడ్ కాలువలో పడేసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మిస్సింగ్ కేసు నమోదుచేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. మార్చి 28న కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ప్రవీణ్ మృతదేహం పోలీసులకు కనిపించింది.రవీనాను అనుమానించిన పోలీసులు.. ఇంటి వైపు వెళ్లే రోడ్లపై ఉన్న సీసీటీవీ వీడియోలను పరిశీలించారు. బైక్‌పై ఉన్న వ్యక్తి మధ్యలో మృతదేహం ఉన్నట్టు కనిపించింది. రవీనా ముసుగు ధరించి వెనుక కూర్చొని ఉంది. రెండు గంటల తర్వాత అదే బైక్‌పై ఆమె తిరిగి ఇంటికి వచ్చినట్లు సీసీటీవీలో రికార్డయ్యింది. దీంతో రవీనా, ఆమె ప్రియుడు సురేశ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కుమారుడు తాత సుభాష్ సంరక్షణలో ఉన్నాడు.ఈ ఘటనకు నెలరోజుల ముందే, ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్‌ను.. భార్య రస్తోగి ప్రియుడితో కలిసి హత్య చేసి, అతడి శరీరాన్ని ముక్కలు చేసి, డ్రమ్ములో వేసి సిమెంట్‌తో సీల్ చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనతో భయపడిపోయిన ఓ వ్యక్తి తన భార్యను ఆమె ప్రేమికుడికి ఇచ్చిన పెళ్లి చేసిన ఘటన కూడా వార్తల్లో నిలిచింది.

## భాషకు మతానికి సంబంధం లేదు.. ఉర్దూ ఇండియాలోనే పుట్టింది..: సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉర్దూ భాష ఇండియా లోనే పుట్టిందని.. దాన్ని ఓ ప్రాంతానికి, మతానికి అంటకట్టడం సరికాదని సుప్రీం కోర్టు తెలిపింది. ముఖ్యంగా మరాఠీని మాత్రమే సైన్ బోర్డులకు వాడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉర్దూను వాడకూడదంటూ అనుమతి ఇవ్వాలని దాఖలు అయిన పిటిషన్‌ను తిరస్కరించింది. మరాఠీతో పాటు ఉర్దూ భాషకు కూడా రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన హోదా ఉన్నట్లు పేర్కొంది. అక్కడితో ఆగకుండా ఒక భాష అనేది సంస్కృతి సమాజం, ప్రజల నాగరికత కొలవాడనికి ఓ కొలమానం అని వివరించింది. సైన్ బోర్డులపై మరాఠీని మాత్రమే ఉపయోగించాలని.. ఉర్దూను ఉపయోగించడానికి అనుమతించకూడదంటూ దాఖలు అయిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఉర్దూ కూడా ఇండియాలోనే పుట్టిందని.. దాన్ని ఓ మతానికి, ప్రాంతానికి అంటకట్టడం సరికాదని చెప్పింది. ఈ రెండు భాషలకు రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన హోదా ఉందని గుర్తు చేసింది. ఉర్దూ స్థానిక ప్రజలందరికీ బాగా అర్థం అవుతున్నందును సైన్ బోర్డులపై ఆ భాషను వాడుతున్నట్లు వివరించింది. ఇకపై కూడా ఇదే కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోనే నేమ్ బోర్డులపై మరాఠీతో పాటు ఉర్దూ భాషను ఉపయోగించడాన్ని సవాల్ చేస్తూ.. మహారాష్ట్రలోని అకోలా జిల్లా పాటూరు మాజీ కౌన్సిలర్ వర్షతాయ్ సంజయ్ బగాడే మున్సిపల్ కౌన్సిల్‌కు వెళ్లారు. అయితే దీన్ని మున్సిపల్ కౌన్సిల్ తిరస్కరించింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ముఖ్యంగా మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగే పనులు అన్నీ మరాఠీలోనే నిర్వహించాలని.. ఉర్దూను సైన్ బోర్డుపై ఉపయోగించడానికి అనుమతించకూడదంటూ పిటిషన్ వేశారు. దీన్ని పరిశీలించిన న్యాయస్థానం విచారణ కూడా జరిపి తీర్పునిచ్చింది. కానీ దాంతో సంతృప్తి చెందని వర్షతాయ్ సంజయ్ బగాడే సుప్రీం కోర్టుకు వెళ్లారు.

ఈక్రమంలోనే నేడు అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ముఖ్యంగా బాష.. ఒక సమాజానికి, ప్రాంతానికి, ప్రజలకు చెందినదని జస్టిస్ ధులియా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఉర్దూ ఇండియాలోనే పుట్టిందని.. కానీ ఆ భాష ముస్లింలకు సొంతమైందని వివరించారు. హిందువలకు హిందీ భాషను, ముస్లింలకు ఉర్దూ భాషను బ్రిటీష్ పాలకులు అంటగట్టారని గుర్తు చేశారు. అయితే ఉర్దూ బాష గురించి చర్చించే సందర్భం ఇని కాదంటూనే.. హిందీ, ఉర్దూలు కలిసిపోయినట్లు వివరించారు. హిందీ భాష ఎక్కువ శాతం సంస్కృత భాషగా, ఉర్దూ పర్షియన్ భాషగా గుర్తింపు తెచ్చుకున్నట్లు చెప్పారు.ఇలా బ్రిటీష్ పాలకులు భాషలను విభజించగా.. హిందీ హిందువులు, ఉర్దూ ముస్లింల భాషగా ప్రజల్లోకి వెళ్లిందని న్యాయస్థానం తెలిపింది. అలాగే ఉర్దూ భాషకు ఇండియాలో ఆనవాళ్లు ఉన్నాయని, ఒక మతానికి ఈ భాషను ఆపాదించలేమని పేర్కొంది. మరాఠీ, హిందీ భాషల తరహాలోనే ఉర్దూ కూడా ఇండో-ఆర్యన్ భాష అని స్పష్టం చేసింది. ఇక్కడే పుట్టి, ఎంతో మందికి బాగా నచ్చిన ఈ భాష కవుల హృదయాలను సైతం కదిలించిందని చెప్పుకొచ్చింది. ఇప్పటికీ స్థానిక ప్రజలకు ఈ భాష బాగా అర్థం అవుతుండడం వల్లే సైన్ బోర్డులపై కొనసాగుతోందని కోర్టు వెల్లడించింది. ఇలా సుప్రీం కోర్టు సంచలన తీర్పునివ్వగా అంతా షాక్ అవుతున్నారు.2022 చట్టం లేదా ఇతర ఏ చట్టంలోని నిబంధనల్లో ఉర్దూ వాడకంపై నిషేధం లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తాము ఏకీభవిస్తున్నట్లు వివరించింది. అలాగే మున్సిపల్ కౌన్సిలర్ చేయాల్సిందల్లా సమర్థవంతమైన కమ్యూనికేషన్‌ను రూపొందించడమేనని పేర్కొంది.

## గంటలో పెళ్లనగా ప్రియుడితో పారిపోయింది



**న్యూఢిల్లీ-నవభూమి:** తన మనసుకు నచ్చిన అమ్మాయితో పెళ్లి ఫిక్స్ చేశారు పెద్దలు. మరికాసేపట్లోనే పెళ్లనగా అందంగా ముస్తాబై వచ్చి పెళ్లి పీటల మీద కూర్చున్నాడు. అయితే వధువు మేకప్ కోసం బ్యూటీపార్లర్‌కు వెళ్లగా.. ఆమెను చూడాలని తెగ ఉబలాటపడుతున్నాడు. ఇంతలోనే అమ్మాయి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతూ పందిట్లోకి వచ్చారు. తమ కుమార్తె రోడ్డు ప్రమాదనికి గురై చనిపోయిందని చెప్పారు. ఇలా ఒక్కసారిగా తన ఆశలన్నీ అడియాశలు కాగా పెళ్లి కొడుకు కుప్పకూలాడు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడు.దీంతో అతడి వద్ద ఒకరిని ఉంచి అబ్బాయి తరపు వాళ్లంతా అంత్రయక్రియల కోసం అని అమ్మాయి ఇంటికి వెళ్లారు. కానీ అక్కడెళ్లాకే వారికి అసలు విషయం తెలిసి షాక్ అయ్యారు. ముఖ్యంగా పెళ్లి కుమార్తె బతికే ఉండడం చూసి విస్తుపోయారు. అసలా తల్లిదండ్రులు అలా అబద్ధం ఎందుకు చెప్పారు, ఆ కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ఓ అబ్బాయికి అదే ప్రాంతానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయించారు. చాలా రోజుల క్రితమే వీరికి పెళ్లి కుదరగా.. ఏప్రిల్ 14వ తేదీన పెళ్లికి ముహూర్తాలు పెట్టుకున్నారు. దీంతో అటు అమ్మాయి తల్లిదండ్రులు, ఇటు అబ్బాయి తల్లిదండ్రులు పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. నిశ్చితార్థం దగ్గర నుంచి హల్దీ, మెహందీ, సంగీత్ వంటి సంబురాలన్నీ చేశారు. మరికొన్ని గంటల్లోనే పెళ్లి ఉందనగా.. అంతా కల్యాణ మండపానికి వెళ్లారు.

అప్పటికే వంటలు కాగా.. బంధువులు, స్నేహితులంతా అక్కడకు చేరుకున్నారు. పంతులు కూడా కాబోయే వరుడితో పూజలు చేయిస్తున్నాడు. అయితే అప్పటికే మేకప్ కోసం బ్యూటీపార్లర్‌కు వెళ్లిన వధువు మాత్రం ఎంతకూ రావడం లేదు. దీంతో ఆమెతో వెళ్లిన బంధువులకు తల్లిదండ్రులు ఫోన్ చేశారు. అప్పుడే వారు అమ్మాయి తన ప్రియుడితో కలిసి పారిపోయిందని చెప్పారు. గంటలో పెళ్లనగా కుమార్తె వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోయిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలారు. కన్నీరుమున్నీరుగా విలపించారు.ఇంతలోనే అక్కడకు వరుడి తరఫు వాళ్లు వచ్చి ఏమైందని ప్రశ్నించగా.. అసలు విషయం చెబితే అందరి ముందు పరువు పోతుందని భావించి.. బ్యూటీపార్లర్ నుంచి వస్తుండగా తమ కుమార్తె రోడ్డు ప్రమాదనికి గురైందని, ప్రాణాలు కోల్పోయిందని చెప్పారు. ఈ వార్త వినగానే వరుడు కుప్పకూలాడు. అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చేరాడు. దీంతో అతడి వద్ద ఒకరిని ఉంచిన వరుడి తల్లిదండ్రులు.. అంత్యక్రియల కోసం అమ్మాయి ఇంటికి వెళ్లారు. కానీ అక్కడికెళ్లాకే వారికి అసలు విషయం తెలిసింది. కాబోయే కోడలు చనిపోలేదని.. ప్రియుడితో పరారైందని చెప్పారు.అది విన్న వాళ్లు షాక్ అయ్యారు. అబద్ధం ఎందుకు చెప్పారంటూ వధువు తరఫు వాళ్లతో గొడవకు దిగారు. పరవు పోతుందనే అబద్ధం చెప్పామని, క్షమించమంటూ కాళ్లావేళ్లా పడ్డారు. తమ కుమార్తె తప్పేమీ లేదని ఇద్దరు యువకులు ఆమెను బలవంతంగా తీసుకెళ్లారని వివరించారు. ఇప్పటికే పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని.. వాళ్లు దర్యాప్తు కూడా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదంతా విన్న వరుడి తల్లిదండ్రులు చేసేదేమీ లేక ఇంటికి తిరుగుపయనం అయ్యారు.

# చైనాకు భారీ షాకిచ్చిన ట్రంప్



**అమెరికా-నవభూమి:** అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ఎక్కడికి దారితీస్తుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోటాపోటీగా ఇరు దేశాలూ ఒకరిపై ఒకరు ప్రతీకార సుంకాలు విధించుకుంటున్నారు. తాజాగా, డ్రాగన్ కంట్రీపై ట్రంప్ సుంకాలను భారీగా పెంచేశారు. ఆ దేశం వస్తువులపై సుంకాలను 245 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించింది. చైనా వస్తువులపై ట్రంప్ ప్రతీకార సుంకాలను పెంచడంతో దీనికి ప్రతిగా చైనా కూడా భారీగా సుంకాలు పెంచింది. అమెరికా వస్తువులపై చైనా 125 శాతం సుంకాలు పెంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే చైనా వస్తువులపై 145 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. తాజాగా మరో 100 శాతం పెంచి.. 245 శాతానికి తీసుకెళ్లారు. చైనా రేర్ ఎర్త్ మెటల్స్ నిలిపివేసిన రెండు రోజుల్లోనే ఈ ప్రకటన విడుదలయ్యింది.

కొన్ని ముఖ్యమైన ఖనిజాల ఎగుమతిని చైనా నిలిపివేసింది. ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, కార్లు, విమానాలు, సెమీకండక్టర్లు, అనేక ఇతర వస్తువుల తయారీకి ఈ ఖనిజాలు చాలా కీలకం. కొత్త ఎగుమతి విధానాన్ని రూపొందిస్తోన్న డ్రాగన్.. ఇది పూర్తయ్యే వరకు కొన్ని రకాల వస్తువుల ఎగుమతిని నిలిపివేసింది. ఇది అమెరికా వంటి దేశాలకు పెద్ద దెబ్బే. . ముఖ్యంగా అమెరికా రక్షణ రంగ కంపెనీలకు సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

.ప్రపంచంలో 90 శాతం అరుదైన ఖనిజాలు చైనాలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఈ ఖనిజాలు రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధనం, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో ఉపయోగిస్తారు. సమారియం, గడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, ఇట్రియం వంటి ఏడు రకాల ఖనిజాలను ఎగుమతి నియంత్రణ జాబితాలో చేర్చారు. అమెరికాలో ఒకే ఒక అరుదైన ఖనిజాల గని ఉంది. దాని సరఫరాలో ఎక్కువ భాగం చైనా నుంచి వస్తుంది.

**ఏప్రిల్ 2నే ఆంక్షలు**

ట్రంప్ ప్రతీకార సుంకాలు ప్రకటించిన ఏప్రిల్ 2నే.. అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షలు విధించింది. ఇది కేవలం ఖనిజాలకే పరిమితం కాదు. మాగ్నెట్స్, ఇతర ఉత్పత్తుల ఎగుమతిని కూడా నిలిపివేసింది. దీనివల్ల అమెరికా తయారీదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఈ ఖనిజాలు, వాటితో తయారైన వస్తువులను ఎగుమతి చేయడానికి ప్రత్యేక అనుమతి తీసుకోవాలి. కానీ, ఈ అనుమతులు ఇచ్చే వ్యవస్థ సరిగా లేదు. దీనివల్ల పరిశ్రమల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

కాగా, ప్రతీకార పన్నుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ . కొన్ని వస్తువులపై వేసిన పన్నులను తగ్గించారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్ల వంటి వాటిపై పన్నులు ఉండవు. దీనికి సంబంధించి అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ కొత్త నిబంధనలను విడుదల చేసింది

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ గురువారం 17 ఏప్రిల్ 2025

# దిల్ రాజు న్యూ జర్నీ.. సినిమాల్లోకి ఏఐ టెక్నాలజీ



టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు సినీ రంగంలో మరో వినూత్న ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాడు. క్వాంటం ఏఐ గ్లోబల్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త వెంచర్ ద్వారా సినీ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మే 4న కంపెనీ పేరు సహా పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ప్రకటనను దిల్ రాజు యొక్క శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధికారికంగా విడుదల చేసింది, ఈ సందర్భంగా ఓ వీడియోను కూడా షేర్ చేశారు.

ఈ కొత్త కంపెనీ వినోద రంగానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేసి అందించనుంది. దిల్ రాజు ఈ సహకారం గురించి మాట్లాడుతూ, సినిమా నిర్మాణంలో ఏఐ సాంకేతికత ద్వారా కొత్త అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రకటన సినీ అభిమానులు, ఇండస్ట్రీ నిపుణులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# చూడ్డానికి సింపుల్‌గా కనిపిస్తున్నా ఎన్టీఆర్ ధరించిన షర్ట్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ చాలా లగ్జరీ పర్సన్. ఆయన వేసుకునే బట్టలు, తిరిగే కారు, పెట్టుకునే వాచ్ అన్ని కూడా చాలా కాస్ట్‌లీనే. ఒక్కోసారి ఆయన ఒంటి మీద ఉన్న వస్తువుల రేటు ఎంతో తెలుసుకునేందుకు కొంత [illegible]మంది ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ క్రమంలో వారు నోరెళ్లపెడుతుంటారు. టాలీవుడ్ హీరోలలో ఎన్టీఆర్ [illegible] చిన్న వస్తువుకు భారీగా ఖర్చు పెడతారు. లగ్జరీ కార్లు, బట్టలు, షూస్, వాచ్, ఫోన్స్ ఇలా రకరకాల వస్తువుల కోసం కోట్లు ఖర్చుపెట్టడానికి ఏ మాత్రం వెనకాడరు యంగ్ టైగర్. ఇంట్లో వేసుకునే స్లిప్పర్స్ కోసమే పది వేలు ఖర్చు పెట్టారంటే కార్ల కోసం,దుస్తుల కోసం ఏ రేంజ్‌లో ఖర్చు పెడతారో అర్థం చేసుకోవచ్చు.

ఇటీవల ఎన్టీఆర్ ఫ్యామిలీతో దుబాయ్ వెకేషన్‌కి వెళ్లాడు. అక్కడ సరదాగా చక్కర్లు కొడుతున్నాడు. ఈ క్రమంలోనే కొందరు అభిమానులని ఎన్టీఆర్ కలిసాడు.ఆ సమయంలో చాలా సింపుల్‌గా కనిపించే నీలిరంగు పూల చొక్కా ధరించాడు ఎన్టీఆర్.. చూడ్డానికి ఆ షర్ట్ సింపుల్‌గానే కనిపిస్తున్నా ఆ షర్ట్ ధర తెలిసి షాకవుతున్నారు. 'ఎట్రో' అనే బ్రాండ్ తో పిలవబడే ఈ చొక్కాఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండగా, దీని విలువ దాదాపుగా 85 వేల వరకు ఉంటుందని అంచనా. ఒక్క చొక్కాకి అంత డబ్బులు పెట్టి ఎన్టీఆర్ కొనుగోలు చేశాడు కాని మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాళ్ళు కొనగలరా చెప్పండి. ఏదేమైన ఎన్టీఆర్ రేంజే వేరు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఎన్టీఆర్ వాచ్ ల కోసం కూడా కోట్లు ఖర్చు చేస్తుంటారు. గతంలో ఎన్టీఆర్ కలెక్షన్ లో రెండు కోట్ల వాచ్ ను పెట్టుకోవడం చూశాం.ఆ తర్వాత 7 కోట్ల 47 లక్షల రూపాయల వాచ్‌ని కూడా ధరించాడు. ఇక కార్లకి అయితే ఎన్ని కోట్లు ఖర్చు పెట్టాడో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎన్టీఆర్ గ్యారేజ్‌లో ఖరీదైన కార్లు చాలానే ఉన్నాయి. మొత్తానికి కష్టపడి బాగానే సంపాదిస్తున్న ఎన్టీఆర్ మంచి లగ్జరీ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇక ఇటీవల వార్ 2 షూటింగ్ పూర్తి చేసిన ఎన్టీఆర్, త్వరలో ప్రశాంత్ నీల్ సినిమాను స్టార్ట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. అంతే కాదు దేవర 2 కూడా ప్లాన్ చేస్తున్నారట. మరి ఈ రెండు సినిమాల షూటింగ్స్ ను ఆయన ఎలా బ్యాలన్స్ చేస్తారు అనేది చూడాలి.

# ట్రోలర్స్‌కు ఖుష్బూ... కౌంటర్!




ఒకప్పుడు సౌత్‌లో టాప్ హీరోయిన్ గా చలామణి అయిన ఖుష్బూ.. చిరంజీవి, వెంకటేష్ లాంటి అగ్ర హీరోలతో నటించింది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన ఖుష్బూ పెళ్లి చేసుకున్న తర్వాత చాలా కాలం పాటూ సినీ ఇండస్ట్రీకి దూరంగానే ఉంది. మళ్లీ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ ను మొదలుపెట్టి తనదైన శైలిలో సత్తా చాటుతోంది ఖుష్బూ. సపోర్టింగ్ రోల్స్ చేస్తూ వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఖుష్బూ ఓ వైపు నటిగా ఉంటూనే మరోవైపు తన భర్త దర్శకత్వం వహించే సినిమాలకు నిర్మాతగా, రాజకీయ నాయకురాలిగా కూడా బాధ్యతల్ని తన సత్తా చాటుతోంది. అయితే ఒకప్పుడు బాగా బొద్దుగా ఉండే ఖుష్బూ ఇప్పుడు బరువు బాగా తగ్గి సన్నగా అయిన సంగతి తెలిసిందే. 54 ఏళ్ల వయసులో ఖుష్బూ ఇంత భారీగా బరువు తగ్గడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్ గా ఖుష్బూ బరువు తగ్గాక కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ బ్యాక్ టూ ఫ్యూచర్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఆ ఫోటోల్లో ఖుష్బూ గ్రీన్ కలర్ మోడ్రన్ డ్రెస్ లో ఎవరూ ఊహించనంత సన్నగా కనిపిస్తోంది. బాగా తీక్షణంగా చూస్తే కానీ ఆమె ఖుష్బూ అని గుర్తుపట్టలేనంతగా తన లుక్ మారిపోయింది. ఖుష్బూ లుక్ ని చూసి కొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతుంటే మరికొందరు మాత్రం ట్రోలింగ్స్ చేస్తున్నారు. ఈ వయసులో కూడా ఎంతో కష్టపడి బరువు తగ్గినందుకు ఖుష్బూని కొందరు మెచ్చుకుంటుంటే మరికొందరు మాత్రం ఖుష్బూ కష్టపడి బరువు తగ్గలేదని, సన్నగా అవడానికి ఇంజెక్షన్స్ చేయించుకుందని, వాటి వల్లే బరువు తగ్గిందని, ఆ ఇంజెక్షన్స్ మ్యాజిక్ ను కూడా ఫాలోవర్లకు చెప్పమని ఓ నెటిజన్ కామెంట్ చేయగా దానికి ఖుష్బూ రెస్పాండ్ అయింది. మీ ముఖాలను మీరెప్పుడూ చూపించరు. ఎందుకంటే మీరంత అసహ్యంగా ఉంటారు కాబట్టి. మీ తల్లిదండ్రులను చూస్తుంటే చాలా జాలేస్తుంది అంటూ ఖుష్బూ రిప్లై ఇచ్చింది. ఖుష్బూ షేర్ చేసిన ఫోటోలతో పాటూ ఆమె నెటిజన్ కు కౌంటర్ ఇస్తూ చేసిన ట్వీట్ కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మహేష్ ఇక టెన్షన్ పడాల్సిన పనిలేదు!




ఎస్ ఎస్ ఎంబీ 29 ప్రారంభమైతే మహేష్ వెకేషన్ల పరిస్థితి ఏంటని? సోషల్ మీడియాలో ఎన్నో కథనాలు వైరల్ అయ్యాయి. షూటింగ్ ప్రారంభమైన తర్వాత దేశం విడిచి వెళ్లే అవకాశం ఉండదని....చిత్రీకరణ పూర్తయ్యేవరకూ బాండ్ అయి పనిచేయాల్సిందేనని....మహేష్ నోట వెకేషన్ అనే మాట సినిమా రిలీజ్ తర్వాత తప్ప మధ్యలో రాదనే ప్రచారం ఓ రేంజ్ లో సాగింది. కట్ చేస్తే అవన్నీ గాలి వార్తలేనని తేలిపోయింది. ఇటీవలే మహేష్ ఎంచక్కా ఫ్యామిలీతో వెకేషన్ కి వెళ్లి మళ్లీ హైదరాబాద్ లో ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే. ఒడిశా షెడ్యూల్ అనంతరం రాజమౌళి షూటింగ్ కి బ్రేక్ ఇచ్చాడు. దీంతో ఆ బ్రేక్ ను మహేష్ వెకేషన్ కు వినియోగించుకున్నాడు. భార్య పిల్లలతో విదేశాలకు వెళ్లిపోయి రిలాక్స్ అయ్యాడు. దీన్ని బట్టి ఎస్ ఎస్ ఎంబీకి రాజమౌళి ఇలా బ్రేక్ ఇచ్చిన ప్రతీసారి మహేష్ ఫ్లైట్ ఎక్కేస్తాడని తెలుస్తోంది. అయితే ఇది అన్ని వేళలా కుదరదు. అలా ఫ్లైట్ ఎక్కాలంటే ముందు రాజమౌళి అనుమతి తప్పనసరి. ఒక షెడ్యూల్ పూర్తై మరో షెడ్యూల్ మొదలు పెట్టే ముందు అవసరం మేర రాజమౌళి వర్క్ షాప్ లు నిర్వహిస్తుంటారు. లేదా ఆ షెడ్యూల్ కి సంబంధించి ట్రైనింగ్ ఆదేశాలు కూడా జారీ చేస్తుంటారు. అలాంటప్పుడు తప్పక రాజమౌళి తో పాటే ఉండాల్సి ఉంటుంది. బాహుబలిఆర్ ఆర్ ఆర్ విషయంలో హీరోలు ఇలాగే పనిచేసారు. చరణ్, ప్రభాస్, ఎన్టీఆర్ టఫ్ గానే పనిచేయాల్సి వచ్చింది. కానీ ఇంతకన్నా కఠినంగా మహేష్ పనిచేయాల్సి ఉంది. ఎస్ ఎస్ ఎంబీ 29 అడ్వెంచర్ థ్రిల్లర్ అనేది ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో సాగే చిత్రం. షూటింగ్ ప్రారంభానికి ముందే కొన్ని రకాల శిక్షణలు మహేష్ పూర్తి చేసాడు. ఏడాదిన్నర పాటు సినిమా సెట్స్ లో ఉనే ఉంటుంది. ఈనేపథ్యంలో మధ్య మధ్యలో స్పెషల్ ట్రైనింగ్ లు అంటే అక్కడే ఉండాలి. ఒకవేళ లేకపోతే గనుక ఫ్యామిలీతో వెకేషన్ కి వెళ్లిపోవచ్చు. అందులో ఎలాంటి అడ్డంకులు ఉండవు.


# పవన్ కల్యాణ్ 'ఓజీ' ఫస్ట్ సింగిల్‌పై అప్‌డేట్ ఇచ్చిన థమన్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓజీ' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి ఒక వీడియో గ్లింప్స్ తప్ప ఎలాంటి అప్‌డేట్ రాలేదు, దీంతో ఫ్యాన్స్ కొంత నిరాశలో ఉన్నారు. పవన్ ఏ ఈవెంట్‌కు వెళ్లినా అభిమానులు 'ఓజీ.. ఓజీ' అంటూ కేరింతలు కొడుతున్నారు. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు ఎస్. తమన్ తాజాగా ఓ ఈవెంట్‌లో ఫస్ట్ సింగిల్ రిలీజ్ గురించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు.


తాజాగా ఓ ఈవెంట్‌లో మాట్లాడిన తమన్ ఈ సినిమా ఫస్ట్ సింగిల్ గతంలో విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడిందని తెలిపారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిందని, మిగిలిన షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. అంతేకాదు, పవన్ కల్యాణ్ సెట్స్‌లో అడుగుపెట్టిన రోజున అభిమానులకు గిఫ్ట్‌గా ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ వార్తతో పవన్ ఫ్యాన్స్ ఆనందంలో మునిగిపోతున్నారు. 'ఓజీ'లో పవన్ కల్యాణ్ ఒజాస్ అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు.

# 'స్పిరిట్' సెట్స్‌లోకి ప్రభాస్ అడుగుపెట్టేది అప్పుడే.!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది ఈ చిత్రం అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు.

# ఈ వింత కాంబో తమన్నా ఫేవరేట్ ఫుడ్ అట..



మిల్కీ బ్యూటీ తమన్నా ఇప్పటికీ మిల్కీ బ్యూటీ తమన్నా ఇప్పటికీ ఇండస్ట్రీలో ఫైట్ చేస్తూనే ఉంది. కొత్త భామల హవా నడుస్తున్న సమయంలో ఈ సీనియర్ భామ అవకాశాలు అంతగా అందిపుచ్చుకోలేకపోతుంది. అయితే అడపాదడపా మాత్రం ఏదో ఒక సినిమా చేస్తూ ప్రేక్షకులని అలరించే ప్రయత్నం చేస్తుంది. ఓ వైపు గ్లామర్ ఇమేజ్ కంటిన్యూ చేస్తూనే మరో వైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలతోనూ సత్తా చాటుతున్నార . ఓదెల రైల్వే స్టేషన్ మూవీకి కొనసాగింపుగా ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఓదెలా 2 ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఇందులో తమన్నా ప్రధాన పాత్ర పోషించింది. ఈ మూవీపై భారీ అంచనాలే పెట్టుకుంది. ఈ సినిమా రిలీజైన రెండు వారాల తరువాత రైడ్ 2తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ మిల్కీ భామ.అయితే ఓదెల 2 చిత్రం ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాలలో యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా తమన్నా ఓదెల 2 చిత్ర ప్రమోషన్లలో భాగంగా హైదరాబాదులో స్ట్రీట్ ఫుడ్ తింటూ కనిపించింది. ఆ సమయంలో మీకు ఇష్టమైన ఫుడ్ ఏంటని ప్రశ్నించగా ఆసక్తికర సమాధానం ఇచ్చింది. హైదరాబాద్ లోని మాదాపూర్ లో ఉన్న ఒక చాట్ స్పాట్ లో దర్శనమిచ్చిన తమన్నా తనకి స్ట్రీట్‌ఫుడ్ అంటే చాలా ఇష్టమని, అందులో హైదరాబాద్ స్ట్రీడ్ ఫుడ్‌ని చాలా ఇష్టపడతానని పేర్కొంది.దోశ ప్లస్ పావు బాజీ నా ఫేవరేట్ ఫుడ్ అని చెప్పి తమన్నా అందరు నోరెళ్లపెట్టేలా చేసింది. సాధారణంగా ఎవరైన దోశ లేదా పావుబాజీలలో ఏదో ఒకటి మాత్రమే ఇష్టంగా తింటారు. కాని తమన్నా మాత్రం ఈ రెండింటిని కలిపి తింటుందట. ఇది విని అందరు అవాక్కవుతున్నారు. ఈ కాంబో ఎలా నచ్చిందని కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం నేను స్ట్రిక్ట్ డైట్ లో ఉండడం వల్ల బ్రెడ్ తినలేను కాబట్టి ఇంట్లోనే దోశ వేసుకుని బాజీతో కలిపి తింటాను. ఈ కాంబో నాకు ఎంతో ఇష్టం అంటూ తమన్నా స్పష్టం చేసింది. బిర్యాని కూడా తనకి ఇష్టమని, హైదరాబాద్ బిర్యానీకి ఏదీ సాటి రాదని పేర్కొంది. మొత్తానికి తమన్నా ఫేవరేట్ ఫుడ్ తెలుసుకున్న నెటిజన్స్ తాము కూడా ఓ సారి అలా ట్రై చేస్తే పోలా అని అనుకుంటున్నారు.

# 'కేజీఎఫ్ ఛాప్టర్ 3' కన్ఫర్మ్.. 'సీ యు సూన్' అంటూ రాకీ భాయ్ అభిమానులకు సర్‌ప్రైజ్



కన్నడ సూపర్‌స్టార్ యశ్ నటించిన 'కేజీఎఫ్ ఛాప్టర్ 2' విడుదలై ఇటీవల మూడేళ్లు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2022 ఏప్రిల్ 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడమే కాకుండా.. రూ.1200 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బ్లాక్‌బస్టర్ ఫ్రాంచైజీకి సంబంధించి హెూంబలే ఫిల్మ్స్ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో 'కేజీఎఫ్ ఛాప్టర్ 3' గురించి హింట్ ఇచ్చారు మేకర్స్. దీంతో 'కేజీఎఫ్ ఛాప్టర్ 3 ఉండబోతుందని అభిమానులు ఉత్సాహంతో ఊగిపోతున్నారు. ఇక వీడియో చివరలో "కేజీఎఫ్ ఛాప్టర్ 3" అనే టైటిల్‌తో పాటు యశ్ రాకీ భాయ్ గొంతుతో "సీ యు సూన్" అనే సందేశం వినిపించడం ఫ్యాన్స్‌లో జోష్‌ను నింపింది. కాగా ఈ వీడియోను మీరు కూడా చూసేయండి.మరోవైపు ఈ ప్రాజెక్ట్‌పై ఓ ఇంటర్వ్యూలో యశ్ మాట్లాడుతూ, కేజీఎఫ్ 3 ఖచ్చితంగా ఉంటుంది. ప్రస్తుతం నేను 'టాక్సిక్' మరియు 'రామాయణం' ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాను. మేము డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ఈ సినిమా గురించి చర్చిస్తున్నాం. సరైన సమయంలో భారీగా రాబోతున్నాం అని తెలిపారు.

# బ్యాట్ టెస్టులో దొరికిన సునిల్ నరైన్..



**ముల్లాన్‌పూర్-నవభూమి:** కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ సునిల్ నరైన్.. బ్యాట్ టెస్ట్(%దీఫ్ ఎవర్%)లో దొరికిపోయాడు. పంజాబ్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో అతను బ్యాటింగ్ చేసేందుకు పిచ్‌పై వెళ్లడానికి ముందు.. బ్యాట్ టెస్ట్ చేశారు. ఆ పరీక్షలో సునిల్ నరైన్ విఫలం అయ్యాడు. ఆ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నది. ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత గవర్నింగ్ కౌన్సిల్ ఇటీవల క్రికెటర్ల బ్యాట్లను చెక్ చేస్తోంది.సైజుకు మించి వాడుతున్న బ్యాట్లను చెకింగ్ ద్వారా పట్టేస్తున్నారు. అయితే మంగళవారం బౌండరీ లైన్ వద్ద బ్యాట్ చెకింగ్ చేస్తున్నప్పుడు సునిల్ నరైన్ బ్యాట్ ఎక్కువ వెడల్పు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతను బ్యాట్‌ను మార్చాల్సి వచ్చింది. అయితే టోర్నీలో అతను అక్రమ రీతిలో బ్యాట్‌ను వినియోగించాడా అన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.ముల్లాన్‌పూర్‌లో జరిగన మ్యాచ్‌లో మరో బ్యాటర్ అన్రిచ్ నోర్జా కూడా బ్యాట్ పరీక్షలో చిక్కాడు. పంజాబ్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయడానికి వెళ్లిన సమయంలో బ్యాట్ చెక్ చేశాడు. బ్యాట్ సైజ్ పరిమితి దాటినట్లు గుర్తించారు. నరైన్ తరహాలోనే అతని బ్యాట్‌ను కూడా మార్పించారు. రిజర్వ్ అంపైర్ సయ్యిద్ ఖాలిద్ .. కేకేఆర్ బ్యాటర్ల బ్యాట్లను చెకింగ్ చేశాడు. బ్యాట్ పరీక్ష జరుగుతున్న సమయంలో కేకేఆర్ యువ బ్యాటర్ ఆంగ్రిశ్ రఘువంశీ అక్కడే ఉన్నాడు. అతని బ్యాట్‌కు చేసిన టెస్టులో అతను గట్టెక్కాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం .. బ్యాట్ ఫేస్ వద్ద వెడల్పు 10.79 సెంటీమీటర్లు, బ్యాట్ బ్లేడ్ వద్ద మందం 6.7 సెంటీమీటర్లు ఉండాలి. ఇక బ్యాట్ ఎడ్జ్ వద్ద వెడల్పు 4 సెంటీమీటర్లు, అలాగే బ్యాట్ పొడుగు 96.4 సెంటీమీటర్లు ఉండాలి.

# కోల్‌కతాతో మ్యాచ్‌లో విజృంభించిన చాహల్..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అందుకు కారణం ఆయన వ్యక్తిగత జీవితమే. భార్య ధనశ్రీ వర్మతో విడాకులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్ వార్తలతో నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తున్నారు. ఇప్పుడు మరోసారి తన పేరు మార్మోగిపోతోంది. ఐపీఎల్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ బౌలర్ చాహల్ అద్భుతమైన ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. తన స్పిన్ మాయాజాలంతో కీలకమైన వికెట్లు తీసి పంజాబ్ జట్టును విజయతీరానికి చేర్చాడు. దీంతో చాహల్‌పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలో ఆర్‌జే మహ్‌వశ్ పెట్టిన తాజా పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. చాహల్‌తో దిగిన సెల్ఫీ ఫొటోను తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు చేస్తూ ప్రశంసల వర్షం కురిపించింది. 'మామూలు టాలెంట్ కాదిది.. అద్భుతమైన, అసాధారణ టాలెంటెడ్ మ్యాన్. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచావు. అసంభవ్' అంటూ క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# తండ్రైన మరో క్రికెటర్.. మగబిడ్డకు జన్మనిచ్చిన సాగరిక ఘాట్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ జహీర్ ఖాన్ తండ్రయ్యారు. ఆయన భార్య, బాలీవుడ్ నటి సాగరిక ఘాట్గే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని జహీర్ %-% సాగరిక జంట బుధవారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ మేరకు ఫ్యామిలీ ఫొటోను షేర్ చేశారు. బాబుకు ఫతేసిన్హ్ ఖాన్ అని పేరు కూడా పెట్టారు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు జహీర్ సాగరిక జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. జహీర్ ఖాన్, సాగరిక ఘట్గేది ప్రేమ వివాహం. కొన్ని రోజుల డేటింగ్ అనంతరం 2017 నవంబర్‌లో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి వీరిద్దరూ ముంబయిలో ఆనందంగా జీవిస్తున్నారు. పెళ్లైన ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు ఈ జంట తొలి బిడ్డకు జన్మనిచ్చింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**